www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 21-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 175 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: చవితి సా. 6.14 తదుపరి పంచమి; నక్షత్రం: భరణి రా. 12.36 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.11.28-12.55; దుర్ముహూర్తం: ఉ.6.07-7.43; అమృతఘడియలు: రా.8.13-9.40; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.08 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మోదీ ప్రభుత్వం, సెబీ లాగా

కళ్లు మూసుకోం

అక్రమార్కులు తప్పించుకోలేరన్న స్విట్జర్లాండ్ అటార్నీ ఆఫీసు

స్విస్ ఖాతాల వ్యవహారంలో అదానీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు 2

చిరంజీవికి అక్కినేని అవార్డ్



వచ్చే నెల 28న అమితాబ్ చేతుల మీదుగా అందజేత

ఇకపై రెండేళ్లకోసారి అవార్డు ప్రదానం

నాగార్జున వెల్లడి 10

అయ్యో! ఇంత అపచారమా?



కొవ్వు కలిసిన నెయ్యితో ప్రసాదాలా?

తిరుమల లడ్డూ విషయంలో జగన్ నిర్వాకంపై సర్వత్రా భగ్గు.. కేంద్ర సర్కారు సీరియస్

రంగంలోకి దిగిన నడ్డా.. చంద్రబాబుకు ఫోన్

కేంద్రస్థాయిలో విచారిస్తామని వెల్లడి

జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలి

షా, ఏపీ డీజీపీ, సీజేఐకి న్యాయవాది లేఖలు

సీబీఐ విచారణకు కేంద్రాన్ని కోరాం: షర్మిల

ఆ ఆరోపణలపై న్యాయ విచారణ జరపండి

హైకోర్టులో నాటి టీటీడీ చైర్మన్ 'వైవీ' పిల్

తిరుమల భక్తుల ఇష్ట ప్రసాదం లడ్డూ కల్తీ వ్యవహారం జాతీయస్థాయిలో సంచలనం రేపుతోంది. శ్రీవారి లడ్డూ తయారీకి జగన్ ప్రభుత్వం వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు వెల్లడి కావడంతో.. 'కలియుగదైవానికి ఇంత అపచారమా?' అంటూ భక్తజనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్రం విచారణకు సిద్ధమైంది. ఈమేరకు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా శుక్రవారం ఏపీ సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగన్‌పైనా, కల్తీ నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్ట్ సంస్థలపైనా జాతీయ భద్రతా చట్టం కింద చర్య తీసుకోవాలని ఒక న్యాయవాది.. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు, ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. ఆ లేఖను ఆయన యూపీ డీజీపీకి కూడా పంపించారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని అమిత్‌షాకు ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల లేఖ రాశారు.

12

తిరుమల సంప్రోక్షణ

ఆలయ శుద్ధికి ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం

మంత్రులు, సీఎస్‌తో అత్యవసర భేటీ

టీటీడీ ఈవోతో రెండుసార్లు టెలికాన్ఫరెన్స్

భక్తుల విశ్వాసాన్ని కాపాడతామని హామీ

కోట్లాది మంది భక్తులను బాధిస్తోంది: రాహుల్‌గాంధీ

బాధ్యులు విచారణను ఎదుర్కోక తప్పదు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



విలేకరుల సమావేశంలో సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, దామోదర, తుమ్మల, జూపల్లి, సీతక్క, కొండా సురేఖ

హైడ్రాకు హై పవర్!

విశేషాధికారాలు కల్పిస్తూ క్యాబినెట్ నిర్ణయం.. నేడో, రేపో ఆర్డినెన్స్!

వాల్టా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ చట్టాల అధికారాలు

169 మంది అధికారులు, 946 మంది సిబ్బంది

ఓఆర్ఆర్ లోపలి కోర్ ఏరియా అంతా హైడ్రా పరిధిలోకి

ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ బాధ్యత దానిదే

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అంచనా వ్యయం 4,637 కోట్లకు

ట్రిపుల్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ

తెలుగు వర్సిటీకి సురవరం, మహిళా వర్సిటీకి ఐలమ్మ

హ్యాండ్లూమ్ సంస్థకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

8 కొత్త మెడికల్ కాలేజీలకు 3వేల పోస్టుల మంజూరు

ఈ ఖరీఫ్ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్

క్యాబినెట్ నిర్ణయాలు.. 3 గంటలపాటు సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి రాష్ట్ర ప్రభుత్వం విశేషాధికారాలు కల్పించింది. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ఆర్డినెన్స్ జారీ చేయాలని తీర్మానించింది. ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న కోర్ ఏరియా మొత్తాన్ని హైడ్రా పరిధిలోకి తెచ్చింది. ఈ ఏరియాలోని 27 మునిసిపాలిటీలు, 51 గ్రామ పంచాయతీలపై వివిధ శాఖలు, విభాగాలకు ఉన్న అధికారాలు, హక్కులు, స్వేచ్ఛను హైడ్రాకు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన సమావేశం దాదాపు మూడు గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశంలో హైడ్రాకు అధికారాలు కల్పించడంతోపాటు అదనంగా అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. దీంతోపాటు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు

మిగతా 13వ పేజీలో...

సింగరేణి కార్మికులకు దసరా బొనాంజా

లాభాల్లో 33% బోనస్ ప్రకటించిన ప్రభుత్వం.. నిరుటి కంటే 1% ఎక్కువ

సగటున ఒక్కొక్కరికి 1.90 లక్షలు.. తొలిసారి కాంట్రాక్ట్ కార్మికులకు 5వేలు 14



ఓటుకు నోటు కేసు బదిలీకి

సుప్రీం తిరస్కృతి!

ఉపోద్ఘాత అంశాలతో పిటిషన్ వేశారని వ్యాఖ్య

కేసు దర్యాప్తులో జోక్యం ఉండొద్దని రేవంత్‌కు ఆదేశం

ప్రాసిక్యూషన్‌కు సహకరించాలని ఏసీబీకి నిర్దేశం

రేవంత్ క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

రాజ్యాంగ హోదాలో జాగ్రత్తగా ఉండాలని హితబోధ

నవ నగరం



14 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ

విద్య, ఎలక్ట్రానిక్స్, ఔషధం, పర్యాటకం

నాలుగు జోన్లుగా కొత్త నగర విభజన

5 వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీలు

వెయ్యి ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సిటీ

కొత్తగా వచ్చే ఫాక్స్‌కాన్ అందులోనే

వెయ్యి ఎకరాల్లో జపాన్ కంపెనీల పార్క్

2 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు!

రాజధానికి మణిహారంగా ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత నాలుగో నగరంగా అభివృద్ధి చేయనున్న 'ఫ్యూచర్ సిటీ' న్యూయార్క్‌ను తలదన్నేలా ఉంటుందని, మౌలిక వసతులు చూసి ప్రపంచ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు బారులు కడతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఆయన కలల్ని నిజం చేసే దిశగా 13,972 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో నగర నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రధాన లక్ష్యంతో ప్రణాళిక సిద్ధమవుతోంది. సేకరించిన భూమిని నాలుగు జోన్లుగా విభజిస్తారు. ఇందులో విద్య, ఎలక్ట్రానిక్స్, ఔషధ పరిశోధన, పర్యావరణ పర్యాటకం

మిగతా 13వ పేజీలో...

విలాసాలకూ పెద్దపీట

ఫ్యూచర్ సిటీలో రేస్ క్లబ్, గోల్ఫ్‌కోర్సు.. బిలియనీర్ల కోసం ప్రత్యేక క్లబ్

పది లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి.. దాని పక్కనే మెట్రో రైలు 13

తెలియదు.. గుర్తులేదు..

మర్చిపోయా

కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు అధికారుల జవాబులివీ

వారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్

నేడు నాణ్యత నియంత్రణ విభాగం ఇంజనీర్ల విచారణ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'తెలీదు. గుర్తు లేదు.. మర్చిపోయా' ..కొన్నాళ్ల క్రితం వచ్చిన ఓ సూపర్‌హిట్ సినిమాలో హీరో డైలాగులు కావివి.. కాళేశ్వరం కమిషన్ అడిగిన ప్రశ్నలకు అధికారులు చెప్పిన సమాధానాలు! విచారణలో భాగంగా కమిషన్ శుక్రవారం పలువురు అధికారులను ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి ముందు, నిర్మాణం జరిగేటప్పుడు, జరిగాక.. మోడల్ స్టడీస్ ఏమైనా జరిగాయా? అని చీఫ్ ఇంజనీర్ శ్రీదేవిని

మిగతా 12వ పేజీలో...



కేంద్రం ఐటీ రూల్స్ రాజ్యాంగ విరుద్ధం

సమానత్వం, భావ వ్యక్తీకరణ, వృత్తి హక్కులకు భంగం

కొట్టేసిన బాంబే హైకోర్టు

ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కు స్వస్తి

సోషల్ మీడియాలో ప్రభుత్వ విమర్శకులకు ఊరట 2

హైరిస్క్ జోన్‌లో తెలుగు రాష్ట్రాలు

అసోం తర్వాత ఏపీ, తెలంగాణకు విపత్తుల ముప్పు

వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పెరుగుతున్న వర్షపాతం

దిగువకు వరద ప్రమాదం

వాతావరణ మార్పులతోనే వరదలు, కరువు 2

ఎదుర్కొనేందుకు జిల్లాల వారీ ప్రణాళికలు అవసరం

భారత వాతావరణ శాఖ విశ్రాంత డీజీ కేజే రమేశ్

జానీ మాస్టర్ చంచల్‌గూడ జైలుకు

14 రోజుల రిమాండ్ 14

దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు

చేరిన నెలలోపే ముంబైలో రేప్

భయపెట్టి ఆ తర్వాతా పలుమార్లు..

రిమాండ్ రిపోర్టులో వెల్లడి

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు మార్గం సుగమం

3 వారంలోపే కన్వీనర్ కోటా షురూ

సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ నిర్ణయం

స్థానికతపై రాష్ట్ర విద్యార్థులకు సుప్రీంలో ఊరట

హైకోర్టుకెళ్లినవారు కౌన్సెలింగ్‌కు హాజరవ్వొచ్చు

హైరిస్క్ జోన్‌లో తెలుగు రాష్ట్రాలు

- ఏపీ, తెలంగాణకు విపత్తుల ముప్పు
- ఐఎండీ విశ్రాంత డీజీ కేజే రమేశ్


విశాఖపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల ప్రభావం వల్ల రెండు తెలుగు రాష్ట్రాలు వరదలు, కరువు వంటి విపత్తులు ఎదుర్కొంటున్నాయని, అసాధారణ వాతావరణ పరిస్థితులతో దేశంలో అనేక రాష్ట్రాలు ఇదే తరహా ప్రమాదంలో ఉన్నాయని భారత వాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజే రమేశ్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మూడో రోజు శుక్రవారం ఆయన దేశంలో వాతావరణ పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'విపత్తుల విలయాలకు సంబంధించి హై రిస్క్ జోన్‌లో ఉన్న రాష్ట్రాల్లో అసోం మొదటి స్థానంలో ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి. మూడో స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో కర్ణాటక, ఐదో స్థానంలో బీహార్ ఉన్నాయి" అని చెప్పారు. వాతావరణ మార్పులతో 2000వ సంవత్సరం నుంచి విపత్తుల తీవ్రత పెరుగుతూ వస్తోందన్నారు. "తెలంగాణలో ఉత్తర, తూర్పు ప్రాంతంలో వర్షపాతం పెరుగుతోంది" అని ఆయన వివరించారు. "తూర్పు తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షపాతం పెరగడంతో దిగువన ఉన్న విజయవాడ, కృష్ణా, ఏలూరు ప్రాంతాలకు వరద పోటు ప్రమాదం ఉంది. భవిష్యత్తులో విపత్తుల తీవ్రత మరింత ఎక్కువ అవుతుంది. ఏపీలో 1,900, తెలంగాణలో 950 రెయిన్‌గేజ్ స్టేషన్లు ఉన్నాయి. 2016 నుంచి వర్షపాతం వివరాలు ప్రభుత్వం, వాతావరణ శాఖ వద్ద ఉన్నాయి. ఆ సమాచారాన్ని విశ్లేషించుకుని రెండు తెలుగు రాష్ట్రాలు అప్రమత్తమై విపత్తులు ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. ప్రతి జిల్లా, మండల స్థాయిలో విపత్తుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి" అని సూచించారు. "ఏపీలో ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షపాతం పెరుగుతోంది. ఉమ్మడి విశాఖపట్నం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల్లో తగ్గుతోంది. వరదలు/కరువు/తుఫాన్లతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలు ఎక్కువ ప్రభావితమవుతున్నాయి" అన్నారు.

28 నుంచి కైలాస- మానసరోవర యాత్ర

- కరోనా తర్వాత ఇదే మొదటిసారి

పిథోరగఢ్, సెప్టెంబరు 20: కైలాస- మానసరోవర యాత్రికులకు తీపికబురు. ఈ యాత్ర సెప్టెంబరు 28 నుంచి ప్రారంభం కానుంది. కుమావోన్ మండల్ వికాస్ నిగమ్(కేఎంవీఎన్) అనే సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఇది కేంద్ర ప్రభుత్వం, ఉత్తరాఖండ్ పర్యాటక అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ప్రారంభమైన పైలట్ ప్రాజెక్టు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులు ఉత్తరాఖండ్‌లోని పిథోరగఢ్ నుంచి చైనా సరిహద్దుల్లోని లిపు లేఖ్ పాస్ వరకు రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. అక్కడి నుంచి కైలాస పర్వతం 97 కి.మీ. పరమ శివుడు నివాసముంటాడని విశ్వసించే చోటు కైలాస పర్వతం. ఈ యాత్ర లిపు సరస్సు గుండా 1981లో మొదలైంది. కరోనా కారణంగా 2020లో నిలిపివేశారు. అయితే ఈ సంవత్సరం కేవలం 60 మందిని మాత్రమే యాత్రకు అనుమతిస్తారు. వీరిని నాలుగు బృందాలుగా విభజిస్తారు. 55 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.

లోకం తీరు



ఆయుధాలు వీడకుంటే ఆలౌట్ ఆపరేషన్!

- నక్సలైట్లు హింసను వీడి లొంగిపోవాలి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: నక్సల్స్ హింసను విడనాడాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. ఆయుధాలు వీడి లొంగిపోవాలని, లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 55 మంది నక్సల్స్ హింస బాధితులను శుక్రవారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ 2026, మార్చి 31 వరకు మాత్రమే మావోయిస్టులు తమ చివరి శ్వాస తీసుకోగలుగుతారని, అప్పటికి దేశంలో నక్సలిజం లేకుండా చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మాట వినకుంటే నక్సల్స్ ముప్పునకు ముగింపు పలికేందుకు 'ఆలౌట్ ఆపరేషన్' చేపడతామని అమిత్‌షా హెచ్చరించారు. నక్సలిజం అటు దేశ ప్రజలకు, ఇటు దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయ విజయం సాధించాయని, మోదీ సర్కార్ విధానాలతో వామపక్ష తీవ్రవాద సమస్య ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అమిత్‌షా పేర్కొన్నారు. మావోయిస్టులు గతంలో నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటు చేయాలని ప్లాన్ వేశారని, అయితే మోదీ ప్రభుత్వం దాన్ని ధ్వంసం చేసిందన్నారు. నక్సలైట్ల మానవ హక్కుల గురించి చెప్పేవాళ్లు.. నక్సలిజం బాధితుల హక్కుల గురించి కూడా ఆలోచన చేయాలని అమిత్‌షా హితవు పలికారు. ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ హింస ప్రభావిత ప్రజల కోసం కేంద్ర హోంశాఖ మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో ఒక సమగ్ర సంక్షేమ పథకాన్ని రూపొందించనున్నదని తెలిపారు.

లాలూ ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రపతి అనుమతి

- భూములకు ఉద్యోగాల కేసుపై ముందుకు సాగనున్న సీబీఐ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: తక్కువ ధరకు భూములు తీసుకొని వాటి యజమానులకు ఉద్యోగాలు ఇచ్చారన్న కేసులో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్‌ను సీబీఐ ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనుమతి ఇచ్చారు. 2004-09 మధ్య లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు బహుమతులుగా భూములను పొందడం, వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా లబ్ధి పొందారని, ప్రత్యుపకారంగా వాటి యజమానులకు రైల్వే ఉద్యోగాలు ఇచ్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. బిహార్‌లో భూములు తీసుకొని మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ కేంద్రంగా ఉన్న వెస్ట్ సెంట్రల్ జోన్‌లో గ్రూపు-డి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించింది. ఈ కేసులో లాలు, ఆయన కుటుంబ సభ్యులతో పాటు మరో 30మందికిపైగా నిందితులు ఉన్నారు. రాష్ట్రపతి అనుమతి ఇచ్చిన పత్రాన్ని సీబీఐ శుక్రవారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది.

రాహుల్ గాంధీపై ఛత్తీస్‌గఢ్‌లో 3 ఎఫ్ఐఆర్‌లు

రాయ్‌పూర్, ఢిల్లీ, సెప్టెంబరు 20: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భాగంగా ఈ నెల 9న సిక్కులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆయనపై మూడు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, బిలాస్‌పూర్, దుర్గ్ జిల్లాల్లో బీజేపీ నేతలు ఈ ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు సిక్కుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయంటూ భారత న్యాయ సంహిత సెక్షన్ 299, సెక్షన్ 302ల ప్రకారం కేసులు పెట్టారు. మరోవైపు, రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఎదుట బీజేపీ ఆందోళన నిర్వహించింది. రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.

ప్రైవేటు కాలేజీ టాయ్‌లెట్‌లో కెమెరా.. విద్యార్థి వద్ద ఎనిమిది వేల వీడియోలు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ టాయిలెట్‌లో సీక్రెట్ కెమెరా బయటపడింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఓ విద్యార్థిని శుక్రవారం అరెస్టు చేశారు. మైసూరు రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని టాయ్‌లెట్‌కు వెళ్లిన సమయంలో సీక్రెట్ కెమెరాను గుర్తించింది. భయంతో కేకలు వేస్తూ బయటకు వచ్చింది. సహ విద్యార్థులు అక్కడికి వెళ్లి విషయం తెలుసుకున్నారు. కెమెరా పెట్టిన విద్యార్థి కుశాల్‌ను పట్టుకున్నారు. కుశాల్ అదే కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ చదువుతున్నాడు. అతని వద్ద ఏకంగా ఎనిమిది వేల వీడియో క్లిప్పింగ్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నెల రోజులుగా వీడియోలు రికార్డు చేస్తున్నట్లు సమాచారం.

ఫిర్యాదుకు వెళ్తే పోలీసులే లైంగికంగా వేధించారు

భువనేశ్వర్, సెప్టెంబరు 20: ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషనుకు వెళితే పోలీసులు అరెస్టు చేసి, తనపై దాడి చేసి, లైంగికంగా వేధించారని ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఓ సైనికాధికారి స్నేహితురాలు వాపోయింది. ఈ ఘటన సంచలనం సృష్టించింది. దీనికి సంబంధించి ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు ఒడిశా పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. సస్పెండయినవారిలో ఒకరు ఇన్‌స్పెక్టర్. కాగా భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ పోలీసులు సెప్టెంబరు 15న ఆమెను అరెస్టు చేయగా.. హైకోర్టు బెయిలు ఇవ్వడంతో గురువారం విడుదల చేశారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ఆమె చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై ఆమె విలేకరులతో మాట్లాడుతూ... సెప్టెంబరు 15న తమ రెస్టారెంటును మూసివేశాక అర్ధరాత్రి తన స్నేహితుడైన సైనికాధికారితో కలిసి ఇంటికి వెళుతుండగా కొందరు వ్యక్తులు తమపై దాడి చేశారని చెప్పింది. దీంతో భరత్‌పూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోగా.. పోలీసులు తమను దూషించి, తన స్నేహితుడిని లాకప్‌లో పెట్టారని వాపోయింది. తన కాళ్లు చేతులు కట్టివేసి ఒక రూమ్‌లో పడేశారని, తర్వాత ఒక పోలీసు అధికారి వచ్చి తనను కొట్టి, లైంగికంగా వేధించినట్లు వాపోయింది. ఈ కేసును సుమోటోగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) ఒడిశా డీజీపీ నుంచి నివేదిక కోరింది.

'స్టార్ హెల్త్' వినియోగదారుల డాటా చోరీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: దేశంలోని ప్రఖ్యాత ఆరోగ్య బీమా సంస్థ అయిన స్టార్ హెల్త్ సమాచారం అపహరణకు గురయింది. దాదాపు 31 లక్షల మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, సున్నితమైన మెడికల్ రిపోర్టులు కూడా బహిర్గతమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకున్న కొందరు వ్యక్తులు టెలిగ్రాం యాప్‌లోని చాట్‌బోట్స్ ద్వారా అమ్మకానికి పెట్టారు. క్సెన్‌జెన్' పేరుతో ఓ యూజర్ చాట్‌బోట్స్ రూపొందించాడు. దాని సాయంతో స్టార్‌హెల్త్ వినియోగదారులకు చెందిన వివిధ రకాల పత్రాలు, పాలసీ, క్లెయిముల వివరాలు, మెడికల్ రిపోర్టులు, పేర్లు, ఫోన్ నెంబర్లు, అడ్రసులు, పన్ను వివరాలు, ఐడీ కార్డులు, ఇతర సమాచారం కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపాడు. దీనిపై స్టార్ హెల్త్ స్పందిస్తూ.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామంది.

అమెరికా అధ్యక్ష ఎన్నికకు అడ్వాన్స్ పోలింగ్

వాషింగ్టన్, సెప్టెంబరు 20: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. వాస్తవంగా అధ్యక్ష ఎన్నిక వచ్చే నవంబరు 5న జరగాల్సి ఉంది. అందుకు ఇంకా చాలా వారాల సమయం ఉండగానే 47 రాష్ట్రాల్లో అడ్వాన్స్ పోలింగ్ మొదలైంది. కొవిడ్ నేపథ్యంలో 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మొట్టమొదటి సారిగా అడ్వాన్స్ పోలింగ్‌కు శ్రీకారం చుట్టారు. నవంబరు 5న అధ్యక్ష ఎన్నిక జరిగే సమయానికే 10 కోట్ల మందికి పైగా ఓటర్లు వ్యక్తిగతంగానో, మెయిల్ ద్వారానో తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది.

శ్రీలంక అధ్యక్ష ఎన్నిక నేడు..స్వతంత్ర అభ్యర్థిగా రణిల్

కొలంబో, సెప్టెంబరు 20: శ్రీలంక అధ్యక్ష ఎన్నిక శనివారం జరగనున్నది. 2022 జూలై నాటి రాజకీయ సంక్షోభం దరిమిలా దేశం విడిచి పారిపోయిన అప్పటి అధ్యక్షుడు గొటబయ రాజపక్సా స్థానంలో పదవీ బాధ్యతలు చేపట్టిన రణిల్ విక్రమ సింఘే ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మొత్తం 38 మంది అధ్యక్ష బరిలో ఉన్నారు.



పశ్చిమ నౌకాదళంలోకి ఐఎన్ఎస్ విక్రాంత్

ముంబై, సెప్టెంబరు 20: అరేబియా సముద్రంలో భద్రతను మరింత పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. దేశీయంగా తయారైన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ పశ్చిమ నౌకాదళంలో చేరింది. ఈ విషయాన్ని భారత నేవీ శుక్రవారం వెల్లడించింది. ఇప్పటికే విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య సేవలందిస్తుండగా... తాజాగా ఐఎన్ఎస్ విక్రాంత్‌తో పశ్చిమ నౌకాదళంలో రెండు విమాన వాహక యుద్ధ నౌకలు చేరినట్టయింది.

కాంగ్రెస్‌ను నడిపించేది.. అర్బన్ నక్సల్స్

- 'విద్వేష దెయ్యం' ఆ పార్టీలో ప్రవేశించింది
- అబద్ధం, ద్రోహం.. కాంగ్రెస్ లక్షణాలు
- తెలంగాణ సమాజానికీ ఆ పార్టీ ద్రోహం
- నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ

వార్ధా, సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ఆ పార్టీని తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సలైట్లే నడిపిస్తున్నారని, వీరంతా అత్యంత అవినీతిపరులని, విభజనవాదులని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 138 ఏళ్ల వయసున్న కాంగ్రెస్ పార్టీ చివరకు గణపతిని పూజించినా ద్వేషిస్తోందని అన్నారు. "ఈ రోజు మీరు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ.. నాడు మహాత్మాగాంధీ వంటి గొప్ప నాయకులు కలిసి నడిచిన పార్టీ కాదు" అని వ్యాఖ్యానించారు. 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మహారాష్ట్రలోని వార్ధాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్‌లోకి విద్వేషమనే దెయ్యం ప్రవేశించింది. ఆ పార్టీలో దేశ భక్తి అనే ఆత్మ నశించిపోయింది. విదేశాల్లో మాట్లాడుతున్న ఆ పార్టీ నాయకులు(రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండా) భారత వ్యతిరేక ఎజెండాను ఎంచుకున్నారు. అవినీతిమయమైన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్సే. అత్యంత అవినీతిమయమైన కుటుంబం ఏదైనా ఉంటే అది రాచరిక కుటుంబమే(గాంధీల కుటుంబం). గణపతిని పూజించడాన్నీ వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నేను గణపతిని పూజించేందుకు వెళ్తే.. తమ బుజ్జగింపు రాజకీయాల కోసం దానిపై కూడా కాంగ్రెస్ విమర్శలు చేసింది. కర్ణాటక(కాంగ్రెస్ ప్రభుత్వం)లో గణపతిని జైల్లో పెట్టారు. మరో గణపతి విగ్రహాన్ని పోలీసు జీపు ఎక్కించారు. గణపతిని ఇంతలా అవమానించినా మహారాష్ట్రలోని కాంగ్రెస్ మిత్రులు శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)లు నోటికి తాళాలు వేసుకున్నాయి. వారి ద్వంద్వ రాజకీయాల పట్ల మనంగా అప్రమత్తంగా ఉండాలి. అబద్ధం, ద్రోహం అనేవి కాంగ్రెస్ హాల్‌మార్క్. ఈ పార్టీ విషయంలో మహారాష్ట్ర ప్రజలు జాగ్రత్తగా ఉండాలి" అని ప్రధాని వ్యాఖ్యానించారు.



వార్ధాలో విశ్వకర్మ-2024 ఎగ్జిబిషన్‌లో ప్రధాని మోదీ

తెలంగాణలో ఇచ్చిన హామీలేమయ్యాయి?

అన్నదాతల ఆశలను, ఆకాంక్షలను ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇవ్వద్దని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయాలు, అవినీతి కోసమే రైతులను వాడుకుందని దుయ్యబట్టారు. "గత ఏడాది తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ లెక్కకు విక్కిలిగా హామీలు గుప్పించింది. కానీ, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అటకెక్కించి.. తెలంగాణ సమాజానికి ద్రోహం చేసింది" అని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ప్రయత్నించలేదని విమర్శించారు. "కళాకారులు కేవలం కళాకారులుగా ఉండిపోకూడదు. వారంతా వ్యాపార వేత్తలుగా ఎదగాలన్నది మా ఆలోచన" అని ప్రధాని తెలిపారు.

మోదీ ఎక్కడున్నారు?

మోదీ మహారాష్ట్ర పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. "మహాత్మాగాంధీ-నాథూరాం గాడ్సేల మధ్య ప్రధాని ఎక్కడున్నారు" అని నిలదీసింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్.. ప్రధానికి 3 ప్రశ్నలు సంధించారు. 'రైతుల ఆత్మహత్యలు నిలువరించేందుకు బీజేపీ ఏం చేసింది? అటవీ హక్కుల చట్టం అమలులో ఆదివాసీల హక్కులను ఎందుకు పక్కన పెట్టింది? గాంధీ-గాడ్సేల మధ్య ప్రధాని ఎక్కడ ఉన్నారు?" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహారాష్ట్రలోనే రోజుకు సగటున ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిని మోదీ ఎందుకు ప్రస్తావించలేదని జైరాం నిలదీశారు.

విశ్వకర్మలకు విపణి చేరువ

ప్రపంచ మార్కెట్‌లో చేనేత రంగానికి గొప్ప గౌరవం దక్కేలా తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రధాని తెలిపారు. విశ్వకర్మ కమ్యూనిటీలకు గత ప్రభుత్వాలు చేసింది ఏమీలేదన్నారు. కేవలం ఏడాది కాలంలో 18 రకాల వృత్తులకు చెందిన 20 లక్షల మంది పీఎం విశ్వకర్మ పథకంలో చేరారని, 8 లక్షల మంది నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీల్లో, 5 వేల పట్టణ స్థానిక సంస్థల్లో విశ్వకర్మ పథకం అమలవుతోందన్నారు. హస్త కళాకారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అందుబాటులో ఉందని తెలిపారు. కాగా, విశ్వకర్మ పథకానికి ఏడాది పూర్తైన సందర్భంగా స్మారక తపాలా బిళ్లను ప్రధాని ఆవిష్కరించారు. అమరావతిలో 1000 ఎకరాల్లో నిర్మించనున్న పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్స్, అపరెల్‌పార్క్(పీఎం-మిత్ర)కు ప్రధాని శంకుస్థాపన చేశారు.

న్యాయ వ్యవస్థపైనే ఆరోపణలా?

- సీబీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: పశ్చిమ బెంగాల్‌లోని కోర్టుల్లో న్యాయ విచారణ సరిగ్గా జరగడం లేదంటూ సీబీఐ చేసిన ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బెంగాల్‌లో 2021 ఎన్నికల తర్వాత జరిగిన హింసకు సంబంధించిన కేసులను ఆ రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని సీబీఐ గతంలో వేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌ల ధర్మాసనం తాజాగా విచారించింది. అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజును ఉద్దేశించి ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'మిస్టర్ రాజు.. ఏం ఆధారాలున్నాయని బెంగాల్‌లోని అన్ని కోర్టుల్లోనూ ప్రతికూల వాతావరణం ఉందని చెబుతున్నారు.. మీ అధికారులు (సీబీఐ) ఆ రాష్ట్రాన్ని ఇష్టపడకపోవచ్చు అంతమాత్రాన అక్కడ న్యాయవ్యవస్థే సరిగ్గా పనిచేయడం లేదంటారా..? సీబీఐ లాంటి కేంద్ర సంస్థలు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. బెంగాల్ కేసులను బదిలీ చేస్తే కోర్టులే శత్రువులని ధ్రువీకరించినట్లవుతుంది. పిటిషన్‌ను ఉపసంహరించుకోండి..' అని తేల్చి చెప్పింది. దీనిపై ఏఎస్‌జీ స్పందిస్తూ.. పిటిషన్‌లో కొన్ని లోపాలున్నట్లు అంగీకరించారు. అలాగే కోర్టు అనుమతితో పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ముస్లింలు ఎక్కువుంటే పాకిస్థానా?

- మీ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వండి
- కర్ణాటక హైకోర్టు జడ్జికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: ఓ కేసు విచారణ సందర్భంగా కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానంద చేసిన వ్యాఖ్యలను శుక్రవారం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై నివేదిక సమర్పించాలని ఆ హైకోర్టును ఆదేశించింది. యజమాని-అద్దెదారు మధ్య తలెత్తిన వివాదంపై విచారణ జరిపే సమయంలో బెంగళూరులోని ముస్లిం మెజార్టీ ప్రాంతాన్ని పాకిస్థాన్‌గా అభివర్ణించారు. మరో సందర్భంలో ఆ కేసును వాదించిన మహిళా న్యాయవాదిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. "ఎదుటి పక్షం గురించి ఆమెకు చాలా తెలిసినట్టుంది. ఎంతగా అంటే వారి లోదుస్తుల రంగు కూడా చెప్పేటంతగా..." అని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టును ఆదేశించారు. దీనిపై ఆయన ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం కూడా విచారణ జరిపింది. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలపై తక్షణమే మార్గదర్శకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

సుప్రీం యూట్యూబ్ చానల్ హ్యాక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: సుప్రీంకోర్టు యూట్యూబ్ చానెల్ శుక్రవారం హ్యాకింగ్‌కు గురయింది. అమెరికాకు చెందిన రిపిల్ ల్యాబ్స్ అనే సంస్థకు క్రిప్టో కరెన్సీ ప్రకటన వీడియో దీంట్లో ప్రత్యక్షమయింది. దాంతో తాత్కాలికంగా ఆ ఛానెల్‌ను నిలిపివేశారు. రాజ్యాంగ ధర్మాసనాలు విచారించే ప్రజా ప్రయోజన కేసులను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి సుప్రీంకోర్టు ఈ ఛానెల్‌ను నిర్వహిస్తోంది.

ఐటీ రూల్స్ రాజ్యాంగ విరుద్ధం!

సమానత్వం, భావ వ్యక్తీకరణ, వృత్తి హక్కులకు భంగం

- నిబంధనలను కొట్టేసిన బాంబే హైకోర్టు
- కేంద్రం ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌కు చెక్

ముంబై, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో అమల్లోకి తెచ్చిన ఐటీ రూల్స్‌ను బాంబే హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకు ఉద్దేశించిన ఐటీ రూల్స్ రాజ్యాంగ వ్యతిరేకమని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ఇద్దరు సభ్యుల డివిజన్ బెంచ్ గత జనవరిలో ఈ అంశంపై భిన్న తీర్పులు ఇవ్వడంతో జస్టిస్ ఎ.ఎస్.చంద్రశేఖర్‌కు తీర్పు బాధ్యతను అప్పగించారు. శుక్రవారం ఆయన తీర్పును వెలువరించారు. ఐటీ రూల్స్ రాజ్యాంగంలోని సమానత్వం హక్కు(ఆర్టికల్ 14), భావ వ్యక్తీకరణ హక్కు(ఆర్టికల్ 19), నచ్చిన వృత్తిని చేసుకొనే హక్కు(ఆర్టికల్ 19(1)(జి))లను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని జస్టిస్ చంద్రశేఖర్ తన తీర్పులో పేర్కొన్నారు. వ్యక్తులు నచ్చిన పని చేసుకోవడంపై ఎలాంటి నియంత్రణ విధించవచ్చో ఆర్టికల్ 19(6)లో ఉందని, అలాంటి పరిస్థితి ఇక్కడ లేదని చెప్పారు. ఐటీ రూల్స్‌లో పేర్కొన్న "తప్పుడు, అబద్ధపు, తప్పుదోవ పట్టించే" అనే పదాలు వ్యక్తపరిచే భావం అస్పష్టంగా ఉందని, స్పష్టమైన నిర్వచనం లేదని తెలిపారు. ఐటీ రూల్స్‌ను సవాలు చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కర్మ, ఎడిటర్స్ గిల్డ్, మరికొందరు ఈ పిటిషన్‌ను వేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన తప్పుడు, అబద్ధపు సమాచారాన్ని గుర్తించేందుకు ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్న ఐటీ రూల్స్ నిబంధనలను సవాలు చేశారు. గత జనవరిలో ఈ అంశం విచారణకు వచ్చినపుడు జస్టిస్ గౌతమ్ పటేల్ ఐటీ రూల్స్‌ను కొట్టేయగా, జస్టిస్ నీల గోఖలే ఐటీ రూల్స్‌ను సమర్థించారు. తాజాగా జస్టిస్ చంద్రశేఖర్ కూడా ఐటీ రూల్స్‌ను కొట్టేశారు. డిజిటల్ మీడియా నైతిక ప్రవర్తనా నియమావళిగా భావించే 2021 నాటి ఐటీ రూల్స్‌ను సవరిస్తూ 2023 ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చింది. ఆ ఉత్తర్వు ప్రకారం పీఐబీ ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. ఆ యూనిట్ ప్రభుత్వ కార్యకలాపాలకు వ్యతిరేకంగా తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లాంటి సోషల్ మీడియా వేదికల మీద వస్తే గుర్తించి సదరు సోషల్ మీడియా సంస్థకు సమాచారం అందజేస్తుంది. ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ నుంచి సమాచారం అందిన వెంటనే సదరు సోషల్ మీడియా సంస్థ ఆ పోస్టును తీసేయడమో లేక ఈ సమాచారం విశ్వసనీయతపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని చెప్పడమో చేయాలి. మౌనంగా ఉండటం కుదరదు. రెండో ఆప్షన్ తీసుకుంటే ఆ పోస్టుపై ప్రభుత్వం తీసుకొనే చట్టపరమైన చర్యల విషయంలో సోషల్ మీడియా సంస్థకు ఎలాంటి రక్షణ ఉండదు. ఈ ఏడాది మార్చి 20న ఐటీ రూల్స్ అమల్లోకి వచ్చాయి. మార్చి 11న విచారణ జరిగినపుడు వాటిపై స్టే ఇచ్చేందుకు జస్టిస్ చంద్రశేఖర్ నిరాకరించారు. ఒక సమాచారం తప్పో ఒప్పో అని నిర్ధారించే అధికారం కోర్టుకు ఉండాలే తప్ప ప్రభుత్వానికి కాదని పిటిషనర్లు వాదించారు. సోషల్ మీడియా సంస్థలు అనవసరపు న్యాయవివాదాలను, తద్వారా తలెత్తే ఖర్చులను తప్పించుకొనే ప్రయత్నంలో ప్రభుత్వం సూచించిన అన్ని పోస్టులను తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కునాల్ కర్మ తాను రాజకీయ విమర్శకుడనని, తన కంటెంట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వం ఐటీ రూల్స్‌ను అడ్డం పెట్టుకొని తన కంటెంట్‌ను ఏకపక్షంగా తొలగించే అవకాశం ఉందని, తన సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసే ప్రమాదం ఉందని వాదించారు. తన కంటెంట్ తప్పుడుది అని కేంద్ర ప్రభుత్వం ఒకసారి ప్రకటించిన తర్వాత కోర్టుకు వెళ్లడం తప్ప తనకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేదని గుర్తు చేశారు. కాగా, ఐటీ రూల్స్ రాజ్యాంగ విరుద్ధమంటూ బాంబే హైకోర్టు తీర్పునివ్వడానికి ఎడిటర్స్ గిల్డ్ స్వాగతించింది.



మోదీ ప్రభుత్వం, సెబీ లాగా కళ్లు మూసుకోం

- స్విస్ ఖాతాల వ్యవహారంలో అదానీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- అక్రమార్కులు తప్పించుకోలేరన్న స్విట్జర్లాండ్ అటార్నీ ఆఫీసు

బెర్న్ (స్విట్జర్లాండ్): స్విట్జర్లాండ్‌లో అదానీ గ్రూప్ పప్పులు ఉడికేలా లేవు. ఈ నెల 12న తమ ఫెడరల్ క్రిమినల్ కోర్టు స్తంభింప చేసిన 31 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,589 కోట్లు) బ్యాంకు ఖాతాల్లోని నిధులు ఏ భారత పారిశ్రామికవేత్తవి? ఈ ఖాతాల్లోకి ఆ నిధులు ఎలా వచ్చాయనే విషయాలపై స్విస్ అటార్నీ జనరల్ ఆఫీస్(ఓఏజీ) దర్యాప్తు చేస్తోంది. అయితే ఈ దర్యాప్తు వివరాలను వెల్లడించేందుకు ఓఏజీ నిరాకరిస్తోంది. కనీసం ఈ ఖాతాల వెనక ఎవరున్నారనే విషయం చూచాయగా వెల్లడించేందుకు కూడా ఇష్టపడడం లేదు. అయితే తమ దర్యాప్తు నరేంద్ర మోదీ ప్రభుత్వం, మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చేపట్టినట్టుగా తూతూమంత్రంగా ఉండదని, నిజాల నిగ్గు తేల్చి అక్రమార్కుల భరతం పట్టేలా ఉంటుందని ఓఏజీ అధికార వర్గాలు తెగేసి చెబుతున్నాయి. అసలు దోషులెవరో తేల్చాక, తమ చట్టాల ప్రకారం వారిపై భారీ జరిమానాలతో పాటు జైలు తప్పదని స్పష్టం చేశారు. నిజానికి ఈ ఖాతాలు స్తంభింపచేసినప్పుడే స్విస్ మీడియా ఈ ఖాతాల అసలు మాయగాళ్లు ఎవరో స్పష్టమైన సంకేతాలే ఇచ్చింది. అదానీ సోదరుల్లో ఒకరైన వినోద్ అదానీ ఈ రహస్య ఖాతాల నిధులతో భారత్‌లోని అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల దందా నడిపిస్తున్నట్టు హిండెన్‌బర్గ్ గతేడాదే బయటపెట్టింది. అయితే దీనికి ఆధారాల్లేవని సెబీ.. సుప్రీంకు తెలపడంతో అదానీలు బయట పడ్డారు.

ఆ వివరాలూ చెప్పం: సెబీ

మరోవైపు ఈ మొత్తం వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ పాత్రపై అనుమానాలు తొలగడం లేదు. ఆమె ఏ ఏ కంపెనీల ఫైల్స్ తన పరిశీలనకు వచ్చినప్పుడు ఆమె ఆ బాధ్యత నుంచి తప్పుకున్నారనే వివరాలు వెల్లడించేందుకు సెబీ నిరాకరిస్తోంది. ఆర్‌టీఐ కింద లోకేశ్ బాత్రా అనే ఒక మాజీ సైన్యాధికారి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సెబీ నిరాకరించింది. తన, తన కుటుంబ సభ్యుల ఆర్థిక ఆస్తుల వివరాలు ఆమె సెబీకి ఎప్పుడు వెల్లడించారు? అందుకు సంబంధించిన పత్రాల కాపీలు ఇచ్చేందుకు కూడా సెబీ అంగీకరించడం లేదు.

ఇజ్రాయెల్‌పై 140 రాకెట్లతో దాడి!

- లెబనాన్‌లో దాడులకు ప్రతిగానే: హిజ్బుల్లా
- ఇజ్రాయెల్ దాడుల్లో హిజ్బుల్లా కమాండర్ మృతి

జెరూసలెం, సెప్టెంబరు 20: ఉత్తర ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా రాకెట్ల వర్షం కురిపించింది. శుక్రవారం 140 రాకెట్లతో దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌లో దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులకు దిగినట్లు తెలిపింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు మిలటరీ బ్యారెక్స్‌పై ఈ దాడులు జరిపినట్లు ప్రకటించింది. లెబనాన్ సరిహద్దుల నుంచి మూడు విడతలుగా రాకెట్లు దూసుకొచ్చిన విషయాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ కూడా ధ్రువీకరించింది. ఎక్కువ శాతం రాకెట్లు మైదాన ప్రాంతాల్లో పడినట్లు తెలిపింది. మరోవైపు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ విమానాలు ఎడతెరిపి లేకుండా దాడులు చేస్తున్నాయి. వైమానిక దాడుల్లో 100 రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ వాయుసేన జరిపిన దాడిలో వెస్ట్‌బ్యాంక్‌లోని క్యాబాటియాలో కీలక ఉగ్ర కమాండర్ షాదీ జక్రానే హతమైనట్లు ఐడీఫ్ ప్రకటించింది. బీరుట్‌లో జరిపిన లక్షిత దాడుల్లో హిజ్బుల్లా అగ్ర కమాండర్ ఇబ్రహీం సహా 8మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపింది. కాగా, లెబనాన్‌లో పేజర్లు, వాకీటాకీల పేలుళ్లలో 879 మంది హిజ్బుల్లా సభ్యులు మరణించినట్లు హిజ్బుల్లా అంతర్గత నిఘా విభాగం పత్రాల ద్వారా వెల్లడైంది.

తెలంగాణ విద్యార్థులకు ఊరట

నీట్ స్థానికతపై హైకోర్టుకు వెళ్లినవారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నీట్ కౌన్సెలింగ్ స్థానికత వ్యవహారంలో తెలంగాణ విద్యార్థులకు ఊరట లభించింది. హైకోర్టును ఆశ్రయించినవారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. కౌన్సెలింగ్‌కు సమయం తక్కువగా ఉండడంతో ఈ ఒక్కసారికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. వైద్య విద్య ప్రవేశాల కోసం తెచ్చిన జీవో 33లోని నిబంధన 3(ఎ)ను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి నాగ నరసింహ అభిరామ్, మరికొందరు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తాము తెలంగాణ స్థానికులమేనని, కేవలం ఒకట్రెం డేళ్లు ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు అనర్హులుగా ప్రకటించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత ఈ నెల 5న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విద్యార్థులకు సానుకూలంగా తీర్పు వెలువరించింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని అభిప్రాయపడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాల మేరకు ప్రతి విద్యార్థికి స్థానిక కోటా వర్తింపజేయాలని ఆదేశించింది. స్థానికతపై హైకోర్టు తీర్పును ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. మెడికల్ సీట్ల కేటాయింపునకు సంబంధించి నాలుగు రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. అయినప్పటికీ మరోసారి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. తొలుత నీట్ పరీక్షల్లో స్థానికతకు సంబంధించి ప్రతి విద్యార్థి స్థానికుడై ఉండాలని, 9, 10, 11 తరగతులు రాష్ట్రంలో చదివి ఉండాలని స్పష్టం చేశారు. తెలుగు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ పాఠశాల, కళాశాల, ఉన్నత చదువులు విదేశాల్లో పూర్తిచేసి నీట్‌కు తెలంగాణలో హాజరయ్యారని వివరించారు. దీనివల్ల తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీకి చెందిన విద్యార్థులు తెలంగాణలో నీట్ పరీక్ష రాసి అర్హత సాధిస్తున్నారని, కానీ ఏపీలో తెలంగాణ వారికి అవకాశం లేదని తెలిపారు. స్థానికతపై తెలంగాణ తీసుకువచ్చిన కొత్త జీవోను హైకోర్టు నిలిపివేసిందని వాదనలు వినిపించారు.

నీట్ ఫలితాలకు వారం ముందే జీవో

నీట్ పరీక్ష ఫలితాలకు కేవలం వారం రోజుల ముందే తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో తెచ్చిందని విద్యార్థుల తరఫు న్యాయవాది మురళీధర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అందుకే.. జీవోను హైకోర్టు నిలిపివేసిందని తెలిపారు. ఈ క్రమంలో సింఘ్వీ కలుగజేసుకుని ఉమ్మడి ప్రాంతానికి సంబంధించిన 371(డి) పదేళ్ల వరకు ఉంటుందని, ఆ గడువు ముగియడంతో కొత్త నిబంధనను తెచ్చారని గుర్తు చేశారు. ఒకసారి మినహాయింపు కింద విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెప్టెంబరు చివరి వారంలో తొలి, అక్టోబరు మొదటి వారంలో రెండో కౌన్సెలింగ్ ఉన్నదని, విద్యార్థుల ప్రయోజనం కోరి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 14న చేపడతామని స్పష్టం చేసింది.

సీఎంఆర్ ధాన్యం మాయం..

మానుకోట జిల్లాలో రైస్‌మిల్లు యజమానిపై కేసు

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలో బీఆర్ఎస్ మాజీ మంత్రి కుటుంబానికి చెందిన లక్ష్మీ పారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌పై రాష్ట్ర సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. లక్ష్మీపారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌కు 2022-23 రబీలో 62,579 క్వింటాళ్ల ధాన్యాన్ని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు ఇచ్చారని, ఇందుకుగాను 42,553 క్వింటాళ్ల బియ్యాన్ని మిల్లు యాజమాన్యం ఇవ్వాల్సి ఉందని అధికారులు తెలిపారు. ధాన్యం విలువ రూ.6.49 కోట్లని, మిల్లు యాజమాన్యం ఇప్పటి వరకు బియ్యం ఇవ్వకపోవడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల సమయంలో మిల్లులో ధాన్యం బస్తాలు లేవని, వాటిని యాజమాన్యం అమ్ముకున్నట్టు చెప్పారు. దాడుల సందర్భంగా మిల్లు యాజమాని అందుబాటులోలేరన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మిల్లు యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు మార్గం సుగమం!

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు మార్గం సుగమమైంది. స్థానికతపై హైకోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విషయాన్ని సుప్రీం కోర్టుకు తెలియజేసింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని, ఆ మేరకు ప్రతి విద్యార్థికి స్థానిక కోటా వర్తింపజేయాలన్న హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే విధించింది. దీంతో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుప్రీం ఆదేశాలను చూసిన తర్వాత కౌన్సెలింగ్ ఎలా చేపట్టాలన్న దానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మూడు, నాలుగు రోజుల్లోనే కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంది. నెల చివరికి తొలి విడత కౌన్సెలింగ్ పూర్తి చేయనున్నట్లు సమాచారం. తొలుత కన్వీనర్, తర్వాత మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ అక్టోబరు 15 నాటికి పూర్తి కానుంది. అన్ని రకాల కౌన్సెలింగ్‌ను అక్టోబరు చివరికి పూర్తి చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నాయి. ఈ మేరకు జరగకుంటే సుప్రీం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

24122 మంది దరఖాస్తు

ఈ ఏడాది నీట్‌లో తెలంగాణ నుంచి 47 వేల మంది అర్హత సాధించారు. ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోగా, యాజమాన్య, సి-కేటగిరీలో మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. అఖిల భారత కోటాకు చెందిన 15 శాతం సీట్లు, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయింది. ఇంకా రెండు విడతలు జరగాల్సి ఉంది. అఖిల భారత కోటా తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయిన వెంటనే మన దగ్గర మొదటి విడత నిర్వహించాలి. ఈ ఏడాది మాత్రం స్థానికత కారణంగా బాగా ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

'బాలశక్తి'తో బంగారు భవిత

- విద్యార్థుల ఆరోగ్య, ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం
- 6-12వ తరగతులకు అవగాహన తరగతులు
- నిర్మల్ కలెక్టర్ అభిలాష వినూత్న ఆలోచన



బాలశక్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థులు



నిర్మల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల మెరుగైన భవిష్యత్ కోసం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యతతోపాటు నైపుణ్యాభివృద్ధిపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'బాలశక్తి' పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్మల్ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి అమలు చేస్తున్నారు. బాలశక్తిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, జూనియర్ కాలేజీ స్థాయిలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం కింద విద్యార్థులకు పోషక విలువలు కలిగిన మంచి ఆహారాన్ని అందిస్తారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, శారీరక, మానసిక ఆరోగ్యంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. అలాగే, విద్యార్థులను బ్యాంకులు, న్యాయస్థానాలు, పోస్టాఫీసులు, పోలీసు స్టేషన్లు, పంచాయతీ కార్యాలయాలు, మీ సేవా, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల పర్యటనలకు తీసుకెళ్లి. వివిధ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, బ్యాంకర్ల సహకారంతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీంతో పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కలుగుతుందని, అది వాళ్లని జీవితంలో ఉన్నతస్థాయికి తీసుకెళుతుందనేది ఆలోచన. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి విద్యార్థుల పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్ ఈ బాలశక్తికి రూపకల్పన చేశారు. బాలశక్తిని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు జిల్లాలోని 52 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. అంతేకాక, నిర్మల్‌లోని కస్బా మైనారిటీ గురుకుల పాఠశాలలో బాలశక్తి కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు.

బాలశక్తితో అనేక ప్రయోజనాలు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాలశక్తి కార్యక్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను ఈ కార్యక్రమంలో చేర్చాం. ఇక, క్షేత్రస్థాయి పర్యటనలు, వ్యక్తిగత అనుభవాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయి. పాఠశాలల్లో వైద్య శిబిరాల ఏర్పాటు చేసి హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేస్తాం. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, వ్యాధులు, ఒత్తిడిని ఎదుర్కోవడం, స్వీయ రక్షణ అంశాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించాం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

బీసీ హాస్టల్‌లో విద్యార్థికి పాముకాటు

సిరిసిల్ల జిల్లా గాలిపెల్లిలో ఘటన



ఇల్లంతకుంట, సెప్టెంబరు 20: సంక్షేమ హాస్టళ్లలో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తే ఘటన ఒకటి జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో రమావత్ రోహిత్(12) అనే ఆరో తరగతి విద్యార్థి శుక్రవారం పాము కాటుకు గురయ్యాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన రమావత్ రోహిత్ ఈ ఏడాదే గాలిపెల్లిలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చేరాడు. శుక్రవారం ఉదయం హాస్టల్ నుంచి కి.మీ దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లాడు. అయితే, తల తిప్పుతోందని రోహిత్ ఉపాధ్యాయులకు చెప్పగా మరో విద్యార్థిని సాయంగా ఇచ్చి హాస్టల్‌కు పంపేశారు. హాస్టల్‌కు చేరుకున్న రోహిత్ తన గదిలో విశ్రాంతి తీసుకుంటుండగా ఓ నాగుపాము రోహిత్ కుడి చేతి మీద కాటేసింది. దీంతో రోహిత్ కేకలు వేయగా అక్కడికి చేరుకున్న హాస్టల్ వాచ్‌మెన్.. పాము కాటు వద్ద కట్టుకట్టి రోహిత్‌ను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఆస్పత్రికి అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. కాగా, రోహిత్‌ను కాటేసిన పాము గదిలోని ట్రంకు పెట్టెల మధ్య చాలా సేపు ఉండగా స్థానికులు దానిని కొట్టి చంపారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ గ్రామానికి దూరంగా పొలాల మధ్య ఉంటుంది.

వడదెబ్బ, పిడుగుపాటు, విద్యుత్ షాక్‌తో

ముగ్గురు రైతుల మృతి

చిట్యాల, తాండూరు, కారేపల్లి, సెప్టెంబరు 20 : వడదెబ్బ, పిడుగుపాటు, విద్యుత్ షాక్‌తో ముగ్గురు రైతులు మృతి చెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన బండారి సదయ్య(62) చేనుకు శుక్రవారం పురుగుల మందు పిచికారి చేస్తూ ఎండ తీవ్రతను తట్టుకోలేక కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచలాపూర్‌కు చెందిన మహిళా రైతు గోలెం పోసక్క(62) పిడుగుపాటుతో మృతి చెందింది. పొలంలో కలుపు తీస్తుండగా శుక్రవారం సాయంత్రం పిడుగు పడి చనిపోయింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామపంచాయతీ కొత్తురుతండాకు చెందిన ధారవత్ హథిరాం(36) శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పత్తి చేనులో కోతులను తరుముతున్న హథిరాం.. పక్కచేను కంచెకు తగిలి చనిపోయాడు.

ఉద్యమాలకు సాయుధ పోరాటమే స్ఫూర్తి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్/గజ్వేల్, సెప్టెంబరు 20: ప్రజా ఉద్యమాలకు సాయుధ పోరాటమే స్ఫూర్తి అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో 76వ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన గొడవగా బీజేపీ వక్రీకరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరుల స్ఫూర్తితో యువ కమ్యూనిస్టులు ప్రభుత్వాల విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సూచించారు. కాగా, వికారాబాద్ జిల్లా పూడూరు వద్ద మూసీ-కాగ్నా నదుల పరీవాహక ప్రాంతంలో ఉన్న దామగుండం అటవీ భూముల్లో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటును కూనంనేని వ్యతిరేకించారు. రాడార్ ఏర్పాటు వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దేశంలో లక్షల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, అక్కడ రాడార్ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నీళ్ల మంటలు!

సింధు నదీజలాల ఒప్పందాన్ని సవరించుకుందామంటూ ఇటీవల భారతదేశం ఇచ్చిన నోటీసుకు పాకిస్థాన్ తనదైన ధోరణిలో స్పందించింది. ఆరుదశాబ్దాలనాటి ఆ ఒప్పందాన్ని సమీక్షించి, సవరించుకోవాలని భారత ప్రభుత్వం గత ఏడాది కూడా పాకిస్థాన్‌ను డిమాండ్ చేసింది. అప్పట్లో తీవ్రంగా స్పందించిన పాకిస్థాన్ ఈ మారు మాత్రం కాస్తంత తగ్గింది. పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని ఎంతో గౌరవిస్తుందని, భారత్ కూడా అలాగే భావిస్తూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని హితవుచెప్పింది. తొమ్మిదేళ్ళ సుదీర్ఘచర్చల అనంతరం 1960లో నెహ్రూ–అయూబ్‌ఖాన్ సంతకాలు చేసిన ఈ ఒప్పందంలో పటిష్ఠమైన నిబంధనలు, పలుదశల వివాద పరిష్కారమార్గాలు ఉన్నందునే అది ఇప్పటికీ బలంగా నిలబడింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీజలాల పంపకాలకు ఇది ఆదర్శమని కూడా అంటారు. మరీముఖ్యంగా, భారత్–పాకిస్థాన్ మధ్య ఇన్ని దశాబ్దాలుగా వీసమెత్తు సయోధ్య లేకున్నా, చివరకు యుద్ధాలు జరిగినా ఈ ఒప్పందం నిలిచింది. అయితే, కిషన్‌గంగ, రాటిల్ జల విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో రెండుదేశాల మధ్యా ఉన్న వివాదం ఈ ఒప్పందాన్ని ప్రమాదంలో పడవేసేట్టు కనిపిస్తోంది.

పరిస్థితులు, అవసరాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ఒప్పందాన్ని తిరగరాసుకోవాలని భారత్ వాదిస్తూ, పెరిగిన జనాభా, క్లీన్ ఎనర్జీ, పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం తదితర కారణాలను భారత్ ప్రస్తావించింది. నోటీసులు ఇవ్వడానికి ఇవన్నీ సముచిత కారణాలేనన్నది అటుంచితే, సరిహద్దు ఉగ్రవాదం హెచ్చినప్పుడో, కశ్మీర్‌తో అవసరాలు పెరిగినప్పుడో ఈ ఒప్పందాన్ని భారత్ తరచుగా పాకిస్థాన్‌కు గుర్తుచేస్తూ ఉంటుంది. గత ఏడాది ఇచ్చిన నోటీసుకు ఇప్పటిది కొనసాగింపు మాత్రమేనని, ఈ రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల విషయంలో పాకిస్థాన్ ఒత్తిడికి లొంగకూడదన్న పట్టుదలతోనే భారత్ ఈ విధంగా వ్యవహరిస్తున్నదని అంటారు. సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా సింధు, జీలం, చీనాబ్ నదులు పాకిస్థాన్‌కు దక్కాయి. రావి, బియాస్, సట్లెజ్ భారతదేశానికి వచ్చాయి. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిగా కుదిరిన ఈ ఒప్పందం సజావుగా అమలుజరగడానికి సింధు శాశ్వత కమిషన్ ఏర్పాటైంది, రెండు దేశాలనుంచి అందులో కమిషనర్లు ఉన్నారు. చీనాబ్, జీలం నదులమీద జమ్మూ కశ్మీర్‌లో ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల అంశాన్ని ద్వైపాక్షిక చర్చలతో పరిష్కరించుకోవచ్చునన్నది భారత్ వాదన. కానీ, తనవాటా నదులమీద వీటి నిర్మాణంపై పాకిస్థాన్ దశాబ్దంన్నరకాలంగా రచ్చచేస్తున్నది. భారత్ స్వేచ్ఛగా ఉపయోగించుకోగలిగే జలాల పరిధిలోనే ఈ ప్రాజెక్టులు ఉన్నా, ఆ జలాలను విద్యుత్ వినియోగానికి తప్ప భారత్ ఇతరత్రా వినియోగించుకోకున్నా, ప్రవాహాలకు ఆటంకం కాకున్నా ఈ ప్రాజెక్టులను పాకిస్థాన్ వ్యతిరేకిస్తోంది. నిజానికి హేగ్ ఆర్బిట్రేషన్‌కోర్టు అనుమతించిన మేరకే జీలం నదిమీద కిషన్‌గంగ ప్రాజెక్టు పూర్తయింది. చీనాబ్ మీద రాటిల్ మాత్రం పూర్తికాని స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో, సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా వివాద పరిష్కారానికి తటస్థ నిపుణుడిని నియమించవలసిందిగా పాకిస్థాన్ ప్రపంచబ్యాంకును 2015లో కోరింది. అది జరిగిన మరుసటి ఏడాది పాకిస్థాన్ ఆ ప్రతిపాదన ఉపసంహరించుకొని, హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టునుంచి న్యాయం కావాలన్నది. ఇందుకు కూడా ప్రపంచబ్యాంకు తలూపడంతో భారత్‌కు ఆగ్రహం కలిగింది. అంతవరకూ తటస్థ నిపుణుడికి సహకరించిన భారతదేశం హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టు విచారణకు మాత్రం గైర్హాజరైంది. తనకు దక్కాల్సిన నీటిని ఈ రెండు ప్రాజెక్టులు అడ్డుకుంటున్నాయన్న పాకిస్థాన్ ఆరోపణకు తగిన ఆధారాలు లేవని భారతదేశం అంటోంది. పాక్ ఒత్తిడికి లొంగి ప్రపంచ బ్యాంకు ఏకకాలంలో రెండు సమాంతర ప్రక్రియలకు అనుమతించడం సరికాదనీ, భిన్నమైన తీర్పులతో మరింత గందరగోళం ఏర్పడుతుందనీ భారత్ వాదన. వివాద పరిష్కారానికి తనకు అర్హత ఉన్నదని హేగ్ కోర్టు ఇటీవల చెప్పినప్పటికీ, ముందుగా తటస్థ నిపుణుడే అమీతుమీ తేల్చాలని భారత్ వాదన. హేగ్ కోర్టు తీర్పును అడ్డుకోవడానికే సింధు నదీజలాల ఒప్పందాన్ని తిరగదోడాలన్న ప్రతిపాదన భారత్ తెస్తోందని పాకిస్థాన్ ఆరోపణ. 850 మెగావాట్ల రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టును రక్షించుకోవడానికి వీలుగా, పాకిస్థాన్ మెడలు వంచేందుకు భారత్ ఈ ప్రతిపాదన చేస్తున్నదని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

'జమిలి' సిఫారసు శాసనమయ్యేనా?

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఒక అత్యున్నతస్థాయి కమిటీని నియమించడంలో ప్రభుత్వ నిజ ఉద్దేశం ఆ కమిటీ పరిశీలనాంశాలు బహిర్గతం చేశాయి. 'ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరీక్షించి సిఫారసులు చేయాలని...' మొదటి పరిశీలనాంశం నిర్దేశించింది. లోక్‌సభ ఎన్నికలు, 29 రాష్ట్రాల, (శాసనసభ ఉన్న) కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం సాధ్యమూ, వాంఛనీయమూ అన్నది ఆ అత్యున్నత స్థాయి కమిటీకి ప్రభుత్వ సూచిత ఆదేశం. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా సిఫారసు చేయాలనే ఆదేశం ఆ కమిటీకి లేదు. ఆ కమిటీ నిష్ఠాపూర్వకంగా ఆ ఆదేశాన్ని పాటించింది.

ఆ అత్యున్నత స్థాయి కమిటీ కూర్పు సైతం ప్రభుత్వ వాస్తవ ఉద్దేశాన్ని వెల్లడించింది. చైర్మన్, 8 మంది సభ్యులలో రాజ్యాంగ నిపుణుడు ఒకే ఒక్కరు ఉన్నారు. మరో సభ్యుడు పార్లమెంటరీ కార్యసరళిలో ప్రవీణుడు. అయితే ఆయనకు న్యాయవాద వృత్తిలోను, న్యాయ శాస్త్ర బోధనలోను బొత్తిగా ఎటువంటి అనుభవంలేని వ్యక్తి. ఇద్దరు రాజకీయవేత్తలుగా మారిన బ్యూరాక్రాట్లు. ముగ్గురు జీవితాంతం సివిల్ సర్వెంట్లు. సరే, ఆ అత్యున్నతస్థాయి కమిటీకి రామ్‌నాథ్ కోవింద్‌ను చైర్మన్‌గా నియమించడం అలంకార ప్రాయానికే అని చెప్పవచ్చు. కాదూ, ఆ కమిటీకి గాంభీర్యం, హుందా సంతరించేందుకు అయివుంటుంది. ఆ కమిటీ ఏమైనా కావచ్చు కాని, అది కచ్చితంగా రాజ్యాంగ కోవిదుల సంఘం కానేకాదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అందరూ ఊహించినట్టుగానే లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు ఐదేళ్లకొకసారి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. నాకు తెలిసినంతవరకు ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి రివాజు లేదు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ ఎన్నికల విధానాలు పోల్చదగిన నమూనాలు. అమెరికాలో ప్రతినిధుల సభ (కాంగ్రెస్ దిగువ సభ)కు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. దేశాధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్ల పదవులకు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. అయితే ఏకకాలంలో కాదు. కాంగ్రెస్ ఎగువ సభ సెనేట్‌కు ఆరు సంవత్సరాల వ్యవధిలో మూడు ద్వివార్షిక ఎన్నికలు జరుగుతాయి. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీలోని రెండు రాష్ట్రాలకు ఇటీవల ఎన్నికలు జరిగాయి. వాటి వాటి ఎన్నికల క్రమం ప్రకారమే అవి జరిగాయి. ఆ క్రమం బుండేస్టాగ్ (నేషనల్ పార్లమెంట్)కు జరిగే ఎన్నికల క్రమానికి భిన్నమైనది.

ఫెడరల్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య భావనకు విరుద్ధమైన ప్రతిపాదనను కోవింద్ కమిటీ అధ్యయనం చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు ప్రతిరోజూ జవాబుదారీగా ఉండాలి. కార్యనిర్వాహక వర్గానికి ధ్రువపరిచిన పదవీకాలం ఉండదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని అనుసరించే విషయమై రాజ్యాంగ సభ కూలంకషంగా చర్చించింది. అధ్యక్ష తరహా పాలనా వ్యవస్థను రాజ్యాంగ నిర్మాతలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపే వారు మొగ్గారు. భారతదేశ వైవిధ్యం, బహుళత్వంకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థే బాగా సరిపోతుందని వారు దృఢంగా విశ్వసించారు.



> ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదం పొందలేవు. బహుళ సంస్కృతులతో, అన్నిటా అపార వైవిధ్యమున్న ఈ సువిశాల భారతదేశంపై ఒకే ఎన్నికల విధానాన్ని రుద్దేందుకే ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రతిపాదనను ఉద్దేశించారు. ఆ ప్రతిపాదన ఆచరణ సాధ్యంకానిది. అది నిష్ప్రయోజనకరమైనది.

కోవింద్ కమిటీ నివేదిక కొందరికి మాత్రమే అర్థమయ్యే బీజగణిత సూత్రాలు, అతిగా సరళీకరించిన న్యాయ సూత్రీకరణల కలగూర గంప. ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనను అమలుపరిచేందుకు రాజ్యాంగాన్ని విధిగా సవరించవలసిన అవసరమున్నదని కోవింద్ కమిటీ అంగీకరించింది. కొత్త అధికరణలు 82ఎ, 83(3), 83(4), 172(3), 172(4), 324ఎ, 325(2), 325(3) ప్రవేశపెట్టడంతో పాటు అధికరణ 327ను సవరించవలసి ఉన్నది. ఈ కొత్త నిబంధనలు, సవరణలు ఒక రాష్ట్ర అసెంబ్లీ పదవీకాల ముగింపు తేదీ, లోక్‌సభ పదవీకాల ముగింపు తేదీ సమకాలికమయ్యేలా చేస్తాయి. ప్రభుత్వం తలపెట్టినట్టు నవంబర్–డిసెంబర్ 2024లో రాజ్యాంగ సవరణలను ఆమోదించారని అనుకుందాం. ఏకకాలంలో ఎన్నికలు 2029లో జరగవలసి ఉంటుంది. మరి 2025, 2026, 2027, 2028 సంవత్సరాలలో జరిగే రాష్ట్ర శాసనసభ (ఇవి మొత్తం 24)ల పదవీకాల వ్యవధి 1 నుంచి 4 సంవత్సరాల పాటు తగ్గిపోతుంది! 2027లో ఒక శాసన సభను ఎన్నుకోవడమంటే కేవలం రెండు సంవత్సరాలకు మాత్రమే అవుతుంది. 2028లో ఎన్నుకునే శాసనసభలు కేవలం ఒకే ఒక్క సంవత్సరం మాత్రమే ఉంటాయి! ఇటువంటి ఎన్నికలను సదరు రాష్ట్రాల ప్రజలు, రాజకీయ పార్టీలు అంగీకరిస్తాయా? మరి ప్రజల తీర్పు త్రిశంకు సభ (హంగ్ అసెంబ్లీ) ఏర్పడడానికి మాత్రమే దారితీస్తే ఏమి చేయాలి? ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో విశ్వాసాన్ని కోల్పోతే ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏమిటి? ఒక ముఖ్యమంత్రి రాజీనామా చేసినప్పుడు ముఖ్యమంత్రి పదవికి పోటీ పడేవారు అవసరమైన మెజారిటీని కూడగట్టుకోలేనప్పుడు ఏమి చేయాలి? అటువంటి పరిస్థితుల్లో సభ ఐదేళ్ల పదవీ కాలంలో మిగిలిన కాలానికి కొత్త అసెంబ్లీని ఎన్నుకునేందుకు మళ్లీ ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది కదా. ఆ కొరవ కాలం కేవలం కొన్ని నెలలు మాత్రమే ఉండవచ్చు సుమా! అటువంటి ఎన్నికలు ప్రహసనప్రాయమవుతాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అపార ధనబలం ఉన్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు (ఎన్నికల బాండ్లతో సంపద్వంతమైన రాజకీయ పార్టీలున్న విషయాన్ని విస్మరించకూడదు) మాత్రమే అటువంటి ఎన్నికలలో పోటీ చేస్తారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే కోవింద్ కమిటీ సిఫారసులు ముఖ్యమంత్రి తన అధికారాన్ని నిలుపుకునేందుకు బాగా ఉపయోగపడతాయి. అసెంబ్లీని రద్దు చేస్తాననే బెదిరింపుతో అసంతృప్త ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి కట్టడి చేయగలుగుతాడు.

కోవింద్ కమిటీ సిఫారసులు మన ఎన్నికల చరిత్రను గమనంలోకి తీసుకోలేదు. అత్యధిక ప్రజల ఆలోచనలకు అవి విరుద్ధంగా ఉన్నాయి. 1951 నుంచి 2021 దాకా ఏడు దశాబ్దాల కాలంలో రాజకీయ అస్థిర పరిస్థితులు కేవలం రెండు దశాబ్దాల (1981–1990, 1991–2000)లో మాత్రమే ఉన్నాయి. 1999 నుంచి అసాధారణ స్థాయిలో రాజకీయ సుస్థిరత నెలకొనివుంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు / శాసనసభలు తమ ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేశాయి. దఫాలు, దఫాలుగా జరిగే ఎన్నికలు ఆర్థికాభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేయదు. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో 7.5 శాతం సగటు వార్షిక వృద్ధిరేటును సాధించాయి. తమ పదేళ్ల పాలన అంతకంటే మెరుగైన వృద్ధిరేటును సాధించిందని ఎన్డీఏ పదే పదే చెప్పుతోంది. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన రాజ్యాంగ సవరణలకు సంబంధించిన బిల్లులకు పార్లమెంటు ఆమోదాన్ని ఎన్డీఏ ప్రభుత్వం తప్పక పొందగలుగుతుందని కోవింద్ కమిటీ భావించినట్టుంది. ఆ కమిటీ కచ్చితంగా పొరపడిందని చెప్పక తప్పదు. ఎందుకని? పార్లమెంటులో ఆ బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు ఉన్నదా? లోక్‌సభలో ప్రతిపక్షం 182 మంది ఎంపీల మద్దతును కూడగట్టుకోగలుగుతుంది. రాజ్యసభలో విపక్షానికి 83 మంది ఎంపీలు ఉన్నారు. ఉభయ సభలలోను ఆ సవరణ బిల్లులు ఎట్టి పరిస్థితులలోను ఆమోదం పొందలేవు బహుళ సంస్కృతులతో, అన్నిటా అపార వైవిధ్యమున్న ఈ సువిశాల భారతదేశంపై ఒకే ఎన్నికల విధానాన్ని రుద్దేందుకే ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రతిపాదనను ఉద్దేశించారు. ఆ ప్రతిపాదన ఆచరణ సాధ్యంకానిది. అది నిష్ప్రయోజనకరమైనది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)


అన్యమతస్థులతో అన్యోన్య బంధం

భిన్న మతాలకు చెందినవారు శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించేలా చేయడమెలా? ఇది, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న మహా సవాళ్లలో ప్రధానమైనది. మత సంబంధమైన అధిక సంఖ్యాక వాదం ప్రాతిపదికన పశ్చిమాసియా, దక్షిణాసియాలలో జాతి–రాజ్యాల ఏర్పాటు, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలకు క్రైస్తవేతరుల వలసలు తీవ్ర కలహాలు, తరచు హింసాత్మక ఘర్షణలకు కారణమయ్యాయి. దురహంకారం, ఆధిక్యతా భావన పదే పదే సహనం, పరస్పర అవగాహనపై విజయం సాధిస్తున్నాయి.

భిన్న మతాల మధ్య మరింత అవగాహనను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అమెరికా విద్వజ్జుడు థామస్ ఆల్బెర్ట్ హోవార్డ్ తన పుస్తకం 'The Faith of Others : A History of Interreligious Dialogue'లో ప్రేరణాత్మకంగా స్పష్టపరిచారు. హోవార్డ్ పుస్తకం ప్రధానంగా క్రైస్తవంపై దృష్టిని కేంద్రీకరించింది. క్రైస్తవ ధర్మశాస్త్రజ్ఞులు ఒకప్పుడు తమ మతమే నిజమైన మతమని సునిశ్చితంగా విశ్వసించేవారు. ఆ విషయమై గట్టిగా వాదించేవారు. ఇరవయో శతాబ్దంలో ఈ ధోరణి క్రమంగా మారింది. ఆధ్యాత్మిక అహంకారానికి పేరుబడిన రోమన్ కేథలిక్ చర్చ్ 1960లలో ఇతర మతాలను అంగీకరించడం ప్రారంభించింది. 1964లో పోప్ జారీ చేసిన ఒక ఆదేశంలో 'వివిధ క్రైస్తవేతర మతాల నైతిక, ఆధ్యాత్మిక విలువలను గుర్తించి, గౌరవించాలని' పేర్కొన్నారు.

మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించి, ప్రోత్సహించిన ఇద్దరు ప్రముఖ భారతీయుల గురించి హోవార్డ్ తన పుస్తకంలో విపులంగా రాశారు. వారిలో మొదటి వ్యక్తి మొగల్ చక్రవర్తి అక్బర్. 1952లో ప్రముఖ చరిత్రకారుడు మఖన్‌లాల్ రాయచౌధురి రాసిన 'దీన్ ఇ ఇలాహి : అక్బర్ మతం' అనే పుస్తకం ఆధారంగా అక్బర్ గురించి హోవార్డ్ రాశాడు. ఆయన ఉటంకించిన ఆ చక్రవర్తి లేఖ ఒకటి నన్ను బాగా చకితుడిని చేసింది. తన సమకాలికుడు అయిన స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖ అది. యూదులు, ముస్లింలను స్పెయిన్ నుంచి బహిష్కరించిన తరువాత ఆ యూరోపియన్ దేశంలో కేథలిక్ క్రైస్తవ మత విశ్వాసాలు, సిద్ధాంతాలలో సంకుచితత్వం పెరగసాగింది. భారత్ నుంచి స్పెయిన్ నేర్చుకోవాలని రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖలో అక్బర్ సూచించాడు. 'ఇక్కడ తాను పుట్టి పెరిగిన, జ్ఞానార్జనకు, స్వీయ జీవన రీతులకు ఆలంబనగా ఉన్న మతాన్ని అనుసరించడంలో కారణాల గురించి ఎవరూ విచారణశీలురు కారు. ప్రతి ఒక్కరూ తమ స్వీయ మత మార్గంలో నడుస్తారు. తద్వారా మానవ మేధ ఉత్కృష్ట లక్ష్యమైన సత్యాన్ని తెలుసుకొనే సాధ్యాసాధ్యాల నుంచి తమకు తాము మినహాయింపబడతారు. ఈ కారణంగా మేము మా దేశంలో అన్ని మతాల ఆచార్యులు, విద్వాంసుల సదస్సులు నిర్వహించి, వారి సునిశితమైన చర్చలు, వివేకదాయక ప్రవచనాలు, ఉజ్వల ఆశంసల నుంచి జ్ఞానవంతులమవుతుంటాము'.

మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించిన రెండవ మహోన్నత భారతీయుడు స్వామి వివేకానంద. అక్బర్‌కు కొన్ని శతాబ్దాల తరువాత జీవించిన వివేకానంద గురించి హోవార్డ్ సుదీర్ఘంగా రాశారు. 1893లో షికాగోలో జరిగిన సర్వ మత ప్రతినిధి సభలో వివేకానంద ప్రసంగానికి ప్రాధాన్యమిచ్చారు. తొలుత ఆ సభ లక్ష్యాలను ప్రస్తావించి వివేకానంద ప్రసంగ భాగాలను ఉటంకించారు. వాటిలో మొదటిది : 'సకల ప్రపంచానికి సహనాన్ని, విశ్వజనీనతను బోధించే ఒక శ్రేష్ఠమైన మతానికి చెందినవాడినని నా గురించి చెప్పుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. విశ్వ



> హిందూ పాకిస్థాన్‌ను సృష్టించడానికి ఆరాటపడుతున్న హిందూత్వ.. సంపూర్ణ పెత్తనం చెలాయించలేక పోతున్నప్పటికీ క్రమంగా ప్రబలమవుతోంది. గాంధీ ప్రబోధించిన, ఆచరించిన మత సమైక్యతా మార్గ స్ఫూర్తిని భారతీయులు పునరుద్ధరించుకోవలసిన అవసరమున్నది. రాజకీయవేత్తలే కాదు సామాన్య పౌరులు సైతం అన్య మతాల వారితో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సమున్నత విలువలు, సంప్రదాయాల పునరుజ్జీవానికి తప్పనిసరైన తొలి అడుగు.

విశాలమైన సహనాన్నే కాక, మేము సమస్త మతాలూ సత్యమైనవే అని ఆమోదిస్తాము. ఈ సమస్త ధాత్రిపైన అసహనానికీ, హింసకు గురి అయిన అన్ని మతాల వారినీ, అన్ని దేశాలకు చెందిన వారిని, వారు శరణార్థులై వచ్చినప్పుడు ఆదరించి, వారికి భద్రత కలిపించిన ఉదారమయమైన మతం మాది అని చెప్పుకోవడానికి నేను గర్విస్తున్నాను'. రెండో ఉటంకింపు మరింత ముఖ్యమైనది: 'మత వైషమ్యం, అంధ విశ్వాసం. దీని భయంకర ప్రవృత్తి అయిన మత విద్వేష మాత్సర్యం ఈ సుందరమైన ధరిత్రిని ఎంతకాలంగానో అంటి పెట్టుకొని ఉండనే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఈ మత మహాసభ గౌరవార్థం మోగిన ఘంటా నాదం అన్నిరకాల మత మూర్ఖత్వాన్ని, మత పరమైన హింసాపరత్వాన్ని కత్తితోనో లేదా కలంతోనో సాగించే మత దౌర్జన్యాన్ని, ఒక గమ్యాన్ని ఆశించి గమించే వారి మధ్య వైమనస్యాన్ని తుదముట్టించే మృత్యుఘంటిక అవుతుందని ఆశిద్దాం'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

మహాత్మాగాంధీని కదాచిత్తుగా హోవార్డ్ ప్రస్తావించారు. ఆయన మత చింతనను లోతుగా పరామర్శించలేదు. వాస్తవానికి గాంధీ ఒక మత బహుళత్వ వాది. అక్బర్, వివేకానంద కంటే మరింత ప్రగాఢమైన, మౌలికంగా భిన్నమైన మత చింతకుడు. హిందూయేతర మతాలతో ఆయన తన సంభాషణను సాగించడమే కాదు ఒక సామాజిక కార్యక్రమంగా కూడా దాన్ని ఆచరించారు. దక్షిణాఫ్రికాలోను భారత్‌లోను ఆయన నిర్వహించిన సత్యాగ్రహాలు సమస్త ప్రపంచ మతాలకు చెందిన వారిని తమ ప్రభావశీల పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించాయి. ఆయన ఆశ్రమాలలో భిన్న మతాలకు చెందినవారు ఉండేవారు. నిరంతరం సన్నిహితంగా, పరస్పర గౌరవాదరాలతో కలసిమెలసి ఉండేవారు. గాంధీ ఆశ్రమాలలో రోజూ జరిగే సర్వ మత ప్రార్థనా సమావేశంలో భిన్న మతాల పవిత్ర గ్రంథాల నుంచి గీతాలు, శ్లోకాలు, సూక్తులు చదివేవారు, గానం చేసేవారు. ఇదొక వినూత్న, మత అనుష్ఠానం. యుద్ధాలతో సంక్షుభితమవుతున్న నేటి ప్రపంచానికి ఆ మానవీయ మతాచరణ ఉపయుక్తత ఎంతో ఉంది. నాస్తికుల వలే కాకుండా మానవ అవగాహనాశక్తికి అతీతమైన ఒక సర్వోన్నత శక్తి, ఒక ఉత్కృష్ట స్ఫూర్తి ఉందని గాంధీ అంగీకరించేవారు. మత విశ్వాసుల వలే కాకుండా తన మతమే భగవంతుడికి ఒక ప్రత్యేక, ఉన్నతోన్నతమైన బాట నిర్మించిందని గాంధీ ఎన్నడూ విశ్వసించలేదు. 1924లో 'భగవంతుడు ఒక్కడే' అన్న వ్యాసంలో ఆయన ఇలా పేర్కొన్నారు: భారతావని నుంచి ఇస్లాం, క్రైస్తవంను తొలగించాలని హిందువులు ఆశించడం ఒక పనికిమాలిన విషయం, అదొక వ్యర్థ వ్యవహారం మాత్రమే అవుతుంది. అలాగే ముస్లింలు తాము విశ్వసించే ఇస్లాం మాత్రమే ఈ ప్రపంచాన్ని ఏలాలని కోరుకోవడమూ వ్యర్థమే... సత్యం ఏ ఒక్క మతం, ఏ ఒక్క మత గ్రంథం సొంత సొత్తుకాదు. అటువంటి సంకుచితత్వాలను తిరస్కరించిన ఉదాత్తుడు కనుకనే మత మార్పిడులను ఏ మతస్థుడు చేపట్టినా దాని ప్రయోజనాన్ని గాంధీ సంశయించేవారు. 'మిషనరీ కార్యకలాపాల మూల కారణంలో తాము విశ్వసించే మతం తమకే కాదు యావత్ప్రపంచానికి నిజమైనది, ఏకైక మోక్ష ప్రదాయిని' అన్న భావన ఉంటుంది. అయితే భగవంతుడు లక్షలాది మార్గాలలో మనకు సామీప్యంలో ఉన్నాడనేదే సత్యం. దీన్ని మనం అర్థం చేసుకోలేకపోతున్నాం. ఈ దృష్ట్యా మిషనరీ కార్యకలాపాలలో నిజమైన వినయం అనేది కొరవడింది. తన గురించి గాంధీ ఇలా చెప్పుకున్నారు: 'ఒక ఆదివాసీ కంటే నేను ఆధ్యాత్మికంగా సమున్నతుడిననే భావన నాకు లేదు. ఆధ్యాత్మిక ఆధిక్యతా భావం చాలా ప్రమాదకరమైనది'. తన సొంత మతానితో పాటు ఇతర మతాలనూ గౌరవించడం, భిన్న మతాల ప్రజలతో స్నేహపూరితంగా ఉండడం అనేది కేవలం గాంధీ వ్యక్తిగత అభీష్టం కాదు అదొక రాజకీయ అనివార్యత కూడా. 1941లో కాంగ్రెస్ సభ్యులు ప్రతి ఒక్కరూ అనుసరించి తీరవల్సిన 'నిర్మాణ కార్యక్రమం' నొకదాన్ని గాంధీ ప్రతిపాదించారు. ఒక చిన్న పుస్తకంలో దాన్ని వివరించారు. ఆ పుస్తకంలో ఆయన ప్రస్తావించిన అంశాలలో అస్పృశ్యత రద్దు, ఖాదీ ప్రచారం, మహిళా భ్యున్నతి, ఆర్థిక సమానత్వాన్ని సాధించడం మొదలైనవి ఉన్నాయి. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఈ నిర్మాణ కార్యక్రమంలో మొదటి ప్రాథమికాంశం 'మత సమైక్యత. మత సామరస్యాన్ని సాధించేందుకు మొట్టమొదటి ఆవశ్యకం ప్రతి కాంగ్రెస్‌వాది తన మతం ఏమైనప్పటికీ హిందూ, ముస్లిం, క్రైస్తవ, జోరాష్ట్రియన్ మతాల ప్రతినిధిగా భాసించాలి. భారత్‌లోని కోట్లాది ప్రజల అస్తిత్వంతో మమేకమవ్వాలి. ప్రతి హిందువు, హిందూయేతరుడు ఆ విధంగా ప్రవర్తించాలి. ఇందుకు ప్రతి కాంగ్రెస్‌వాది తన వ్యక్తిగత స్నేహ సంబంధాలలో తన సొంత మతస్థులతో పాటు అన్య మతస్థులను కూడా విధిగా భాగస్వాములుగా చేసుకోవాలి. తన సొంత మతం పట్ల చూపుతున్న గౌరవాన్నే ఇతర మతాల పట్ల కూడా చూపాలి.

ఇది గాంధీ సునిశ్చిత విశ్వాసం. దాన్ని ఆయన అంతః ప్రేరణ, చిత్తశుద్ధితో అనుష్ఠానించారు. ఆయన స్నేహితులు, సహచరులలో హిందువులు కానివారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారి జాబితాను చూడండి. ముస్లింలు: అబ్దుల్ కడెర్ బావాజీర్, ఎ.ఎమ్. సచాలియా, అబుల్ కలామ్ ఆజాద్, జకీర్ హుస్సేన్, అసఫ్ అలీ, రైహ్నా త్యాబ్జీ; క్రైస్తవులు: జోసయ్య ఓల్డ్ ఫీల్డ్, జోసెఫ్ డోక్, సిఎఫ్ ఆండ్రూస్, జె.సి. కుమారప్ప; మరియెల్ లెస్టర్, రాజ్‌కుమారి అమృత్ కౌర్; పార్శీలు: దాదా భాయి నౌరోజీ, జీవాన్జీ రుస్తోమ్జీ, ఖుర్షీద్ నౌరోజీ; యూదులు: హెర్మన్ కాలెన్ బాఖ్, సోంజా షెల్సిన్, హెన్రీ పోలక్, ఎల్‌డబ్ల్యు రిట్చ్; జైనులు: ప్రాణ్ జీవన్ మెహతా, రాయిచంద్; నాస్తికులు: గోరా (గోపరాజు రామచంద్రరావు).

హిందూ పాకిస్థాన్‌ను సృష్టించడానికి ఆరాటపడుతున్న హిందూత్వ సంపూర్ణ పెత్తనం చెలాయించలేకపోతున్నప్పటికీ క్రమంగా ప్రబలమవుతోంది. గాంధీ ప్రబోధించిన, ఆచరించిన మత సమైక్యతా మార్గ స్ఫూర్తిని భారతీయులు పునరుద్ధరించుకోవలసిన అవసరమున్నది. ఇది వారి తక్షణ కర్తవ్యం. మతం పేరిట సొంత దేశాన్ని సాధించుకున్న పాకిస్థానీయులు ఇస్లామిక్ మెజారిటేరియనిజంకు ప్రాధాన్యమివ్వడం ద్వారా మరింత శాంతి కాముకులు అయ్యారా? కనీసం మరింత సంపద్వంతులూ కాలేకపోయారు. శ్రీలంకలోనూ బౌద్ధుల ఆధిపత్య వాదం శాంతి సామరస్యాలకు దారితీయలేదు. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయవేత్తలే కాదు సామాన్య పౌరులు సైతం అన్య మతాల వారితో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సమున్నత విలువలు, సంప్రదాయాల పునరుద్ధరణకు తప్పనిసరైన తొలి అడుగు అవగలదు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మోదీ పాలనకు ప్రజాభి'వంద'నం

వికసిత్ భారత్ సంకల్పం సాకారం లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ బలమైన పునాదులు వేస్తున్నారు. ఒక నిర్ణయాత్మక, మహా సంకల్ప సాధన కోసం మార్గనిర్దేశనం చేస్తున్నారు. మునుపెన్నడూ లేనిరీతిలో సమాజంలోని ప్రతి వర్గానికి సాధికారతనిచ్చేలా దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటూ, సంక్షేమ పథకాలు చివరి వ్యక్తి వరకు చేరేలా పాలన అందిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా పేదలు, మధ్యతరగతి, అణగారిన ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారు. మోదీ 3.0 మొదటి వంద రోజుల పాలనలో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో వ్యవసాయం, మౌలిక వసతులు సహా వివిధ కీలక రంగాలకు పెద్దపీట వేశారు.

ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. మోదీ పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో గత వంద రోజుల పాలనలో మోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. దేశ ప్రగతిలో గణనీయ భాగస్వామ్యం రీత్యా వ్యవసాయానికి భవ్యమైన భవిష్యత్తును కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. రైతుల సమస్యల పరిష్కారంతో పాటు ఆదాయం రెట్టింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఇటీవల పీఎం కిసాన్ నిధి 17వ వాయిదా కింద 9.3 కోట్ల మంది రైతులకు 20 వేల కోట్లు అకౌంట్లలో జమచేసింది. వంద రోజుల పాలనలో వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ.. గ్రామీణ పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీలకు అండగా నిలిచేలా 750 కోట్ల రూపాయలతో 'అగ్రిష్యూర్' పథకాన్ని ప్రారంభించింది. గోధుమలను నిల్వ ఉంచడానికి 3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ధాన్యాగారాలను ఏర్పాటు చేసింది. 2024–25 ఖరీఫ్ సీజన్‌కు కనీస మద్దతు ధరను పెంచి, రైతాంగానికి రూ.2 లక్షల కోట్లు ప్రయోజనం చేకూర్చింది.

వ్యవసాయాన్ని సుస్థిరం చేసేందుకు ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాలకు విధివిధానాల రూపకల్పన చేసింది. విపత్తుల నుంచి రైతులను రక్షించేందుకు అవసరమైన వ్యవస్థను నిర్మించింది. 2 వేల కోట్ల నిధులతో 'మిషన్ మౌసం' పథకాన్ని ప్రవేశపెట్టింది. మత్స్యకార రంగం బలోపేతానికి 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేసింది. ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రూ.28,602 కోట్లతో దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీస్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 2,361 కోట్ల నిధులతో ఒక ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని తెలంగాణలోని జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ పారిశ్రామికాభివృద్ధి మరింత వేగంగా ముందడుగు వేయనుంది. హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణం జరగనుంది.

ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారతదేశంలో లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేసేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, బొగ్గు, ఇనుప ఖనిజం, ఉక్కు, సిమెంట్, బాక్సైట్, సున్నపురాయి, అల్యూమినియం పౌడర్, గ్రానైట్, బ్యాలస్ట్, కంటైనర్లు మొదలైన సరుకుల రవాణాకు కనెక్టివిటీ పెంచడంపై దృష్టి సారించింది. ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, సరుకు రవాణా వ్యయాన్ని తగ్గించడం, చమురు దిగుమతి, కర్బన ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా, రోడ్డు, రైలు, ఓడరేవులు, వైమానికమార్గాల కనెక్టివిటీని, ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడం కోసం 3 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టింది. ప్రపంచంలోనే 10 అత్యుత్తమ ఓడరేవుల్లో ఒకటిగా నిలిచేలా 76,000 కోట్ల నిధులతో మహారాష్ట్రలో 'వదవాన్' ఓడరేవుకు శంకుస్థాపన చేసింది. వివిధ రాష్ట్రాలలో 900 కిలోమీటర్ల మేరకు రైల్ నెట్‌వర్క్‌ను విస్తరించేలా 24,600 కోట్ల రూపాయలతో 8 నూతన రైల్వే లైన్ ప్రాజెక్టులు ప్రారంభించింది. ఇందులో తెలంగాణ నుంచి కూడా ఓ రైల్వే లైను ఉంది. 4,109 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో.. భద్రాచలం–మల్కన్‌గిరి మధ్య 173 కి.మీ.ల ప్రాజెక్టుకు ఆమోదముద్ర పడింది. 900 కిలోమీటర్ల మేర 8 జాతీయ రహదారుల అభివృద్ధికి 50,600 కోట్ల రూపాయలు కేటాయించింది.

దేశంలో 70 ఏళ్ల దాటిన వయోవృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా వర్తింపచేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దాదాపు 4.5 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. వృద్ధులు 5 లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స సౌకర్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఖరీదైన మూడు కేన్సర్ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. మెడికల్ కాలేజీల సంఖ్య పెంచి, అదనంగా 75 వేల సీట్లను పెంచి వైద్య విద్యను ప్రోత్సహిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగంలో సృజనాత్మకతకు పెద్దపీట వేసేలా.. రూ.10,600 కోట్లతో విజ్ఞాన్ ధారా పథకాన్ని ప్రారంభించింది. భారతదేశం నానాటికీ బలం పుంజుకోవడానికి మూలం దేశంలోని యువశక్తే. అందుకే వారిని మరింత శక్తిమంతం, స్వయంసమృద్ధం చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. అందుకు అనుగుణంగా యువతకు ఉపాధి, స్వయంఉపాధి లక్ష్యంగా ఎన్నడూ లేనిరీతిలో అవకాశాలు కల్పించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం 2 లక్షల కోట్ల నిధులతో ప్రధానమంత్రి ప్యాకేజిని ఏర్పాటుచేసింది. దీంతో 4.1 కోట్ల మంది యువతకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీని నిరోధించి, పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. తెలంగాణలో పేపర్ లీకేజీలతో లక్షల మంది యువత జీవితాలు బుగ్గిపాలయ్యాయి. కీర్తి (ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్) కార్యక్రమం తీసుకొచ్చి, అనేక మంది క్రీడాకారులకు ప్రోత్సహిస్తోంది.

మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై స్టాంప్ డ్యూటీ తక్కువ ఉండేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తోంది. నారీ శక్తికి లబ్ధి చేకూర్చేలా అభివృద్ధి పథకాలకు 2024–25 బడ్జెట్‌లో 3 లక్షల కోట్లు కేటాయించింది. 48 లక్షల మంది స్వయం సహాయక బృందాల సభ్యులకు లబ్ధి చేకూరేలా 4.3 లక్షల మందికి 2,500 కోట్ల రూపాయలతో రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేసింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, సంరక్షణ కోసం, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టింది.

> ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. మోదీ పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో గత వంద రోజుల పాలనలో మోదీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంది.




కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యువజన పథకం కింద భారీ సబ్సిడీ పథకాన్ని తీసుకొచ్చింది. 3.5 లక్షల ఇండ్లలో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నది. దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే క్రమంలో రెన్యూయబుల్ ఎనర్జీ (సోలార్+విండ్+హైడ్రోజన్)పై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను నిర్ధారించింది. పెట్రోలులో 20 శాతం ఇథనాల్ మిక్స్‌తో రైతులకు సంవత్సరానికి రూ.50 వేల కోట్ల అదనపు ఆదాయం లభించనుంది. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రతి రైల్వేస్టేషన్ సీలింగ్‌పై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తున్నది. దేశ వ్యాప్తంగా 63,000 గ్రామాల్లోని 5 కోట్ల మంది గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రధానమంత్రి జన్ జాతియా ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని తీసుకొచ్చింది. చెత్త సేకరించే వారి కోసం నమస్తే పథకానికి శ్రీకారం చుట్టి, వారి సామాజిక, ఆర్థిక సాధికారతకు దోహదపడుతోంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందడానికి 2.9 లక్షలకు పైగా దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం వలస చట్టాల స్థానంలో మూడు కొత్త క్రిమినల్ చట్టాలు తెచ్చింది. వీటిలో శిక్ష కన్నా న్యాయంపైనే దృష్టి పెట్టింది. 2250 కోట్ల నిధులతో నేషనల్ ఫోరెన్సిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టి సకాలంలో, శాస్త్రీయంగా ఆధారాల పరిశీలన చేస్తున్నది. ఒడిశా, జార్ఖండ్, బిహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌ల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పూర్వోదయ ప్రణాళిక రూపొందించారు. మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం, ప్రతి కార్యక్రమం వికసిత్ భారత్ @2047కు దోహదం చేసేదే.

■ కె. లక్ష్మణ్

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు





వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నో స్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

7



నెత్తుటి చరిత్ర!

మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20 ఏళ్లు

- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- ఉద్యమ యోధులను బలితీసుకున్న కరోనా
- రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతల మృతి
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన ఓరుగల్లు విప్లవయోధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే..
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

విప్లవాల పురిటి గడ్డ ఓరుగల్లు.. ఎన్నో నక్సల్స్ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రాంతం. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టుల వరకు ఎంతోమంది పోరాటానికి మద్దతుగా నిలిచిన నేల. ఆపద వస్తే అడవి నుంచి అన్నలు వస్తారని ఎదురుచూసే అణగారిన ప్రజలున్న పోరుగడ్డ. నక్సల్స్ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఓరుగల్లు గడ్డపైనే తెలంగాణ తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది యోధులు చిందించిన నెత్తురు ఓ చరిత్రను రాసింది. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలమైన అనంతరం 2004 సెప్టెంబరు 21న అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌తో పాటు మరో రెండు విప్లవ సంఘాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నాటి నుంచి నేటి వరకు మావోయిస్టులు పోరుబాటను వదల్లేదు. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు. ఓవైపు ప్రభుత్వం నుంచి అణచివేతలు.. మరోవైపు కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదురొడ్డారు. తుపాకీతూటాతో రాజ్యాధికారం సాధించాలన్న లక్ష్యంతో పోరుబాట సాగిస్తున్న క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌తోపాటు అనేక మంది మావోయిస్టులు కరోనాకు బలయ్యారు. 20ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది మావోయిస్టు నేతలు, మిలిటెంట్లు, ఇన్‌పార్మర్లతో పాటు పోలీసులు సైతం రక్తం చిందించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



7



రిజిస్ట్రేషన్లకు హైడ్రా దెబ్బ!

రాంనగర్, సెప్టెంబరు 20: చెరువులు, నాలాల కబ్జాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో తీసుకువచ్చిన హైడ్రా ప్రభావం వరంగల్‌పై పడింది. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌కు హైడ్రా తరహాలో వాడ్రా వస్తోందనే ప్రచారం రియల్ దందాపై పడింది. రెండు మాసాలుగా రియల్ దందా తగ్గుముఖం పట్టింది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వ్యవసాయ పనులు ఉంటాయి కాబట్టి.. క్రయ విక్రయాలు సాగే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రధాన కారణం హైడ్రా భయమేనని తెలుస్తోంది. ప్రస్తుతం వరంగల్ నగరం నాలుగు దిక్కులా వెలసిన వెంచర్లు హైడ్రా నిబంధనల మేరకు ఉన్నాయా? లేక వ్యతిరేకంగా ఉన్నాయా? అనే అనుమానాలు కొనుగోలుదారుల్లో ఏర్పడుతోంది. ఏ స్థలం కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ఏమవుతుందోనని భయం కొనుగోలుదారుల్లో ఏర్పడినట్లు కనిపిస్తోంది. అస్సలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో ఆస్తుల క్రయవిక్రయాల ప్రక్రియ గతంతో పోల్చి చూస్తే 25శాతం కూడా జరుగడం లేదు. రూ.కోట్లలో ఉండే ఆదాయం లక్షల్లో కూడా ఉండటం లేదు.


భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్‌లు

వరంగల్‌కు వాడ్రా వస్తోందనే ప్రచారంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు భారీగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా నగర నడిబొడ్డున ఉన్న హనుమకొండ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీరోజు 100 నుంచి 150కి పైగా రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రయవిక్రయదారులతో నిత్యం సందడిగా ఉండేది. నెలన్నరగా రెండు డిజిట్ల రిజిస్ట్రేషన్‌లు కూడా జరుగడం లేదు. ఇదే పరిస్థితి జిల్లాలోని మిగతా 12కార్యాలయాల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్‌లు తగ్గుముఖం పట్టడానికి వాడ్రా వస్తోందనే భయం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వాడ్రా వస్తుందనే ప్రచారంతో ఈ పరిస్థితి ఉంటే అమలులోకి వస్తే పరిస్థితి ఏంటనే ఆందోళన రియల్టర్లలో నెలకొంది.

అధికారులు అప్రమత్తం

హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు, భవన నిర్మాణాల విషయంలో విచ్చలవిడిగా ఎన్‌వోసీలు, అనుమతులు ఇచ్చిన, తప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాకు చెందిన రెవెన్యూ, ఇరిగేషన్, కుడా అధికారులతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గతంలో జరిగిన నిర్మాణాల విషయంలో ఎవరికి ముప్పు ఏర్పడుతుందో అనే భయంలో ఉన్న అధికారులు నూతన అనుమతులు, క్రయ విక్రయాల విషయంలోనూ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నాన్ లేఅవుట్, ప్రభుత్వస్థలాలు, చెరువు శిఖాల స్థలాలు, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. గతనెల పొరుగు జిల్లా నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌లు ఇప్పటి వరకైతే నిబంధనలను విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు కనిపించడం లేదు. గత సబ్ రిజిస్ట్రార్‌లు నిబంధనలు తుంగలో తొక్కి విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసి అందినకాడికి దండుకున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి వరంగల్‌లోని పద మూడు కార్యాలయాల్లో గత అధికారుల హయాంలో అక్రమ రిజిస్ట్రేషన్‌ల దందా యథేచ్ఛగా సాగినట్లు సమాచారం. ప్రస్తుతం హైడ్రా ఎఫెక్ట్‌తో సబ్ రిజిస్ట్రార్‌లు ఆచితూచి విధులు నిర్వహిస్తున్నారు. హైడ్రా ప్రభావంతో రియల్ దందా తగ్గుముఖం పట్టడంతోపాటు శాఖ ఆదాయానికి, అధికారుల ఆధాయానికి గండి కొట్టినట్లు అయింది.

- మందకొడిగా స్థలాల క్రయవిక్రయాలు
- వరంగల్‌కు 'హైడ్రా' వస్తోందనే ఆందోళన
- స్థలాలపై కొనుగోలుదారుల్లో అనుమానాలు
- రెండు నెలలుగా తగ్గిన క్రయ, విక్రయాలు
- రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లోనూ మొదలైన గుబులు



ఆందోళనలో రియల్టర్లు

వరంగల్‌కు వాడ్రా వస్తుందనే ప్రచారంతో రియల్టర్లలో భయం నెలకొంది. వరంగల్ నగరం విస్తరిస్తుండటంతో నగర నాలుగు దిక్కులుగా వెంచర్లు వెలిశాయి. వీటిలో ఎక్కువగా నాన్‌లేఅవుట్ వెంచర్లు ఉన్నాయి. చెరువు శిఖాలు, ప్రభుత్వ స్థలాలను కలుపుకుని చేసిన వెంచర్లు సైతం ఉన్నాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న స్థలాలకు ఇరిగేషన్ అధికారులు ఎన్‌వోసీలు సైతం ఇచ్చినట్లు తెలిసింది. ఇలా చాలా సమస్యలున్న వెంచర్లు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల వెలసిన వెంచర్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు నెలన్నరగా ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. దీంతో రియల్టర్లు వాడ్రా వచ్చేలోగా విక్రయించాలని ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయినట్లు తెలిసింది. మొత్తంగా వాడ్రా ప్రకటన రియల్టర్లకు గుదిబండగా మారే అవకాశం ఉంది.

నేడు కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాక

- ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటన



హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 20: కేంద్ర పశు సంవర్ధశాఖ, పాడిపరిశ్రమలు, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండురోజుల పాటు పర్యటించనున్నట్లు బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. ఈ నెల 21న శనివారం ఉదయం 10 గంటలకు జనగామ జిల్లాలో బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని, అక్కడి నుంచి 12 గంటలకు హనుమకొండ జిల్లాకు చేరుకొని ఫౌల్ట్రీ రైతుల సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ ప్రెస్‌మీట్, సభ్యత్వ నమోదులో పాల్గొని అక్కడి నుంచి వరంగల్‌కు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి నిట్‌లో బసచేసి ఆదివారం ఉదయం రామప్పను సందర్శించి అక్కడే భూపాలపల్లి, ములుగు జిల్లాల బీజేపీ నాయకులతో సమావేశమై సభ్యత్వ నమోదును పరిశీలిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం మహబూబాబాద్ జిల్లాకు బయలుదేరి అక్కడ సభ్యత్వ నమోదులో పాల్గొని అనంతరం హైద్రాబాద్ వెళతారని ధర్మారావు పేర్కొన్నారు.



వేయిస్తంభాల ఆలయంలో పనులను పరిశీలిస్తున్న దృశ్యం

'కుడా' అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కుడా వైస్‌చైర్మన్ అశ్విని తానాజీ వాకడేలు సంయుక్తంగా పరిశీలించారు. హనుమకొండ, వరంగల్‌లోని సరిగమల పార్కు, పద్మాక్షి టెంపుల్ అప్రోచ్ రోడ్డు, భద్రకాళి సరస్సు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి ఆలయ మాడవీధులు, వేయిస్తంభాల దేవాలయ ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. 'కుడా' అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు.



గంజాయి స్మగ్లర్ అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

గంజాయి స్మగ్లర్ అరెస్టు

- రూ.85లక్షల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ



ట్రాక్టర్ కింద గంజాయి ప్యాకెట్లు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 20: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న కిలో లక్ష్మీనారాయణ అనే స్మగ్లర్‌ను హసన్‌పర్తి పోలీసులు, యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రూ.85లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కమిషన రేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ అంబర్ కిషోర్‌ఝా స్మగ్లర్ అరెస్టు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిలో లక్ష్మీనారాయణ ఒరిస్సాలో నాటుగురు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రకు చెందిన మరో నిందితుడు కిలో నారాయణరావు సూచన మేరకు గంజాయిని ట్రాక్టర్‌లో ఒరిస్సా నుంచి భద్రాచలం, ములుగు, హనుమకొండ, సిద్ధిపేట మీదుగా కామారెడ్డికి వెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హసన్‌పర్తి ఎస్‌ఐ దేవేందర్ గురువారం అనంతసాగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ట్రాక్టర్ కనిపించడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పరిశీలించగా కింది భాగంలో ప్రత్యేక ఏర్పాటు చేసి 338 కిలోల గంజాయిని 96ప్యాకెట్లు చేసి తరలిస్తున్నట్లు గుర్తించి కిలో లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఆయన వివరించారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్నట్లు ఆయన అన్నారు. ఇతడికి సహకరించిన ఇద్దరు నిందితులను పట్టుకుంటామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ఈ విలేకర్ల సమావేశంలో డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, నందిరామ్‌నాయక్, సీఐ చేరాలు, ఎస్‌ఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులపై సివిల్ సప్లయి అధికారుల దాడులు

- పెంచికలపేట, పున్నేలులో ధాన్యం నిల్వలపై ఆరా
- యజమానులపై క్రిమినల్ కేసులకు సిఫారసు



ఎల్కతుర్తి రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి/ఐనవోలు, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లుకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యంలో విల్లర్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తు న్నారు. రూ.కోట్ల విలువ చేసే ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలోని ఎల్కతుర్తి, ఐనవోలు మండలాల్లోని రైస్‌మిల్లులపై దాడులు చేశారు. ధాన్యం నిల్వలపై ఆరా తీశారు.

ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామశివారులోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీస్ (పారాబాయిల్డ్ రైస్‌మిల్)పై శుక్రవారం రాత్రి సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. మిల్లులో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యం బస్తాలను లెక్కించారు. దీంతో భారీ ఎత్తున బస్తాలు మాయమైనట్లు తేలింది. ఈ సందర్భంగా సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎల్.లక్ష్మారెడ్డి సంబంధిత వివరాలు వెల్లడించారు. శ్రీబాలాజీ మిల్లుకు 2021-2022, 2022-2023 సంవత్సరానికి గాను మొత్తం 6,339 టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించారు. ఇందులో నుంచి 4,310 టన్నుల బియ్యాన్ని మిల్లు యజమాని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1,889 టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. మిగతా 3,521 టన్నుల ధాన్యం మిల్లులో నిల్వ ఉండాలి. కానీ కేవలం మిల్లులో 205 టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మిగతా ధాన్యాన్ని మిల్లరు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నట్లు నిర్ధారించారు. మిల్లులో కనబడకుండా పోయిన ధాన్యం విలువ సుమారు రూ.7.50కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సీఎంఆర్ కింద మిల్లులకు ఇచ్చిన ధాన్యం తిరిగి చెల్లించాలని, లేకుంటే వాడుకున్న ధాన్యం డబ్బులను ప్రభుత్వానికి చెల్లించాలని యజమానికి తెలిపి కొంతగడువు విధించినా మిల్లు యజమానులు స్పందించక పోవడంతో ఈ దాడులు చేస్తున్నట్లు వివరించారు. మిల్లు యాజమానిపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీసీఎస్ నాగేంద్రప్రసాద్, ఎఫ్ఐ మోటం సదానందం, టీఏ కనకాచారి ఉన్నారు.

పున్నేలులో 50వేల ధాన్యం బస్తాలు మాయం

ఐనవోలు మండలంలోని పున్నేలు నారాయణ ఆగ్రో ఇండస్ట్రీ రైస్ మిల్లులో శుక్రవారం సివిల్ సప్లయీస్ రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. 2022-23 సంవత్సరంలో విల్లు యాజమాని సివిల్ సప్లయీస్ శాఖ నుంచి 50వేల ధాన్యం బస్తాలు ఎఫ్‌సీఐకు బియ్యం ఎగుమతి కోసం తీసుకున్నాడు. యేడాది గడిచినా బియ్యం ఎగుమతి చేయకపోవడంతో మిల్లులో సోదాలు నిర్వహించగా, ధాన్యం బస్తాల నిల్వ కనిపించలేదు. వీటి విలువ సుమారు రూ.కోట్ల వరకు ఉంటుందన్నారు. దీంతో పంచనామా నిర్వహించి యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సోదాల్లో సివిల్ సప్లయీస్ డీటీ నాగేంద్రప్రసాద్, ఎఫ్ఐ సదానందం, టీఏ జి.కనుకచారి పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి

- 23 నుంచి 28 వరకు సంరక్షణ కేంద్రాల తనిఖీ
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి




హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 20: జిల్లా లోని బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్‌కేర్ ఇనిస్టి ట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో అదనపు కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు వసతి, భోజనం, విద్య, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్‌ఫ్రీ నెంబర్లను డిస్‌ప్లే చేయాలన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 28వ తేదీవరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్‌తో పాటు ఆరుగురు సభ్యులతో కూడిన కవిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సందసాని రాజేంద్రప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జీ అధికారి ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్‌తో పాటు సోషల్ వర్కర్లు, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వరదనీటి పారుదలకు డీపీఆర్‌ను సిద్ధం చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియాలో పవర్ పాయింట్ ప్రజంటేషన్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20: భూగర్భ డ్రైనేజీ, వరద నీటి పారుదలకు డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు ఆదేశించారు. బల్దియా కార్యాలయంలో శుక్రవారం నీటి వనరుల నిర్వహణ, ఆక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ-గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన కోసం శుభ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నత ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరమైన వరంగల్ సమగ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి బహుముఖ రూపాలను అమలు చేస్తున్నారని అన్నారు. సిటీ ఇమేజ్‌ను పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను నిర్మించేందుకు కన్సల్టెన్సీలను ఆహ్వానిస్తున్నారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సహాయంతో ముందుకు వెళితే భూసేకరణ సమస్య రాదని అన్నారు. కొద్దిరోజుల్లో ఉన్నతాధికారులతో స్టెక్ హెల్డర్స్‌ను భాగస్వామ్యం చేస్తూ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు యూజీడీ ఏర్పాటుకు అమూల్యమైన సూచనలు చేయాలన్నారు. ఎన్పీడీసీఎల్, ఆర్అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్, బల్దియా ఇంజనీరింగ్, కుడా, వరంగల్ ట్రాఫిక్ పోలీసు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్, ఎన్ఐటీలకు చెందిన అధికారులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ఆపరేషన్ కిషన్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సెక్రెటరీ విజయలక్ష్మి, ఎస్ఈ రాజయ్య, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీసీపీ ప్రసన్నరాణి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, పీసీబీ ఈఈ సునిత, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు శనిగారపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హనుమకొండలోని ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సునిల్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం జీవితాన్ని ధారబోసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ'

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సరేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ నివాళి తెలిపారు. జాతీయ ఉద్యమంలో తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాల్లో, సాయుధ రైతాంగ పోరాటంలో సహకార ఉద్యమంలో లక్ష్మణ్‌బాపూజీ పాత్ర అద్వితీయమైనదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బ్రిటీష్ రెసిడెన్సీపై జెండా ఎగురవేశారన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేయడమేకాక, 96ఏళ్ల వయసులో తెలంగాణ కోసం దీక్ష చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. విప్లవ పంథాను అనుసరించడంలోనూ పార్లమెంటరీ పంథాలో సాగటంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. లక్ష్మణ్‌బాపూజీ ఆధ్వర్యంలోనే దేశంలోనే ప్రప్రథమంగా సహకార సంఘాలు పురుడు పోసుకున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీకి సీఎం రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్ తదితరులు

సుందర్‌రాజ్ యూ టర్న్

- కేటీఆర్ వద్దకు తీసుకెళ్లిన వినయ్‌భాస్కర్
- పార్టీ మారనని మాజీ కుడా చైర్మన్ స్పష్టీకరణ

రాంనగర్, సెప్టెంబరు 20: బీఆర్ఎస్‌ను వీడాలనుకున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యూటర్న్ తీసుకున్నారు. సుందర్‌రాజ్ పార్టీ వీడుతున్నట్లు రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడిన విషయం తెలిసిందే. పశ్చిమలో ఉన్న బలమైన బీసీ నేతను పోగొట్టుకోవడం సరికాదని నిర్ణయించి రెండురోజులుగా సుందర్‌రాజ్‌తో చర్చలు జరిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ శుక్రవారం సుందర్‌రాజ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాడు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో మాదిరిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని కేటీఆర్ సుందర్‌రాజ్‌తో అన్నట్లు తెలిసింది. నేతల మధ్య ఏమైనా అభిప్రాయబేధాలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే వరంగల్‌కు వస్తానని కేటీఆర్ తెలిపినట్లు సమాచారం. కాగా, కేటీఆర్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని సుందర్‌రాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సూచించినట్లు సమాచారం.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్ (18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్ చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే తమ కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

















నెత్తుటి చరిత్ర!

- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీపీఐ(మావోయిస్టు) ఉద్యమానికి నేటితో ఇరువై ఏళ్ల నిండాయి. 2004లో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నాటి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల పేరిట మైదాన ప్రాంతాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ రహస్య ప్రాంతాలపై గురి పెట్టిన పోలీసులు నక్సల్స్‌పై వల విసరటంతో తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపుతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో కలిసి విలీనమై అదే ఏడాది సెప్టెంబరు 21న సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. ఇలా శనివారం నాటికి మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు. అయితే నాటి చర్చల అనంతరం మావోయిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో మావోయిస్టు దండకారణ్య ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోకి మకాం మార్చారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని అడవులను కేంద్రంగా చేసుకుని నక్సల్స్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో పూర్వవైభవం కోసం మావోయిస్టులు రెండు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలం కాలేక పోతున్నాయి. ఈ 20ఏళ్ల కాలంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉన్న భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మవోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 2015 సెప్టెంబరు 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డెపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగటం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణవాదుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక 1991కాలంలో మావోయిస్టులు అనేక మంది కీలక నేతలను కోల్పోయారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్‌ఎస్‌యూ నేత పులి అంజయ్య అలియాస్ సాగర్ రాష్ట్రకార్యదర్శిగా ఎదిగి 1991ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత వరుసగా కేంద్ర కమిటీసభ్యులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎదిగిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, గుండెబోయిన అంజయ్య అలియాస్ బాలన్న, శెట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, తిప్పారపు రాములు అలియాస్ తాతా, బగే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ లాంటి కీలక నేతలు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో పార్టీ పెను సంక్షోభంలోకి వెళ్లింది.

కరోనాతో మావోయిస్టులు విలవిల

మావోయిస్టు పార్టీ గత 20 ఏళ్లలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తును ఎదుర్కొంది. ఎన్నో ఎన్‌కౌంటర్లు, దాడులు, బాంబు బ్లాస్టింగులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచి పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు కరోనా నుంచి తప్పించుకోలేక పోయారు. దీంతో 2020-21 మధ్యకాలంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు కరోనాతో మృతి చెందటం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓరుగల్లుకు చెందిన అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాదగూడెంకు చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషన్ 2021 జూన్ 21న కరోనాతోనే మృతి చెందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10వ తేదీన కరోనా బారిన పడి గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతోనే కన్నుమూసింది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021 జనవరి 18వ తేదీన అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరితో పాటు సుమారు 10మందికి పైగా మావోయిస్టు నేతలు కరోనా బారిన పడి మృతి చెందినట్లుగా సమాచారం. అలాగే మావోయిస్టు పార్టీ అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు అనేక మంది మావోయిస్టులు కరోనా బారిన పడ్డట్లు ప్రచారం జరిగింది. ఇలా ఎన్నిక సంక్షోభాలు ఎదురైనా ఎప్పటికప్పుడు కొత్త నాయకత్వాన్ని సృష్టిస్తూ ఆ లోటును భర్తీ చేసింది. కానీ ప్రస్తుతం ఆ కాలం నాటి రిక్రూట్‌మెంట్‌లు లేవు. దీంతో కరోనాతో కీలక నేతలను కోల్పోయినా మావోయిస్టులు వారి స్థానాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ మృతి తరువాత రెండున్నరేళ్ల వరకు నూతన కార్యదర్శిని నియవించలేకపోయింది. ఈ పరిణామాలు చూస్తుంటే కరోనా మహ్మారి మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపిందనేది స్పష్టమవుతోంది.

మరో 27మందికిపైగా అజ్ఞాతంలో..

20ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో 1991-94కాలం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న మావోయిస్టులు 30ఏళ్ల తరువాత 2021-24లో అంతకంటే పెను సంక్షోభంలో కూరుకపోయారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రస్తుతం పోరుబాటలో ఓరుగల్లు నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో దామోదర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ మావోయిస్టుల్లో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో గణేష్ మావోయిస్టుల చర్చల ప్రతినిధిగా వెళ్లారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడెనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి బాబునావు, అంకేశ్వరం సారయ్యలతో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో 18మందికి పైగా అజ్ఞాతంలో ఉండగా, భూపాలపల్లి జిల్లా నుంచి నలుగురు, ములుగు జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27మందికి పైగా నక్సల్స్ మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్నట్టుగా సమాచారం.

ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతూ..

మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా ఉండటంతో.. ఎక్కడ ఏ అడవుల్లో తుపాకీ పేలినా ఇక్కడి పల్లెల్లో అలజడి మొదలయ్యేది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారున్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబీకులు ఎదురుచూసేవారు. 2010లో అప్పటి ప్రభుత్వం మావోయిస్టు నేతలను గుర్తించింది. అందులో కరీంనగర్ నుంచి 60మంది అజ్ఞాతంలో ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో అదీ కీలక పదవుల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 14ఏళ్ల కాలంలో 60శాతం మంది మావోయిస్టులు లొంగిపోవటమో, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటమో, అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలంలో ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారు.

- ఈ ఏడాది ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయనతో పాటు ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా మృతి చెందింది.
- ఏప్రిల్ 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశినేని రవి అలియాస్ వినయ్ మృతి చెందాడు.
- జూలై 25వ తేదీన ములుగు- భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు.
- ఈనెల 5వ తేదీన ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందాడు.

చెస్‌పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



చెస్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు20: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమకొండ టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లాస్థాయి చెస్ పోటీలను వాల్ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి క్రీడాపోటీల నిర్వాకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో మేధోసంపత్తి చేకూరుతుందని, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు, 4బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలు

ఓపెన్ యార్డులో వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రంలో 600 బస్తాలకుపైగా తడిచిన సరుకు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబర్ 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మార్కెట్లో తడిచిపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 72మంది రైతులు 2,724 బస్తాల్లో 1,634 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు తీసుకు వచ్చారు. కొంతమంది రైతుల సరుకుల్లో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. వీరిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా కొద్ది నిమిషాలపాటు వర్షం కురవడంతో ఓపెన్ యార్డులో ఉన్న రైతులు తమ సరుకును కాపాడుకోలేకపోయారు. వర్షంలోనే తడుస్తూ మొక్కజొన్నలను దగ్గరకు కుప్పగా చేర్చారు. మహబూబాబాద్ మండలం వేమునూరు ఇందిరానగర్‌కు చెందిన భూక్య హుస్సేన్ ఎకరంన్నరలో పండించిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. గూడూరు మండలం పొనుగోడు రాములుతండాకు చెందిన భూక్య స్వామి, బానోత్ భద్రు, సాము, ఇనుగుర్తికి చెందిన బానోత్ వెంకన్నతో పాటు మరి కొంతమంది రైతుల సరుకులు పూర్తిగా తడిచి నష్టపోయారు. కొంతమంది టార్పాలిన్లు అందుబాటులో లేక నీటి వరదలో మొక్కజొన్నలు కొట్టుకుపోతున్నప్పటికీ చూస్తూ అలాగే ఉండాల్సిన దైన్యస్థితి నెలకొంది. దాదాపు 20 మంది రైతులకు చెందిన సుమారు 600 బస్తాల మొక్కజొన్నలు తడిచిపోయాయి.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నీళ్లలో తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య హుస్సేన్

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల మార్పులకు మరో అవకాశం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన డిగ్రీ విద్యా ర్థులు తాము అడ్మిషన్లు పొందిన కళాశాలలోనే కోర్సుల ను మార్చుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, దోస్త్, కళాశాల విద్యాశాఖాధికారులు మరో అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ని ఏ డిగ్రీ కళాశాలలో నైనా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు తమకు ఇష్టమైన కోర్సులకు మా ర్చుకుని చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీదేవసేనా, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబా ద్రిలు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సెప్టెం బరు 21 నుంచి 23 వరకు కళాశాలల కోర్సులు మార్పులు చేసుకోవచ్చునని వివరించారు. 24న తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు స్పష్టంచేశారు. వర్సిటీ లోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు గమనించి తమ అర్హతల మేరకు తమకు ఇష్టమైన కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఎంజీఎంలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం అధికారులతో సమీక్షా సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంవో మురళి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమయ్యలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయడానికి పవర్ గ్రిడ్ ముందుకు రావడంపై కలెక్టర్ వారిని అభినందించారు. ఎంజీఎం ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజనీర్ సీహెచ్.సంపత్ పాల్గొన్నారు.

ఓపీ ల్యాబ్‌లో రోగుల కష్టాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగుల కోసం ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లోకి వెళ్లాలంటే రోగులు నరకయాతన అనుభవించాల్సిందే. రోగ నిర్ధారణకు అవసరమయ్యే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్, షుగర్ పరీక్షల లాంటివి ఈ ల్యాబ్‌లో చేస్తారు. ప్రస్తుత సీజన్‌లో అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో ఆ గదిలోకి పైకి ఎక్కాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు జారీ కింద పడుతున్నారని వాపోతున్నారు. గతంలో మందులు ఇచ్చే దగ్గరనే ఈ 47వ నెంబరు ల్యాబ్ ఉండేది. ఓపీ పక్కనే ఈ ల్యాబ్ ఉండటంతో చాలా సౌకర్యంగా ఉండేది. అధికారులకు ఏమైందో ఏమో కాని లేకుంటే తీసుకొచ్చి దూరాన ఏర్పాటు చేశారు. అది కూడా పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు రోగులకు అనువైన చోటికి ఓపీ సేవలను దగ్గర ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంజీఎంలో ఫిర్యాదుల పెట్టెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టేందుకు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. రోగులు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో రాసి ఈ బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ వీటిని స్వయంగా తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. ఎంజీఎంలో పదికిపైగా ఇలాంటి పెట్టెలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇంకా మెరుగైన ఫలితాల కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపీ కౌంటర్ల సంఖ్యనుకూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక మృతదేహం తరలించడంలో వైఫల్యం

'ఎక్స్'లో సర్కారుపై కేటీఆర్ వ్యాఖ్యలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందిన గిరిజన బాలిక గీతిక (6)ను తరలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన ఎక్స్ ఖాతాలో ఈ విషయంపై స్పందించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఉండి కూడా గిరిజన బాలిక మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి అవమానకరం అని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి ఇది పరాకాష్టగా మిగులుందన్నారు.

వరంగల్‌లో పనిచేయలేం.. ఖమ్మం పంపించండి..

మంత్రికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల మొర

రాంనగర్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లాలో పనిచేయలేమని, తిరిగి ఖమ్మం జిల్లాకు పంపించాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను వరంగల్‌కు, ఇక్కడి వారిని ఖమ్మం పంపించారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వరంగల్‌కు వచ్చిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఏమవుతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల సాకుతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. ఆస్తుల క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, కొద్దిరోజుల్లోనే వరంగల్‌లో పనిచేయలేమని గుర్తించిన ఉద్యోగులు.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. ఏ మాత్రం అవకాశం ఉన్నా తిరిగి ఖమ్మం పంపించాలని కోరినట్లు తెలిసింది.

23న కేయూలో సెనెట్‌హాల్‌లో సింపోజియం

హాజరుకానున్న హరగోపాల్, కోదండరామ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న ఉదయం 10గంటలకు డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్-ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై సింపోజం నిర్వహించనున్నారు. ఈ కార్యక్ర మంలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండ లి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తా రు. సింపోజింలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నోస్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్





గిర్మాజీపేట, సెప్టెంబరు 20: వరంగల్ - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా విజయవాడ - కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు గరీబ్‌రథ్, వందేభారత్, గోదావరి, పద్మావతి, సింహపురి, తదితర 39 రైళ్లకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తాత్కాలికంగా ఎత్తివేసినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనాలుగు రోజుల పాటు గరీబ్‌రథ్, వందేభారత్, కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్‌కు బదులుగా కాజీపేటలో ఆగుతాయని, ఇతర రైళ్లు కూడా యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు.

కాజీపేటలో ఆగే రైళ్లు ఇవే..

ప్రస్తుతం వరంగల్‌లో మాత్రమే స్టాప్ కలిగి కాజీపేటలో స్టాప్‌లేని విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గరీబ్‌రథ్ రైళ్లు ఈనెల 25 నుంచి 29 వరకు, షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ 25న, కాకినాడటౌన్ - లింగంపల్లి - కాకినాడటౌన్ కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 26, 27 తేదీల్లో, టాటా - యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 26న వరంగల్‌కు బదులుగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా ఆగుతాయని తెలిపారు.

యథావిధిగా కాజీపేటలో హాల్టింగ్

గూడూరు - సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాకినాడ పోర్ట్ - లింగంపల్లి - కాకినాడ పోర్ట్ గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మణుగూరు - సికింద్రాబాద్ - మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్టణం - బీదర్ - మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాంబరం - హైద్రాబాద్ - తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నర్సాపూర్ - నాగర్‌సోల్ - నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాలుగు రోజులు వరంగల్‌లో ఆగకుండా యథావిధిగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని తెలిపారు. అలాగే విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - హైద్రాబాద్ - శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - సాయినగర్‌షిర్డి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని శ్రీధర్ తెలిపారు. సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్ట్ - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - సికింద్రాబాద్ - శాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు. అలాగే యశ్వంతాపూర్ - నిజాముద్దీన్ - యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 22నుంచి అక్టోబరు 7వరకు ప్రస్తుత కాచిగూడ - కాజీపేట - బల్లార్ష - నాగపూర్‌కు బదులుగా కాచిగూడ - నిజామాబాద్ - ముద్కెడ్ - పింపల్ కుటి నాగపూర్ మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

డిగ్రీ ఇయర్ వైజ్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్‌లో డిగ్రీ, పీజీ కోర్సులు చదివిన పాత విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించా లని కేయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఉపేం దర్‌రెడ్డి జనరల్ సెక్రెటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఒక్కటి, రెండు సబ్జెక్టులు తప్పిపోయి డిగ్రీ ఉత్తీర్ణత సాధించలేకపోయారని వారికి మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. అఖరు చాన్స్‌గానైనా డిగ్రీ పాత విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని కోరారు. అలాగే యూడీఎఫ్ ఫీజులను తగ్గించాలని వి న్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేటలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వే ట్రాక్‌ల తనిఖీలు శుక్రవారంతో ముగిశాయి. రెండురోజులుగా ప్రత్యేక ట్రాలీలో కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు నిర్మించిన మూడో రైల్వేట్రాక్‌ను పరిశీలించారు. కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగమార్గం వద్ద సేఫ్టీ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సొరంగమార్గంతోపాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. సెఫ్టీ కమిషనర్ సొరంగమార్గం మూడోలైన్‌ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు రైల్వే ఉద్యోగులు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేసిన అనంతరం ఈట్రాక్‌లపై ట్రయల్ రన్ చేయనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి



అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 20 : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందగా, తల్లి కి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాత పోచారం గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్ (22), తల్లి కోటేశ్వరితో కలిసి తమ భూమిలోని విఠర్చి తోటలో పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయం త్రం ఒక్కసారిగా గాలిదుమారం, వానతో పాటు ఉరుములు, మెరుపులతో వారు పనులు చేస్తున్న ప్రదేశంలో పిడుగుపడడంతో ప్రవీణ్ స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న తల్లి కోటేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పక్కపొలం రైతులు ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.



గేదెకు రెండు దూడలు జననం

ఐనవోలు, సెప్టెంబరు 20: పాడిగేదె రెండు దూడలకు జన్మనివ్వడం విశేషంగా నిలిచింది. ఒంటిమామిడిపల్లికి చెందిన రైతు రాజారపు కుమారస్వామికి చెందిన పాడి గేదె శుక్రవారం రెండు ఆడ దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు ఆరోగ్యంగానే ఉన్నాయి. జన్యు పరమైన కారణాలతోపాటు బలంగా ఉన్న పాడిగేదెలు మాత్రమే అరుదుగా ఇలా రెండు దూడలకు జన్మనిస్తాయని పశువైద్యాధికారి వినయ్ తెలిపారు. శనివారం వెళ్లి వాటిని పరీక్షిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

వేలేరు, సెప్టెంబరు 20: మండల పరిధిలోని శాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎర్ర తిరుపతి బదిలీ కాగా శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. హెచ్‌ఎం వాణి, పీఆర్ టీయూటీఎస్ మండల అధ్యక్షుడు బానుప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు సదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సరస్వతి, సీఆర్‌పీలు శ్రీనివాస్, వెంకటేష్, ఆశ వర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

బీసీ సంక్షేమ సంఘం నాయకుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 20: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పులి శ్రీనివాస్, బి. శ్యాం, పవన్, రాజ్‌కుమార్, మహిళా నాయకులు సరస్వతి, విజయ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

బీసీ సంఘ నేత పులి రజనీకాంత్ డిమాండ్

రాంనగర్, సెప్టెంబరు 20: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాజకీయ పార్టీలను బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పులి రజనీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రజనీకాంత్ మాటాడారు. దేశంలో 60 శాతానికిపైగా ఉన్న బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికార పార్టీకి సూచించారు. కొన్ని కులాలకు పట్టం కట్టడం సరికాదన్నారు. బీసీలు వారి హక్కుల సాధనకు కదిలిరావాలని రజనీకాంత్ పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో బీసీ సంఘ నేతలు బుద్ధ వెంకన్న, జి.రంగారావు, రుద్రారపు రాజు, మహేష్ గౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సమాధుల కూల్చివేతపై ఆగ్రహం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఇన్‌సెట్‌లో గొంతు కోసుకున్న యువకుడు

- పెద్దమ్మగడ్డ దళితుల ధర్నా, రాస్తారోకో
- గొంతు కోసుకున్న యువకుడు
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే నాయిని

రెడ్డికాలనీ, సెప్టెంబరు 20: దళితుల సమాధులను కూల్చివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం వరంగల్ - ములుగు జాతీయ రహదారిపై పెద్దమ్మగడ్డకు చెందిన దళితులు ధర్నా చేపట్టారు. వందల సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దశాబ్దాలకాలంగా తమ బంధువులు, కుటుంబ సభ్యులు మరణిస్తే ఇక్కడే సమాధి చేస్తున్నామని, ఇప్పుడు కొందరు అక్రమార్కులు తమదేనంటూ రావడం, అందుకు అధికారులు సైతం వత్తాసు పలకడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ధర్నాతో రహదారిపై భారీగా ట్రాఫిక్ ఎక్కడికక్కడే స్తంభించి పోయింది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని చెప్పినా వారు వినకుండా అక్కడే కూర్చుండిపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని దళితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారుల తీరుపై మండిపడ్డారు. సమాధులు కూల్చుతుంటే అధికారులు చోద్యం చూడటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దళితుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేయాలనుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నగరంలో లాఅండ్ ఆర్డర్ సమస్యల లేకుండా నిర్మూలన చేయాలని సీపీని కోరారు. సమాధుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

గొంతు కోసుకున్న యువకుడు

హనుమకొండ పెద్దమ్మగడ్డలో సమాధులు తొలగించడంతో మనస్థాపానికి గురై ఘటనా స్థలం వద్ద మెల్‌గిబ్సన్ అనే యువకుడు గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ధర్నా వద్ద పెద్ద సంఖ్యలో ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ఆ యువకుడిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం సమాధులను తొలగించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 20 సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం నగరంలోని కేయూసీ, గోపాలపూర్, టేకులగూడెం, యాదవనగర్, వెస్ట్‌సిటీ, మడికొండ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు, కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అదే విధంగా ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్‌కాలనీ, ప్రశాంత్‌నగర్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

ప్రైవేటు కంపెనీలకు ఇవ్వొద్దు

వడ్డెపల్లి, సెప్టెంబరు 20: భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని లేబర్ అడ్డాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల పథకాలకు సంబంధించిన ప్రమాద బీమాకు ఇచ్చే రూ.6లక్షలను రూ.10లక్షలకి పెంచాలని అన్నారు. కార్మికుడి సహజ మరణానికి ఇచ్చే రూ.లక్ష 30వేలను రూ.5లక్షలకు పెంచాలని, వివాహానికి, ప్రసవానికి స్కీంలను రూ.లక్ష పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 23న హైదరాబాద్‌లోని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ భవనం (అంజయ్య భవనం) కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కు వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేతలు భానోతు వెంకన్న, పుల్ల అశోక్, వల్లెపు యాకయ్య, వల్లపు మల్లయ్య, శీలం ఆనందం, సాంబయ్య, మొగిలి, చేరాలు తదితరులు పాల్గొన్నారు. తొలుత కార్మికులతో సంతకాలను సేకరించారు.

యువకుడిపై దాడి

మడికొండ, సెప్టెంబరు 20: యువకుడిపై పలువురు దాడి చేయడంతో పాటు అతడి ఇంటిపై సైతం దాడి చేసిన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సుమారు 10. 30 గంటల సమయంలో కాజీపేట బాపూజీ నగర్‌లో జరిగిన గణేష్ శోభాయాత్ర సందర్భంగా మడికొండకు చెందిన కళ్లెపు భిక్షపతి కుమారుడు కళ్లెపు సాయిపవన్‌కు మడికొండకు చెందిన పిట్ట అరవింద్ మధ్య గొడవ జరిగింది. ఈవిషయంలో అర్ధరాత్రి పిట్ట అరవింద్, మడికొండకు చెందిన నాగపురి అరవింద్, గండికోట భరత్, కాజీపేటకు చెందిన కిరణ్, నార్లగిరి వినయ్, వివేక్ మరి కొంత మంది సాయిపవన్ ఇంటికి వచ్చి అతడిపై కర్రలతో దాడి చేస్తుండగా సాయిపవన్ తండ్రి కళ్లెపు భిక్షపతి ఆపడానికి వెళ్లడంతో అతడిపై కూడా దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించారు. భయాందోళనకు గురైన భిక్షపతి 100కు డయల్‌చేసి పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. అలా వెళ్లిన వారు తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో తిరిగి ఇంటి మీదకు వచ్చి కర్రలతో ఇంటి తలుపులు, కిటికి అద్దాలు పగుల గొట్టారు. బయటకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్ విలువ సుమారు రూ. 10వేలు ఉంటుందని బాధితుడి తండ్రి కళ్లెపు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

తెలుగు భాషా దినోత్సవం

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేట సెయింట్ గ్యాబ్రియేల్ పాఠశాలలో శుక్రవారం తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాలన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవులు, రచయితల ప్రసంగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంటోని పొలిశెట్టి, తెలుగు విభాగం బాధ్యులు ముదుంబ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

న్యూశాయంపేట, సెప్టెంబరు 20: మహాత్మాజ్యోతిరావు పూలే గురుకులాల్లో ప్రొవిజినల్ టెండర్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి కోరారు. న్యూశాయంపేటలో ఉన్న జ్యోతిరావు పూలే గురుకులాల వరంగల్ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం డీవైఎఫ్ఐ నాయకులు ఆర్‌సీవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి ఉన్నారు.

జాతర టెండర్ల ఖరారు

ఐనవోలు, సెప్టెంబరు 20 : ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు సంబంధించి ఐదు రకాల సీల్ టెండర్లు ఖరారయ్యాయి. స్వామి, అమ్మవార్లకు పూలదండలు, విడిపూలు సరఫరా, ఆలయానికి రంగులు, సున్నాలు వేయడం, రంగులు, సున్నాలు సరఫరా చేయడం స్వామి వారికి అభిషేకం కండువాలు, జాకెట్ పీసుల సరఫరాతోపాటు టెంట్‌హౌస్ సామాన్లు సరఫరా చేయడానికి సీల్ టెండర్లను శుక్రవారం నిర్వహించగా ధరావతు చెల్లించిన ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లను తక్కువ ధరలకు పొందినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ టెండర్ల ప్రక్రియను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

జీపీలకు నిధుల విడుదల చేయాలి

ఐనవోలు, సెప్టెంబరు 20: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కార్యదర్శుల సంఘం(టీపీఎస్‌సీఎఫ్) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం మండలస్థాయిలో ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతిరెడ్డిలకు వినతిపత్రాన్ని అందజేశారు. అవసరాల నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు తమ జీతాల నుంచి చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటికే ఖర్చుపెట్టి నిధులను ఐఎఫ్‌ఎంఎస్ ద్వారా పేమెంట్ చేసిన చెక్కులు సుమారు 10 నెలలుగా క్లియర్‌కాలేదని తదితర డిమాండ్లు, సమస్యలను వినతిపత్రంలో పొందుపరిచి అధికారులకు మొరపెట్టుకున్నారు.

బస్టాండ్‌లో కర్టసీ డే వేడుకలు

బాలసముద్రం, సెప్టెంబరు 20: హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం కర్టసీడే వేడుకలను ఆర్టీసీ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఆర్ఎం విజయభాను ప్రయాణికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పుష్పాలు అందజేసి సాదరంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల మధ్య ఆత్మీయతను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్, డీఎంలు వంగల మోహన్‌రావు, ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి సొసైటీ భూమిపై వివాదం

చదును చేసిన అధికారులు.. తమదేనంటున్న వారసులు

హసన్‌పర్తి, సెప్టెంబరు 20: హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ శివారు సర్వే నెంబరు 590బీలోని హసన్‌పర్తి పీఏసీఎస్ సొసైటీకి చెందిన భూమిని స్వాధీనం చేసుకునేందుకు చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి ఆదేశాల ప్రకారం సీఈవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం వెళ్లారు. భూమిని చదును చేసేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకున్న బండ మాధవరెడ్డి వారసుడు జక్కిరెడ్డి వచ్చి భూమి తమదేనని తమకు ధరణి, పట్టా పాసు పుస్తకం ఉందంటూ పనులను నిలిపివేశాడు. కాగా, పనులను నిలిపివేశాడంటూ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చేరాలు ఆదేశాల మేరకు ఎస్సై దేవేందర్‌రెడ్డి పోలీసు సిబ్బందిని ఘటన స్థలానికి పంపించారు. జక్కిరెడ్డిని పిలిచి ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించకూడదని నచ్చజెప్పి తిరిగి పీఏసీఎస్ సొసైటీ భూమి చదును పనులను కొనసాగించారు.

40 ఏళ్ల కిందట..

హసన్‌పర్తి పీఏసీఎస్ సొసైటీ భూమి వివాదాస్పదంగా మారింది. 40 ఏళ్ల కిందట బండ రాజిరెడ్డి, బండ మాధవరెడ్డికి వారసత్వంగా అనంతసాగర్ శివారు సర్వే నెంబరు590 బీలో 22 గుంటల భూమి ఉంది. అయితే ఈ భూమిని 1983వలో అప్పటి హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ చింతలపాని సుధీర్‌రెడ్డి హసన్‌పర్తి సొసైటీ పేరు మీద కొనుగోలు చేసినట్లు సంబంధిత సొసైటీ అధికారులు గుర్తించారు. ఈ విషయంపై ఇటీవల సొసైటీ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డితోపాటు డైరెక్టర్లు కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య.. ఆక్రమణకు గురైన పీఏసీఎస్ సొసైటీ భూమిపై తక్షణమే విచారణ జరిపి పీఏసీఎస్ భూమిని అప్పగించాలని స్థానిక తహసీల్దార్ చల్ల ప్రసాద్‌ను ఆదేశించారు.

కౌమార విద్య, హెచ్‌ఐవీపై ఉపాధ్యాయులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో కౌమార విద్య, హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఈవో డి.వాసంతి ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీ సంక్రమిత వ్యాధులు సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి శ్రీనివాస్ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ మేళా కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ. శ్రీనివాస్, డీఎస్‌వో ఎస్. శ్రీనివాసస్వామి, మధుసూదన్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ స్వప్న మాధురి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సాయికుమార్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరుయాత్ర

ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, విద్యారంగ సమస్యల పరిష్కరం కోసం ఎస్ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి పోరు యాత్ర కార్యక్రమాన్ని రూపొందించినట్లు స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ అన్నారు. హనుమకొండ అశోక జంక్షన్‌లో ఎస్ఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 30వరకు నిర్వహించనున్న విద్యార్థి పోరుయాత్ర ర్యాలీని సాయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్లో, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు లేక అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఎస్ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి పోరు యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లను, సంక్షేమ గురుకులను సందర్శించి సమస్యలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూ విద్యార్థులు జగవెల్లి శ్రావణ్, చెట్టుపల్లి శివకుమార్, రవి, సిద్దు, అన్వేష్, నరేష్, సాయి, బాబు, మహేష్, తరుణ్, మనోహర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు తప్పదని, త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో ఆయన భేటీ అయ్యారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియంను ప్రజలు ఓడిస్తారని, గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ మేరకు ఆ నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో త్వరలోనే విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకులను నియమించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో పార్టుటైమ్ అధ్యాపక నియామకాలు చేపట్టాలని, వెంటనే నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని మాదిగ స్టూడెంట్ యూనియన్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు, డాక్టర్ కందకట్ల శ్రావణ్‌కుమార్, డాక్టర్ కల్లెబోయిన కుమారస్వామి, టీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరూరి రంజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ సంఘాల నేతృత్వంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డిని తన చాంబర్‌లో కలిసి తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. వర్సిటీలో అన్ని విభాగాల్లో రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ చెందడంతో ఖాళీలు ఏర్పడ్డాయని, వారి స్థానంలో నూతనంగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని విన్నవించారు. వర్సిటీలో విద్యార్థులకు పార్టుటైమ్ అధ్యాపకులను నియమించకపోవడంతో తరగతులు రెగ్యులర్‌గా జరగడం లేదని గుర్తు చేశారు. అనేక విభాగాల్లో ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వెంటనే పార్టుటైమ్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ చందూ, డాక్టర్ వీరన్న, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కుడా చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఇన్నర్ రింగ్ రోడ్డు బాధితులకు భరోసా

కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20: ఇన్నర్ రింగ్ రోడ్డు బాధిత రైతులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి భరోసా కల్పించారు. ఇన్నర్ రింగు రోడ్డులో భూములు కోల్పోతున్న పైడిపెల్లి, ఆరెపల్లి గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం హనుమకొండ కుడా కార్యాలయంలో కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఛైర్మన్ సానుకూలంగా స్పందించి రైతులతో మాట్లాడారు. ఇన్నర్ రింగు రోడ్డు ద్వారా నష్టం ఏర్పడే రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చిత్రకళలో కేవీ విద్యార్థుల ప్రతిభ

మడికొండ, సెప్టెంబరు 20: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభ ఉత్సవాల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, కాజీపేట రైల్వే స్టేషన్ వారు సం యుక్తంగా ఈనెల 16న కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రియ విద్యాల యంలో నిర్వహించిన చిత్రకళ, వ్యాస రచన పోటీలలో కేవి వరంగల్ విద్యార్థులు ఉత్త మ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుకున్నారని ఆర్ట్ టీచర్ అన్నాబత్తుల వెంకన్న తెలిపారు. చిత్రకళా పోటీలలో బిట్ల వర్షిణి ప్రథమ బహుమతి, సయ్యద్ రహీల్ ద్వితీయ బహుమతి, అభిలోక్ తృతీయ బహుమతి సాధించగా, వ్యాస రచన పోటీల్లో సాయి హర్షిత ప్రథమ, మహ్మద్ ఇర్ఫాన్ ద్వితీయ, డేనియల్ మెల్విన్‌రాజ్ తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. వీరికి మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. శుక్రవారం కేంద్రియ విద్యాలయ అసెంబ్లీలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను, చిత్రకళా ఉపాధ్యాయులు అన్నాబత్తుల వెంకన్నను, వ్యాస రచనలో విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు.

స్వచ్ఛతా హీ సేవాలో భాగస్వాములు కావాలి

వేలేరు, సెప్టెంబరు 20 : ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం డీఆర్‌డీవో నాగపద్మజ పరిశీలించారు. ఈ సందర్భంగా వేలేరు మండల మల్లికుదుర్ల గ్రామాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. మల్లికుదుర్ల గ్రామంలోని గోదాం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ సేవా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. అలాగే మన చుట్టు ఉన్న పరిస రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతీ ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. అనంత రం వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవర ణంలో మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులు ప్లాస్టిక్‌తో చేసి నయూజర్ వస్తువుల, శానిటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి శ్రమదానం చేసి రోడ్డుకు ఇరుపక్కల గల పిచ్చి మొక్కలను తొలగించారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ఐనవోలు, సెప్టెంబరు 20: దాతల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఐనవోలుకు చెందిన దాత సుముద్రాల సమ్మయ్య (మణికంఠ ఎంటర్‌ప్రైజెస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు రూ.10వేల విలువచేసే క్రీడా దుస్తులను శుక్రవారం అందజేశారు. అదేవిధంగా వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ గొకె రేణుకశ్రీనివాస్ 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించారు. కార్యక్రమాల్లో ఐనవోలు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, దాత సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎ. సతీష్, స్థానికులు సునిల్, చిన్నరాజు, వెంకటాపురంలో హెచ్‌ఎం తాళ్ళపల్లి రమేష్, దాతైన మాజీ సర్పంచ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 21 సెప్టెంబరు 2024



ఇరవైల్లో నాజూగ్గా కనిపించడంలో వింతేమీ లేదు. కానీ... యాభైల్లోనూ అదే శారీరక సౌందర్యంతో అలరిస్తుంటే..! కాజోల్ దేవ్‌గణ్..! కిలకిల నగవులు... మిలమిల మెరుపులతో ఒకప్పుడు వెండితెరను ఏలిన సితార. పరిశ్రమలోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటినా... ఇద్దరు బిడ్డల తల్లి అయినా... ఆమెలో నేటికీ అదే ఆకర్షణ.

యాభైల్లోనూ ఇరవైలా..!



వెండితెర మీదే కాదు... వేదిక ఏదైనా కాజోల్ ఉందంటే అక్కడ పదివేల ఓల్టుల ఎనర్జీ. వాతావరణం ఉత్సాహంగా... ఉల్లాసంగా మారిపోతుంది. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, కుచ్ కుచ్ హోతాహై, కభీ ఖుషీ ఖభీ గమ్'... లాంటి ఆణిముత్యాలు ఆమె కెరీర్‌లో ఎన్నో. పక్కింటి అమ్మాయిని తలపించే పాత్రలతో... ఇండస్ట్రీ హిట్స్‌కు ఒకప్పుడు కేరాఫ్ అడ్రెస్. స్కూల్లో చదివే రోజుల్లోనే పరిశ్రమలోకి అడుగుపెట్టిన కాజోల్... ఉత్తమ నటిగా ఐదు ఫిలిమ్‌ఫేర్ అవార్డులతో కలిపి నలభైకి పైగా పురస్కారాలు అందుకుంది. సినీ రంగానికి చేసిన అసమాన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2011లో కాజోల్‌కు 'పద్మశ్రీ' పురస్కారం ఇచ్చి గౌరవించింది. అలనాటి నటి తనూజా ముఖర్జీ వారసురాలిగా కెమెరా ముందుకు వచ్చినా... అద్భుతమైన నటనతో తల్లిని మరిపించింది. ఆమె కుటుంబం మొదటి నుంచీ సినీ రంగంతో మమేకమైంది. తండ్రి సోము ముఖర్జీ దర్శకనిర్మాత. అమ్మమ్మ శోభనా సమ్మర్థ్, అత్తయ్య నూతన్, మామయ్యలు జాయ్ ముఖర్జీ, దేవ్ ముఖర్జీ, చెల్లి తనీషా... ఇలా చెప్పుకొంటూ పోతే, ఆమె దాదాపు అందరూ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. చిన్నప్పుడే తల్లితండ్రులు విడిపోయినా... ఆ ప్రభావం తనపై పడనివ్వలేదు ఆమె అమ్మమ్మ. కాజోల్ స్వతంత్ర భావాలతో పెరిగింది. ఏదైనా పట్టుపడితే అది నెరవేరే వరకు వదలదు. అమ్మ నుంచి మహారాష్ట్ర సంస్కృతి, నాన్న నుంచి బెంగాలీ సంప్రదాయం అలవర్చుకుంది. స్టార్ హీరో అజయ్ దేవ్‌గణ్‌ను ప్రేమించి పెళ్లాడింది. వారికి ఇద్దరు పిల్లలు... నైసా, యుగ్. ఇప్పటికీ పలు ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న కాజోల్... తెరంగేట్రం చేసి మూడు దశాబ్దాలు దాటింది. అయినా నేటికీ ఆమెలో అదే జోష్. అదే నాజూకైన రూపం. అందుకే నడివయసువారికే కాదు... యువతరానికి కూడా ఆమె ఆదర్శంగా నిలుస్తోంది.

పది గంటల నిద్ర...

కాజోల్ జీవనశైలి చూడ్డానికి చాలా సాధారణంగా ఉటుంది. కానీ పోషక విలువలున్న ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ఆమె జీవితంలో భాగం. అదే తనను ఆరోగ్యంగా, నిత్యయవ్వనంగా ఉంచుతుందని అంటుంది ఈ బాలీవుడ్ బ్యూటీ. అన్నిటికంటే ముఖ్యంగా రోజుకు కనీసం పది గంటలు నిద్ర పోతుంది. 'పడుకొనే ముందు శుభ్రంగా ముఖం కడుక్కోకపోతే నాకు నిద్ర పట్టదు. ఎంత బిజీగా ఉన్నా రోజూ కచ్చితంగా పది గంటలు నిద్ర పోవాల్సిందే' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆమె నిద్ర గురించి అప్పట్లో పెద్ద చర్చే జరిగేది. భర్త అజయ్‌దేవ్‌గణ్ కూడా ఓసారి 'ఇక నిద్ర పోయింది చాలు' అంటూ ఆమె ఫొటోతో ట్వీట్ చేశాడు.

అదేవిధంగా చర్మ సౌందర్యానికి సంబంధించి కూడా చాలా జాగ్రత్తలు తీసుకొంటుంది కాజోల్. ఇంత మందాన ముఖానికి రంగులు పులిమేయకుండా... సింపుల్ మేకప్‌తో కనిపించడానికే ఇష్టపడుతుంది. ఆమె కిట్‌లో సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరి. 'పదహారేళ్ల వయసులో నాకు సన్‌స్క్రీన్ ప్రయోజనం గురించి తెలిసింది. అప్పటి నుంచి వాటిని ఉపయోగిస్తున్నా. అంతేకాదు... పుష్కలంగా నీళ్లు తాగుతాను. దానివల్ల చర్మానికి నిగారింపు వస్తుంది' అంటుంది.

వర్కవుట్ ఇలా...

శరీరంలో సత్తువ, జీవక్రియ పెంపొందించడానికి రోజుకు కనీసం రెండు గంటలు వర్కవుట్స్‌కు కేటాయిస్తుంది కాజోల్. వీటిల్లో వెయిట్, ఎండ్యూరెన్స్ ట్రైనింగ్‌తో పాటు యోగా కూడా ఉంటుంది. రెండో కాన్పు తరువాత కాజోల్ కేవలం ఐదు నెలల్లో ఇరవై కిలోల బరువు తగ్గింది.

- ఉదయం అరగంట జిమ్‌లో కార్డియో ఎక్సర్‌సైజ్‌లు. అప్పుడప్పుడూ స్విమ్మింగ్. ఇరవై నిమిషాలు వెయిట్‌లిఫ్టింగ్ సెషన్. డెడ్‌లిఫ్ట్ ఆమె ఫేవరెట్ వ్యాయామం. దానివల్ల అధిక మొత్తంలో కేలరీలు కరుగుతాయి. శరీరం దృఢంగా మారుతుంది.
- తరువాత స్క్వాట్స్, లంగెస్, పిలేట్స్, డ్యాన్స్ కూడా ఆమె వ్యాయామాల్లో భాగం.
- అరగంట యోగా, ధ్యానం. యోగా శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా ఉంచుతుంది. ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి.

జంక్‌ఫుడ్‌కు దూరం...

పిండి పదార్థాలు తక్కువ మోతాదులో, పీచు పదార్థాలు పుష్కలంగాగల స్వచ్ఛమైన, పరిశుభ్రమైన ఆహారంతో ఆమె మెనూ నిండివుంటుంది. అలాగే చేప, చికెన్ మెనూలో తప్పనిసరి. పిజ్జాలు, బర్గర్లు, ఇతర జంక్, ప్రాసెస్‌డ్ ఫుడ్స్‌కు దూరం. ఆ మధ్య అతిథుల కోసం కాజోల్ తన ఇంట్లో ఇచ్చిన విందుకు సంబంధించి, రకరకాల ఫుడ్ ఐటెమ్స్ ఫొటో ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. పాలక్ పనీర్, గార్లిక్ బ్రెడ్, ఫిష్ ఫ్రై, స్పైసీ మహారాష్ట్రియన్ పట్వాడీ, దాల్ రైస్ అందులో కొన్ని వంటలు. ఆ విందుకు ఆమె ఓ కొత్త పేరు పెట్టింది... 'లిండర్' అని. అంటే లంచ్, డిన్నర్‌లను అలా కలిపేసిందన్నమాట. ఆహార నియమాల విషయంలో ఎంత కచ్చితంగా ఉన్నా... అప్పుడప్పుడు నచ్చిన వెరైటీలను ఓ పట్టు పడుతుంది ఈ భామ. భర్త అజయ్ దేవ్‌గణ్‌లానే ఆమెకు చైనీస్, గోవా ఫుడ్స్ చాలా ఇష్టం. కాజోల్ షెఫ్‌లను తలదన్నే అద్భుతమైన కుక్ కూడా.

ముల్లంగి అంటే వ్యాధులకు హడల్!

"సుకలిత మలిసూత్రం బాలమూలస్య మూలం లవణమథిత మూర్ధ్నా పీడితం పాణియుగ్మే!! సురభితమతినింటూ హింగుధూపేన యుక్తం భవతి జఠరవహ్నేస్తూర్ణమృద్ధీపనాయ!!' అంటాడు క్షేమశర్మ తన క్షేమకుతూహలంలో! రకరకాల వ్యాధులకు ముల్లంగి గొప్ప మందు అనేది ఈ శ్లోకార్థం.



ఏది శ్రేష్టం?: ముదిరిన దుంపల కన్నా లేత ముల్లంగి దుంపలకే ఎక్కువ శక్తి ఉంటుంది. లేత ముల్లంగి కంఠ స్వరాన్ని మెరుగుపరుస్తుంది. ఆహారాన్ని తేలికగా అరిగేలా చేస్తుంది.

ముల్లంగి దుంపలకు, ఆ చెట్టు ఆకులకు విశేషమైన ఔషధ గుణాలు ఉన్నాయని మన పూర్వీకులు ఎప్పుడో గమనించారు. అందుకే మన పూర్వీకులు ముల్లంగిని ఒక విశిష్టమైన దుంపగా గుర్తించారు. కాలేయం దెబ్బతిన్నప్పుడు.. మొలలు తగ్గటానికి.. అజీర్తి సమస్య తొలగిపోవటానికి.. మూత్ర పిండాల్లో రాళ్లు కరగటానికి.. సొరియాసిస్ లాంటి చర్మవ్యాధులు రాకుండా ఉండటానికి ముల్లంగి ఉపకరిస్తుందని ఆయుర్వేద గ్రంథాల్లో పేర్కొన్నారు. అంతే కాదు- ముల్లంగి వల్ల అనేక ఇతర ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి.

- ముల్లంగి దుంపను ముక్కలుగా తరిగి- దానిని రాత్రి నీళ్లలో నానబెట్టి- ఉదయాన్నే లేచి ఆ నీళ్లు తాగితే స్థూలకాయం తగ్గుతుంది.
- ముల్లంగి ముక్కలతో జ్యూస్ చేసి.. దానిలో నీళ్లు, నిమ్మకాయ రసం కలిపి- ఉదయాన్నే తాగితే మధుమేహం తగ్గుతుంది. చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పడుతుంది.
- ముల్లంగి దుంప, ఆకులను తీసుకొని విక్సీలో వేసి జ్యూస్ చేసి తాగితే కళ్లకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి.
- ముల్లంగి రసం, నువ్వుల నూనె కలిపి బాగా కాచి- చల్లారిన తర్వాత ఒక సీసాలో పోసుకోవాలి. దీనిని క్రమం తప్పకుండా రాస్తే బొల్లి మచ్చలు తగ్గిపోతాయి.
- మన మెదడు మధ్యభాగంలో ఉండే పీనియల్ గ్రంథి- రాత్రి సమయంలో మెలటోనిన్ అనే హార్మోనుని ఉత్పత్తి చేస్తుంది. పగలు ఈ హార్మోను ఉత్పత్తి కాదు. రాత్రిళ్లు మెలుకువగా ఉండేవారిలో ఈ హార్మోను ఉత్పత్తి కాదు. దీని వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. వీటికి ముల్లంగి పరిష్కారాన్ని చూపిస్తుంది.

కూర ఎలా చేయాలి?

లేత ముల్లంగి దుంపలను ఎంచుకొని.. పై తొక్క తీసేయాలి. దుంపలను చిన్న ముక్కలుగా తరిగి ఉప్పు చల్లాలి. అప్పుడు కొన్ని నీళ్లు ఊరతాయి. వాటిని తీసేయాలి. ఒక మూకుడులో నూనె వేసి కాచాలి. ఆ నూనెలో తాలింపు పెట్టాలి. ఇంగువ కూడా వేయాలి. ఆ తర్వాత ముల్లంగి ముక్కలను వేసి మూత పెట్టి కొద్ది సేపు మగ్గనివ్వాలి. వేడి తగ్గిన తర్వాత కూరలో నిమ్మకాయ రసాన్ని కలపాలి. కొందరు ముల్లంగిని తురిమి పెరుగులో కలిపి పచ్చడి కూడా చేస్తారు.

• గంగరాజు అరుణాదేవి

స్మార్ట్ కిచెన్...


మహిళలకు వంటింటి పనుల్లో చేదోడుగా నిలిచేందుకు కొన్ని స్మార్ట్ గ్యాడ్జెట్స్ మార్కెట్లోకొచ్చేశాయి. వేడి పాత్రలను సింపుల్‌గా స్టౌ మీద నుంచి దించాలన్నా, వెల్లుల్లి చకచకా రోస్ట్ చేయాలన్నా, టమాటో ముక్కలు సరిగ్గా కట్ చేయాలన్నా ఇకపై చిటికెలో పని. మరి ఇంతకీ ఆ స్మార్ట్ గ్యాడ్జెట్స్ ఏంటో చూద్దామా..

గరిటకు రెస్ట్..



రోజూ వంట చేసే క్రమంలో ఆయా పదార్థాల్ని కలపడానికి వేర్వేరు గరిటలు వాడుతుంటాం. పనైపోయాక వాటిని స్టౌ మీదనో లేదో ప్లాట్‌ఫామ్ మీదో గబగబా పెట్టేస్తుంటాం. దీనివల్ల ఆ ప్రదేశమంతా నూనె మరకలు పడి అపరిశుభ్రంగా తయారవుతుంది. అందుకే ఈ సమస్యకు చెక్ పెట్టడానికి 'స్పూన్ రెస్ట్ హోల్డర్' మార్కెట్లోకొచ్చేశాయి. వీటిలో గరిట మాత్రమే కాదు పాత్రలపై పెట్టే మూతల్ని అమర్చుకునే సౌకర్యం కూడా ఉంది.

గార్లిక్ రోస్టర్



వెల్లుల్ని రోస్ట్ చేయడం కాస్త కష్టంతో కూడుకున్నదే. వాటిని పొయ్యి మీద లేదా ఓవెన్‌లో కాల్చాలన్నా ఆరంతం వెల్లుల్లి వాసనే వస్తుంది. అందుకోసమే ప్రత్యేకించి ఈ 'గార్లిక్ రోస్టర్' అందుబాటులోకి వచ్చింది. ఈ ఎలక్ట్రానిక్ పరికరంలో వెల్లుల్లి చివరలు కత్తిరించి కాస్త వంటనూనె లేదా ఆవనూనె గానీ వెయ్యాలి. అవసరమైతే పెప్పర్, సాల్ట్ చల్లి మూత పెట్టేకొని, ముందరున్న బటన్‌ని ఆన్ చేస్తే చాలు. అదే చక్కగా కాలతాయి. 30 నిమిషాల్లోనే గార్లిక్ రోస్ట్ రెడీ అవుతుంది.

చేతులు కాలవిక



స్టౌ మీద నుంచి వేడి పాత్రలను దించడానికి చాలామంది క్లాత్స్ ఉపయోగిస్తుంటారు. అయితే ఒక్కోసారి వాటిని ఉపయోగించినా చేతులు కాలుతుంటాయి. ఆ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ 'కుకింగ్ గ్లోవ్స్' బాగా ఉపయోగపడతాయి. వీటి సాయంతో చేతులు కాలకుండా వేడి గిన్నెల్ని కిందకు దించొచ్చు. సిలికాన్ మెటీరియల్‌తో తయారైన ఈ గ్లోవ్స్ విభిన్న రంగుల్లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉడికిన గుడ్లు బయటకు తీసేందుకు, ఓవెన్‌లో బేకింగ్ ట్రేలు పెట్టేటప్పుడు, తీసేటప్పుడు కూడా వాడొచ్చు. ఇవి పూర్తిగా ఉష్ణ నిరోధకంగా పనిచేస్తాయి. పైగా శుభ్రం చేయడమూ తేలికే.

చకచకా తరగొచ్చు



ఉల్లిపాయలు, టమాటో ముక్కలను వేగంగా కోసేటప్పుడు అవి కొంచెం పక్కకు కదిలిపోతూ ఇబ్బంది పెడుతుంటాయి. అలా కదలకుండా ఉండేందుకు ఈ 'వెజిటబుల్ స్లైసర్' చక్కగా ఉపయోగపడుతుంది. దీనిని వాడడం కూడా తేలికే. రెండు హ్యాండిల్స్ మధ్యలో టమాటో లేదా బంగాళదుంప లేదా ఉల్లిపాయను పెట్టి కాస్త గట్టిగా నొక్కి పట్టుకుంటే అవి స్థిరంగా ఉంటాయి. అప్పుడిక ముక్కలు చకచకా తరగొచ్చు.



చాలా మందికి హైదరాబాద్ బిర్యానీ అంటే ఇష్టం. బిర్యానీతో పాటుగా మిర్చి సాలన్ అంటే కూడా ఇష్టమే! అయితే ఈ సాలన్‌ను రకరకాలుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. అలాంటి కొన్ని వంటలను చూద్దాం..

సై... సాలన్!

సఫేద్ మిర్చి కా సాలన్

కావాల్సిన పదార్థాలు

బజ్జీ మిర్చి- అర కిలో, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, నిమ్మరసం- నాలుగు టేబుల్ స్పూన్లు, నూనె- అరకప్పు, నువ్వుపప్పు- 100 గ్రాములు, ఎండు కొబ్బరి పొడి- 200 గ్రాములు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- బజ్జీ మిర్చిని సన్నగా తరగాలి. వాటి మధ్యలో ఉండే గింజలను తీసేయాలి.
- నువ్వులు, కొబ్బరి పొడిలను మిక్సీలో వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా రుబ్బాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి జీలకర్రను వేయించాలి. ఈ నూనెలో నువ్వులు, కొబ్బరి పొడి మిశ్రమాన్ని వేయాలి. కొద్దిగా నీళ్లు పోసి ఉడకనివ్వాలి. కొద్ది సేపటి తర్వాత నీళ్లు పైకి తేలుతూ ఉంటాయి.
- ఆ సమయంలో తరిగిన మిర్చిని మిశ్రమంలో కలపాలి. మిర్చి ముక్కలు మెత్తగా అయిన తర్వాత స్టౌ మీద నుంచి కిందకు దింపాలి.
- కొద్దిగా చల్లబడిన తర్వాత ఆ మిశ్రమంలో నిమ్మరసం వేసి కలపాలి.



జాగ్రత్తలు

- వీలైనంత వరకు మార్కెట్లో లభించే బజ్జీ మిర్చి మాత్రమే వాడాలి. మామూలు మిర్చి వాడితే సరైన టేస్ట్ రాదు.
- వీలైనంత వరకు ఎండు కొబ్బరి పొడినే వాడాలి. దీనివల్ల మంచి రుచి వస్తుంది.
- ఇది చపాతీల లోకి చాలా బాగుంటుంది.

ప్యాజ్ కీ ఘట్టికా సాలన్



కావాల్సిన పదార్థాలు

చుక్క కూర- ఐదు కట్టలు, సాంబారు ఉల్లిపాయలు- పావు కిలో, మామూలు ఉల్లిపాయ ముక్కలు- 100 గ్రాములు, టమోటా ముక్కలు- 100 గ్రాములు, అల్లం వెల్లులి పేస్ట్- ఒక టేబుల్ స్పూను, కారం- ఒక టేబుల్ స్పూను, పసుపు- అర టీ స్పూను, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- చుక్క కూరను బాగా కడగాలి. ఆ తర్వాత ఆకులను విడదీసి సన్నగా తరగాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలను వేసి బాగా వేయించాలి.
- ఆ ముక్కలకు అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కలపాలి. ఆ తర్వాత కారం, పసుపు, ఉప్పులను వేయాలి. ఆ మిశ్రమంలో సాంబారు ఉల్లిపాయలను వేసి మూత పెట్టాలి.
- ఉల్లిపాయలు ఉడికిన తర్వాత- దానిలో తరిగిన చుక్కకూరను, టమోటా ముక్కలను వేయాలి.
- దీనిలో తగినన్ని నీళ్లు పోసి బాగా ఉడకనివ్వాలి. సాంబారు ఉల్లిపాయలు పైకి తేలిన తర్వాత స్టౌ నుంచి కిందకు దింపేయాలి.

జాగ్రత్తలు

- చుక్క కూరను ఉప్పు కలిపిన నీళ్లలో కడగాలి. అప్పుడు దానిపై ఉన్న మలినాలు, రసాయన పదార్థాలు తొలగిపోతాయి.
- సాంబారు ఉల్లిపాయలు మృదువుగా ఉంటాయి. వాటిని ఎక్కువ సేపు మగనివ్వాల్సిన అవసరం ఉండదు.

ముంగోడీ ఔర్ టమోటర్ కా సాలన్

ముంగోడీలకు కావాల్సిన పదార్థాలు

పెసరపిండి- 100 గ్రాములు, శనగపిండి- నాలుగు టీ స్పూనులు, నూనె- తగినంత, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

సాలన్‌కు కావాల్సిన పదార్థాలు

తరిగిన టమోటా ముక్కలు- అర కిలో, పెసర పప్పు పకోడీలు- 150 గ్రాములు, తరిగిన ఉల్లిపాయ- ఒకటి, అల్లం వెల్లులి పేస్ట్- ఒక టేబుల్ స్పూను, కారం- అర టీస్పూను, పసుపు- అర స్పూను, తరిగిన కొత్తిమీర- అరకప్పు, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ముందుగా ఒక గిన్నెలో పెసరపిండి, శనగపిండిలను నీళ్లతో కొద్దిగా గట్టిగా కలపాలి. దానిలో తగినంత ఉప్పు వేయాలి.
- ఒక మూకుడులో నూనెను వేసి- పెసర పిండి మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేసి వేయించాలి. ఇలా వేగిన పకోడీలను ఒక ప్లేటులో పెట్టి చల్లార్చాలి.



- అదే మూకుడులో మరి కొంత నూనె వేసి, ఉల్లిపాయ ముక్కలను బాగా వేయించాలి. ఆ తర్వాత దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి.

ఆ తర్వాత కారం, పసుపు, ఒక పావు కప్పు తరిగిన కొత్తిమీర, ఉప్పు వేసి మూత పెట్టి ఉడకనివ్వాలి. ఆ తర్వాత టమోటా ముక్కలను వేయాలి. తగనన్ని నీళ్లు పోయాలి. ఈ మిశ్రమం బాగా ఉడికి- నూనె పైకి తేరుతున్న సమయంలో మూంగోడీలను వేసి మరి కొంత సేపు ఉడకనివ్వాలి.

జాగ్రత్తలు

- మూంగోడీలు లేకపోతే సోయా ముక్కలను కూడా వాడవచ్చు.
- మూంగోడీల తయారీలో శనగ పిండికి బదులుగా బియ్యపు పిండి కూడా వాడవచ్చు.
- దేశీ టమోటాలను వాడితే ఎక్కువ రుచిగా ఉంటుంది.
- దీనిని చపాతీలలో కానీ వేడి అన్నంలో కానీ తింటే బావుంటుంది.

మేకప్ చెక్కుచెదరకుండా..



కష్టపడి వేసుకున్న మేకప్ చిటికెలో చెదిరిపోతే, శ్రమంతా వృథా అవుతుంది. అలా కాకుండా ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలంటే, ఈ చిట్కాలు పాటించాలి.

సెట్టింగ్ పౌడర్ ఇలా...

మేకప్ పూర్తయిన తర్వాత, దాన్ని సెట్ చేసుకోవడం అవసరం. అందుకోసం మేకప్ సెట్టింగ్ స్ప్రేలు, పౌడర్లు ఉన్నాయి. మేకప్‌లో తడి, పొడి ఉత్పత్తులను కలిపితే, అవి రెండూ జత కట్టి, ఎక్కువకాలం చెక్కుచెదరకుండా ఉంటాయి. మేకప్‌లో లిక్విడ్ ఫౌండేషన్, కన్‌సీలర్.. ఈ రెండూ తడి ఉత్పత్తులు. సెట్టింగ్ పౌడర్ పౌడర్ రూపంలో ఉంటుంది. కాబట్టి దీన్ని ఉపయోగించేటప్పుడు, ఎలాంటి భయం లేకుండా తడి ఉత్పత్తులను వాడుకోవచ్చు. ముఖం మీద జిడ్డుగా మారే వీలున్న ప్రదేశాలైన నుదురు, చుబుకం, ముక్కు మీద సెట్టింగ్ పౌడర్ అప్లై చేసుకోవాలి. నిజానికి మేకప్ వేసుకున్న ప్రదేశమంతా సెట్టింగ్ పౌడర్ అప్లై చేసుకోవచ్చు. కానీ చమట, చర్మపు నూనెలతో మేకప్ తేలికగా చెదిరిపోయే వీలున్న ప్రాంతాల మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి.

సెట్టింగ్ స్ప్రే ఇలా...

ఫౌండేషన్, కన్‌సీలర్, బ్లష్ ముఖానికి అప్లై చేసుకున్న ఉత్పత్తులన్నీ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రేను వాడుకోవచ్చు. చక్కని బేస్ మేకప్‌లో భాగంగా ప్రైమర్‌కు బదులుగా సెట్టింగ్ స్ప్రే ముఖం మీద స్ప్రే చేసుకోవచ్చు. అందుకోసం ముఖానికి మొదట మాయిశ్చరైజర్ అద్దుకుని, సన్‌స్క్రీన్ అప్లై చేసుకుని, ముఖానికి 6 అంగుళాల దూరం నుంచి సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసుకోవాలి. ఐ షాడో అద్దుకున్న కొద్ది సేపటికే ముడతలు తలెత్తుతుంటే, ఐ షాడో వేసుకున్న తర్వాత సెట్టింగ్ స్ప్రేను వాడుకోకుండా, ఐషాడోలో సెట్టింగ్ స్ప్రే కలుపుకుని, అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం బ్లష్‌తో ఐషాడోను తీసుకుని, దాని మీద నాలుగైదు సార్లు సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసి, కనురెప్పల మీద అప్లై చేసుకోవాలి. తడి స్పాంజ్ మీద సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసి, హైలైటర్‌లో అద్ది, బుగ్గలు, కనుబొమల పైన, ముక్కు మీద అద్దుకుంటే మేకప్ మెరుపు రెట్టింపవుతుంది.

వాళ్లు దోమలను ఆకర్షిస్తారు

దోమలు బాగా కుడుతున్నాయని కొందరిని అదే పనిగా ఫిర్యాదు చేయడం చూస్తూనే ఉంటాం. నిజంగానే దోమలు అలా కొందరినే పనిగట్టుకుని ఎక్కువగా కుడతాయా? అంటే నిజమేనని అంటున్నారు పరిశోధకులు. దీనికి కారణం వాళ్ల శరీరం నుంచి వచ్చే ఒకరకమైన వాసనే అని అంటున్నారు. ఆ వాసనకు దోమలు ఆకర్షితమవుతాయట. అంటే వాళ్లకు తెలియకుండానే దోమలను ఆకర్షిస్తుంటారు. శరీరం నుంచి వచ్చే చెమటలో ఉండే రకరకాల కెమికల్స్ కీటకాలను ఆకర్షిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దోమలు దాదాపు 60 అడుగుల దూరం నుంచే వాసనలు పసిగడతాయి. అలాగే రాత్రి 10 నుంచి ఉదయం 2 గంటల మధ్య దోమలు ఎక్కువ యాక్టివ్‌గా ఉంటున్నట్టు వీరి అధ్యయనంలో తేలింది. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో దోమల కదలికలను ట్రాక్ చేసి మరీ ఈ విషయాలను వెల్లడించారు. దోమలు కార్బాక్సిలిక్ యాసిడ్, బ్యుటిరిక్ యాసిడ్‌లకు ఎక్కువ ఆకర్షితమవుతాయి. ఈ కార్బాక్సిలిక్ యాసిడ్‌ను మనిషి చర్మంపైన బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుంది. ఆ వాసనకు ఆకర్షితమయ్యే దోమలు వచ్చేస్తాయి. ప్రాణాంతకమైన మలేరియా దోమలు కుట్టడం వల్ల వస్తుందన్న సంగతి తెలిసిందే. ప్లాస్మోడియం అనే పరాన్నజీవి మనిషి రక్తంలో చేరినప్పుడు మలేరియా వస్తుంది. మలేరియా సోకిన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు రక్తంతో పాటు ఆ పరాన్నజీవి దోమలోకి చేరుతుంది. దోమ పొట్టలో ఈ పరాన్నజీవి వృద్ధి చెందుతుంది. మరో మనిషిని కుట్టినప్పుడు అతనికి వ్యాపింపజేస్తుంది. ఇలా మలేరియా విస్తరిస్తూ పోతుంది. మలేరియా వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 6 లక్షల మంది చనిపోతున్నారు. ఇందులో ఐదేళ్ల లోపు పిల్లల సంఖ్యే ఎక్కువ.



పర్యావరణం - అధ్యయనం

దిక్సూచి DIKSUCHI

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

- **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.
- **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్, నిరేంద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం ఇండియన్ జాగ్రఫీ

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం

సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) వాతావరణం: ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

- భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.
- వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.
- వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.
- వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.
- గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)
- **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ
- **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

- దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.
- ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.
- భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్‌ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.

వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ



నవ్య | చిత్రజ్యోతి

నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్క్రీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్ల సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా ధన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.








చిరంజీవికి అక్కినేని అవార్డ్

తెలుగు చిత్రపరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఈ అవార్డులు ఇవ్వడం కోసం టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా కోటి రూపాయల మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక అప్పటినుంచి షబనా అజ్మీ, అంజలీదేవి, వైజయంతి మాల, లతా మంగేష్కర్, కె.బాలచందర్, హేమమాలిని, శ్యామ్ బెనగల్ వరుసగా అక్కినేని జాతీయ అవార్డ్ అందుకున్నారు. ఆ తర్వాత అవార్డ్ ప్రదానానికి రెండేళ్ల గ్యాప్ వచ్చింది. 2014లో తిరిగి అమితాబ్ బచ్చన్‌కు అవార్డ్ ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ రెండేళ్లు గ్యాప్ వచ్చింది. 2016లో తిరిగి జర్నలిస్ట్ గుడిపూడి శ్రీహరికి ఏయన్నార్ అవార్డ్ ఇచ్చారు. ఆ తర్వాత దర్శకుడు రాజమౌళి, శ్రీదేవి, రేఖ ఈ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత మళ్లీ గ్యాప్ వచ్చింది. ఐదేళ్ల అనంతరం తిరిగి ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు నాగార్జున వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.



మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. వీలు చూసుకుని షూటింగ్ కోసం తగిన సమయం కేటాయిస్తానని తన నిర్మాతలకు మాట ఇచ్చారు. దానికి కట్టుబడి 'హరి హర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. 400 మంది సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లు ఈ చిత్రీకరణలో పాల్గొననున్నారు. అలాగే నాజర్, రఘుబాబు, సునీల్, అభిమన్యుసింగ్, అయ్యప్ప తదితర నటులు కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతి కృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.


పెళ్లి పాటతో ప్రచారం షురూ



కాలేజ్ స్టూడెంట్స్ చేసే అల్లరి నేపథ్యంలో రూపొందిన వినోదాత్మక చిత్రం 'మ్యాడ్'. దీనికి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం తెరకెక్కుతోంది. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ సాగే తొలి గీతాన్ని శుక్రవారం విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, భీమ్స్ సిసిరోలియో స్వరాలందించడంతో పాటు మంగ్లీతో కలసి పాడారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షామ్ దత్.

భారీ సెట్‌తో సిద్ధం

'విరూపాక్ష, బ్రో' చిత్రాలతో విజయాలను అందుకున్నారు సాయిదుర్గ తేజ్. ఆయన ప్రస్తుతం రోహిత్ కె.పి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. 'ఎస్‌డీటీ 18' వర్కింగ్ టైటిల్. కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇటీవలె యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేసిన చిత్రబృందం కొత్త షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. దీని కోసం 12 ఎకరాల విస్తీర్ణంలో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో యాక్షన్ పార్ట్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తున్నారు.




ఎమ్మీ బరిలో ది నైట్ మేనేజర్

బాలీవుడ్ వెబ్‌సిరీస్ 'ది నైట్ మేనేజర్' అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రతిష్ఠాత్మక 52వ ఎమ్మీ అవార్డుల నామినేషన్స్‌కు ఎంపికైంది. శుక్రవారం నామినేషన్స్ వివరాలను ప్రకటించారు. ఇండియా నుంచి 'ది నైట్ మేనేజర్' సిరీస్ మాత్రమే బరిలో నిలిచింది. ఇది డ్రామా సిరీస్ విభాగంలో పోటీ పడుతోంది. నవంబర్ 25న న్యూయార్క్‌లో ఎమ్మీ పురస్కారాల ప్రధానోత్సవం జరగనుంది. శోభితా దూళిపాళ్ల, అనిల్‌కపూర్, ఆదిత్యారాయ్‌కపూర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సిరీస్‌ను దర్శకుడు సందీప్ మోదీ తెరకెక్కించారు. ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. 2016లో వచ్చిన హాలీవుడ్ సిరీస్ 'ది నైట్ మేనేజర్'కు ఇది రీమేక్.



సత్యదేవ్‌గా అమితాబ్

రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'వేట్టయాన్'. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. అమితాబ్ బచ్చన్, రానా, ఫహద్ ఫాజిల్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో నటిస్తుండగా ఆయన పై అధికారి పాత్రలో అమితాబ్‌బచ్చన్ నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఓ అప్డేట్‌ను వదిలింది. ఇందులో సత్యదేవ్ అనే శక్తిమంతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో అమితాబ్‌బచ్చన్ కనిపించనున్నట్లు తెలిపింది. ఇటీవలే ఆయన తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ వర్క్‌ను పూర్తి చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్, అమితాబ్‌బచ్చన్ చిత్రీకరణలో పాల్గొన్న వీడియోను యూనిట్ విడుదల చేసింది. అక్టోబర్ 10న ఈ చిత్రం విడుదలవనుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం భారీ స్థాయిలో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది.



కె.బాలచందర్ స్త్రీలోలుడు

- గాయని సుచిత్ర





తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవించివున్నంతకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్ట్‌మేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్ళలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుడు సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, ' భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

సైకో థ్రిల్లర్ దక్షిణ

కొత్తగా..



'మంత్ర, మంగళ లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఓషో తులసిరామ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'దక్షిణ'. అశోక్ షిండే నిర్మిస్తున్న ఈ చిత్రంలో సాయిధన్సిక ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రిషబ్ బసు, మేఘనా చౌదరి కీలకపాత్రలు పోషిస్తున్నారు. 'దక్షిణ' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 4న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'టాలీవుడ్‌కు ఇదో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్ అవుతుంద'ని చెప్పారు. నైజాంలో మైత్రీ మూవీస్ సంస్థ దక్షిణను విడుదల చేస్తుందని తులసిరామ్ తెలిపారు. సంగీతం: బాలాజీ, ఛాయాగ్రహణం: రామకృష్ణ.

దీపావళికి షణ్ముఖ



ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. దీపావళి సందర్భంగా 'షణ్ముఖ'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుపుతూ శుక్రవారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఆది సాయికుమార్‌కు జోడీగా అవికాగోర్ నటిస్తున్నారు. షణ్ముగం సాప్పని స్వీయ దర్శకత్వంలో తులసీరామ్‌తో కలసి నిర్మిస్తున్నారు. 'ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఆది కెరీర్‌లో మైలు రాయిగా నిలిచిపోయే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

మలుపులు మెప్పిస్తాయి



హీరోయిన్ వేదిక లీడ్‌రోల్ పోషిస్తున్న చిత్రం 'ఫియర్'. డాక్టర్ హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. 'ఫియర్' టీజర్‌ను శుక్రవారం హీరో రానా చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేదిక మాట్లాడుతూ 'హరిత గారు అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా 'ఫియర్'ను తెరకెక్కించారు. కథలోని ఊహించని మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. ప్రేక్షకులను థ్రిల్ చేసే అంశాలు చాలా ఉన్నాయి' అన్నారు. వేదిక నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని దర్శకురాలు చెప్పారు.

హైదరాబాద్‌లో 'మేబాక్' ప్రత్యేక లాంజ్

- ఈక్యూఎస్ సీరిస్‌లో మరో ఈవీ
- మెర్సిడెస్ బెంజ్ ఎండీ సంతోష్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెస్ బెంజ్.. హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా శనివారం తన మేబాక్ సీరిస్ కార్ల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక లాంజ్ ప్రారంభిస్తోంది. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఈ విషయం వెల్లడించారు. తాజాగా భారత మార్కెట్లో విడుదల చేసిన తమ లేటెస్ట్ ఎలక్ట్రిక్ వెర్షన్ (ఈవీ) మేబాక్ ఈక్యూఎస్ 680 ఎస్‌యూవీకి హైదరాబాద్ నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రూ.2.25 కోట్ల ఎక్స్‌షోరూమ్ ధర ఉండే ఈ ఈవీని కంపెనీ అమెరికా తర్వాత భారత్‌లో మాత్రమే అసెంబుల్ చేస్తోంది. తమ విద్యుత్ వాహనాలు ఏవైనా ఒకసారి చార్జి చేస్తే 600 నుంచి 700 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని అయ్యర్ చెప్పారు.

బ్యాటరీపై పదేళ్ల హామీ: తమ ఈవీల్లో ఉపయోగించే బ్యాటరీలకు పదేళ్ల హామీ ఉంటుందని సంతోష్ అయ్యర్ తెలిపారు. పన్నులు, ప్రభుత్వ సబ్సిడీలు ఈవీల ధరల నిర్ణయంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పుణెలోని ప్లాంట్‌పై మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఇప్పటి వరకు రూ.3,000 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ సంవత్సరం మరో రూ.200 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు వెల్లడించారు.



84,500 పైకి సెన్సెక్స్

సూచీ 1,360 పాయింట్లు అప్.. 25,800 స్థాయికి నిఫ్టీ

సరికొత్త రికార్డు గరిష్ఠాలకు స్టాక్ మార్కెట్ సూచీల పరుగు ● రూ.6.24 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 84,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 25,500 ఎగువకు చేరుకుంది. ఫెడ్ రేటు 0.50 శాతం తగ్గిన నేపథ్యంలో అమెరికా, ఆసియా మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ఉవ్వెత్తున ఎగిశాయి. వడ్డీ ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరిపారు. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లకూ డిమాండ్ పెరగడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు కూడా మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులో రూ.6.24 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.471.72 లక్షల కోట్లకు (5.65 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- సెన్సెక్స్ ఒక దశలో 1,509.66 పాయింట్లు (1.81 శాతం) ఎగబాకి 84,694.46 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1,359.51 పాయింట్లు (1.63 శాతం) లాభంతో 84,544.31 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా.
- నిఫ్టీ సైతం ఒక దశలో 433.45 పాయింట్లు (1.70 శాతం) వృద్ధితో 25,849.25 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును, చివరికి 375.15 పాయింట్లు (1.48 శాతం) పెరుగుదలతో 25,790.95 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 లాభపడ్డాయి. ఎం అండ్ ఎం షేరు 5.57 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. బీఎస్ఈలో మొత్తం 4,059 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,383 లాభపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సహా 265 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేశాయి.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.2,500 కోట్ల ఐపీఓ: తన అనుబంధ విభాగమైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ద్వారా షేర్లను స్టాక్ మార్కెట్లో నమోదు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎ‌ఫ్‌సీ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. ఐపీఓలో భాగంగా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.2,500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత, అర్హులైన వాటాదారులకు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించేందుకు సైతం బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్ బ్యాంక్ 94.64 శాతం వాటా కలిగి ఉంది.

- రాజస్థాన్‌కు చెందిన కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ కంపెనీ రూ.342 కోట్ల ఐపీఓ ఈనెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.209-220గా నిర్ణయించింది.

ఐపీఓల బిజీ

14 ఏళ్లలో అత్యంత సందడి మాసమిదే: ఆర్‌బీఐ

ఈ నెలలో ప్రైమరీ మార్కెట్ వరుస పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)లతో కోలాహలంగా మారింది. ప్రధాన ప్లాట్‌ఫామ్స్‌తో పాటు ఎస్ఎంఈ విభాగంలో లిస్ట్ కానున్న కంపెనీల ఐపీఓలకు గడిచిన 14 ఏళ్లలో అత్యంత సందడి (బిజీ) మాసమిదేనని శుక్రవారం విడుదల చేసిన బులెటిన్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఇప్పటికే 28 కంపెనీలు ఐపీఓకు వచ్చాయి. వచ్చే వారంలో మరిన్ని రాబోతున్నాయి. ప్రైమరీ మార్కెట్లో ఐపీఓల ద్వారా సమీకరణ ఈ ఏడాదిలో సమృద్ధిగా ఉందని, 2024 ప్రథమార్థానికి ప్రపంచవ్యాప్త ఐపీఓల్లో అత్యధికం (27 శాతం) భారత్‌లోనే నమోదైనట్లు ఆర్‌బీఐ తెలిపింది. అందులో ఎస్ఎంఈ ఐపీఓలే అధికమని పేర్కొంది. ఐపీఓల ద్వారా సమీకరించిన నిధుల విలువలో మాత్రం భారత్ వాటా 9 శాతంగా ఉంది. దేశీయ ఆర్థిక సేవల మార్కెట్ గణనీయ మార్పులకు లోనవుతున్నదని, గడిచిన కొద్దికాలంలో ఎస్ఎంఈ ఐపీఓలపైనా ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగిందని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది.

ఎస్ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులు పెట్టేందుకు మ్యూచువల్ ఫండ్లు సైతం ఎగబడుతుండటంతో ఇష్యూ సైజుకు పదులు, వందల రెట్లలో సబ్‌స్క్రిప్షన్ లభిస్తోందని రిపోర్టులో ప్రస్తావించింది. కాగా, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణ కూడా గణనీయంగా పెరిగిందని, ఈ ఏడాది ఆగస్టు నాటికి రూ.60,000 కోట్లకు చేరుకుని ఉండవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

- ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలా 21 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,760 కోట్లు) నిధులను సమీకరించింది. హార్న్‌బిల్ క్యాపిటల్ నేతృత్వంలోని ఇన్వెస్టర్ల నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు ప్రకటించింది. ఈ నిధుల సమీకరణతో కంపెనీ వాల్యుయేషన్ రెండున్నర రెట్లు పెరిగి 280 కోట్ల డాలర్లకు చేరింది.
- ఓరియెంటల్ ట్రైమెక్స్ లిమిటెడ్ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.48.51 కోట్లను సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కో షేరును రూ.11కు జారీ చేయనుంది. ఈ ఇష్యూ ఈ నెల 27న ముగియనుంది.
- ఎఫ్ఎంఎస్ డెంటల్ హాస్పిటల్.. న్యూరోమస్క్యులర్ డెంటిస్ట్రీ స్పెషాలిటీ సేవలను ప్రారంభించింది. పళ్లు, దవడలు, కండరాలు, నరాల మధ్యన ఉన్న సంబంధాలను ఈ స్పెషాలిటీ డెంటిస్ట్రీ పరిశీలిస్తుంది. టెంపోరో మ్యాండిబులర్ జాయింట్ (టీఎంజే) రుగ్మతలలోని క్లిష్టమైన పరిస్థితులను చక్కదిద్దటానికి ఇది చక్కగా పనిచేస్తుందని ఎఫ్ఎంఎస్ డెంటల్ వెల్లడించింది.
- ఆర్కిడ్ ఫార్మా.. ఆర్కిడ్ ఏఎంఎస్ డివిజన్‌ను ప్రారంభించింది. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) నుంచి రక్షణ కల్పించేందుకు ఈ డివిజన్ పనిచేయనుంది. వచ్చే రెండు మూడేళ్లలో 3,000కు పైగా హాస్పిటల్స్, హెల్త్‌కేర్ ఇనిస్టిట్యూషన్స్‌కు అవసరమైన ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌ను ఇది అందించనుంది. దేశవ్యాప్తంగా 13 నగరాల్లో ఏఎంఆర్‌పై ఆరోగ్య రక్షణ కమిటీలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సెషన్లను నిర్వహించనుంది.

మరో విడత 'వివాద్ సే విశ్వాస్'

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వివాదాల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి 'వివాద్ సే విశ్వాస్' పథకం ప్రవేశ పెడుతోంది. వివాద్ సే విశ్వాస్ 2.0 పేరుతో వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ స్కీమ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జూలై 22వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రత్యక్ష పన్నుల వివాదాలను ఈ స్కీమ్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. 2020లో ప్రవేశపెట్టిన వివాద్ సే విశ్వాస్ 1.0 స్కీమ్ ద్వారా దాదాపు రూ.75,000 కోట్ల ప్రత్యక్ష పన్ను వివాదాలు పరిష్కారం కావడంతో ప్రభుత్వం మరోసారి ఈ స్కీమ్‌ను తీసుకొస్తోంది. వివాద్ సే విశ్వాస్ 1.0 ద్వారా 1.2 లక్షల ప్రత్యక్ష పన్నుల వివాదాలు పూర్తయినా, ఇంకా రూ.35 లక్షల కోట్ల మొత్తానికి సంబంధించి 2.7 కోట్ల పన్ను వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. వివాద్ సే విశ్వాస్ 2.0 ద్వారా ఇందులో కొన్నిటినైనా పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇక ఎలక్ట్రానిక్ విధానంలోనే డివిడెండ్, వడ్డీ చెల్లింపులు!

సెబీ కొత్త ప్రతిపాదన

న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీలు తమ సెక్యూరిటీ హోల్డర్లకు ఇకపై డివిడెండ్లు, వడ్డీతో పాటు అన్ని రకాల చెల్లింపులను కేవలం ఎలక్ట్రానిక్ విధానంలోనే నెరిపేందుకు అనుమతించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రతిపాదించింది. చెల్లింపులను క్రమబద్ధీకరించడంతో పాటు ఇన్వెస్టర్ల సొమ్ముకు భద్రత, సౌకర్యం పెంచే ఉద్దేశంతో సెబీ ఈ ప్రతిపాదన చేసింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని శుక్రవారం విడుదల చేసిన నియంత్రణ మండలి.. అక్టోబరు 11లో సలహాలు, సూచనలు పంపాలని ప్రజలను కోరింది. ప్రస్తుత లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్ (ఎల్ఓడీఆర్) నిబంధనలు కూడా ఎలక్ట్రానిక్ చెల్లింపులను అనుమతిస్తాయి. కానీ, ఎలక్ట్రానిక్ విధానంలో బదిలీ చేయలేని పక్షంలో రూ.1,500 పైగా సొమ్మును చెక్కు, లేదా వారంట్ రూపంలో జారీ చేసేందుకూ వీలుంటుంది. సాధారణంగా సెక్యూరిటీ హోల్డర్ బ్యాంక్ ఖాతా వివరాలు అందుబాటులో లేకపోవడం లేదా తప్పులుంటే ఎలక్ట్రానిక్ విధానంలో బదిలీ విఫలమవుతుంది. సెబీ తాజా డేటా ప్రకారం.. టాప్ 200 లిస్టెడ్ కంపెనీలకు చెందిన 1.29 శాతం ఎలక్ట్రానిక్ డివిడెండ్ చెల్లింపులు ఫెయిలవుతున్నాయి. కాబట్టి, ఇన్వెస్టర్లు తమ బ్యాంక్ ఖాతా వివరాలను డిపాజిటరీల వద్ద అప్‌డేట్ చేసుకోవాలని సెబీ సూచించింది.

ఎంఎఫ్‌లు సీడీఎస్‌లు విక్రయించేందుకూ అనుమతి

క్రెడిట్ డీఫాల్ట్ స్వాప్‌ల(సీడీఎస్) కొనుగోళ్లతో పాటు విక్రయాలు జరిపేందుకూ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)కు సెబీ అనుమతిచ్చింది. కార్పొరేట్ బాండ్ మార్కెట్లో ద్రవ్య లభ్యతను పెంచే ఉద్దేశంతో క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి ఈ నిర్ణయ తీసుకుంది. ఈ వెసులుబాటు ఎంఎఫ్‌లకు అదనపు పెట్టుబడి సాధనంగా ఉపయోగపడనుందని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. ఇప్పటివరకు కార్పొరేట్ బాండ్ల క్రెడిట్ రిస్క్‌కు రక్షణగా సీడీఎస్‌ల కొనుగోలుకు మాత్రమే ఫండ్లకు అనుమతి ఉండేది. సెబీ తాజా నిర్ణయంతో సీడీఎస్‌ల కొనుగోలు, విక్రయాలతో ఫండ్లకు కార్పొరేట్ బాండ్లపై క్రెడిట్ రిస్క్ నిర్వహణకు మరింత వెసులుబాటు లభించనుంది. రుణగ్రహీత (బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించిన కార్పొరేట్ కంపెనీ) దివాలా నుంచి రక్షణ కల్పించే బీమా కాంట్రాక్టే సీడీఎస్.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,110 ▲	68,850 ▲	97,500 ▲
ముంబై	74,093 ▲	67,869 ▲	88,917 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	545
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103		
గోదావరి	113	అనంతపురం	110

స్పోర్ట్స్

బంగ్లా ఢమాల్



తొలి ఇన్నింగ్స్ 149 ఆలౌట్

చెలరేగిన పేసర్లు
- బుమ్రాకు నాలుగు వికెట్లు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 376
- రెండో ఇన్నింగ్స్ 81/3
- ప్రస్తుత ఆధిక్యం 308

చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ తొలి రోజు బ్యాట్ పవర్ చూపగా.. రెండో రోజు తమ బంతి పదునేంటో రుచి చూపించింది. దీంతో శుక్రవారమే మ్యాచ్‌పై పట్టు బిగించింది. ప్రస్తుతం రోహిత్ సేన 308 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. స్టార్ పేసర్ బుమ్రా (4/50) పేస్ ధాటికి పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 47.1 ఓవర్లలో కేవలం 149 పరుగులకే కుప్పకూలింది. బుమ్రాకు జతగా ఆకాశ్‌దీప్ (2/19), సిరాజ్ (2/30), జడేజా (2/19) ప్రత్యర్థిని కట్టడి చేశారు. షకీబ్ (32), మెహిదీ హసన్ (29), లిట్టన్ దాస్ (22), కెప్టెన్ షంటో (20) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. అయితే 227 పరుగులు వెనుకబడిన బంగ్లాదేశ్‌ను ఫాలోఆన్ ఆడించకుండా భారత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగి 81/3 స్కోరుతో కొనసాగుతోంది. కెప్టెన్ రోహిత్ (5), విరాట్ (17) మరోసారి నిరాశపర్చగా.. క్రీజులో గిల్ (33 బ్యాటింగ్), పంత్ (12 బ్యాటింగ్) ఉన్నారు. ఈ ఒక్క రోజే 17 వికెట్లు నేలకూలడం విశేషం. అంతకుముందు 339/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆరంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి సెషన్ ఆరంభంలోనే రెండో కొత్త బంతి తీసుకున్న బంగ్లా బౌలర్లు మిగిలిన 4 వికెట్లను వేగంగా పడగొట్టారు. ఇందులో మూడింటిని టస్కిన్ తీయగా.. హసన్ వరుసగా రెండోసారి ఐదు వికెట్ల ఫీట్‌ను పూర్తి చేశాడు. ముందుగా జడేజా 86 రన్స్ వద్దే టస్కిన్‌కు చిక్కడంతో ఏడో వికెట్‌కు అశ్విన్‌తో 199 పరుగులు కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత టెయిలెండర్లు ఇలా వచ్చి అలా వెళ్లగా అశ్విన్ (113) తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు.

ఒకటిన్నర సెషన్‌లోనే..: రెండో రోజు భారత్‌ను త్వరగానే ఆలౌట్ చేశామనే సంతోషంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్ ఆరంభించింది. అయితే భారత పేసర్ల ధాటికి వారి బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. బుమ్రాకు తోడు సిరాజ్-ఆకాశ్‌దీప్ చెలరేగడంతో బంగ్లా ఆట ఒకటిన్నర సెషన్‌లోనే ముగిసింది. స్పిన్నర్ జడేజా కీలక వికెట్లతో ఆకట్టుకున్నాడు. ముందుగా కళ్లు చెదిరే ఇన్‌స్వింగర్‌తో ఓపెనర్ షాద్‌మన్ ఇస్లాం (2)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అనంతరం వరుస ఓవర్లలో జకీర్ (3), మోమినుల్ (0)లను ఆకాశ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ షంటో కాసేపు క్రీజులో నిలిచినా సిరాజ్ ఓవర్‌లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చాడు. 40/5 స్కోరుతో బంగ్లా పరిస్థితి దయనీయంగా మారిన వేళ షకీబ్-లిట్టన్ ఆదుకున్నారు. వీరు ప్రమాదకరంగా మారుతున్న వేళ జడ్డూ వరుస ఓవర్లలో ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చడంతో బంగ్లా మరిక కోలుకోలేకపోయింది. టెయిలెండర్లను బుమ్రా చకచకా అవుట్ చేశాడు.

1 చెపాక్‌లో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు 17 వికెట్లు పడడం ఇదే తొలిసారి.

2 స్వదేశంలో జరిగిన మూడు ఫార్మాట్లలో కలిపి 12 వేల పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా విరాట్. సచిన్ (14,192) తొలి స్థానంలో ఉన్నాడు.

4 తొలి 10 టెస్టుల్లో ఎక్కువ పరుగులు (1094) సాధించిన నాలుగో బ్యాటర్‌గా జైస్వాల్. డాన్ బ్రాడ్‌మన్ (1446) టాప్‌లో ఉన్నాడు.

ఫాలోఆన్ ఎందుకు ఆడించలేదంటే..

బంగ్లాదేశ్ ఆలౌట్ అయ్యే సమయానికి 227 పరుగులు వెనుకంజలో ఉండడంతో భారత్ కచ్చితంగా ఆ జట్టును ఫాలో ఆన్ ఆడిస్తుందని భావించారు. కానీ రోహిత్ సేన మాత్రం రెండో ఇన్నింగ్స్ ఆడేందుకే మొగ్గు చూపింది. ఎందుకంటే..ప్రస్తుతం చెన్నైలో అధిక వేడితో పాటు తేమ ఎక్కువగా ఉంది. దీంతో వరుసగా తమ బౌలర్లను మరోసారి బౌలింగ్‌కు దించకుండా విశ్రాంతినివ్వాలని భావించింది. దీంతో బంగ్లా బౌలర్లు మాత్రం ఒకే రోజు రెండుసార్లు బౌలింగ్‌కు దిగాల్సి వచ్చింది. అంతేకాకుండా వేగంగా పరుగులు సాధించి బంగ్లా ముందు మరింత భారీ లక్ష్యం ఉంచి ఒత్తిడిలోకి నెట్టాలన్న ఆలోచనతోనూ టీమిండియా బ్యాటింగ్‌కు దిగింది.

వాట్.. విరాట్?

తొలి ఇన్నింగ్స్‌లో ఆరు పరుగులే చేసిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో ఇన్నింగ్స్‌లో 37 బంతుల్లో 17 పరుగులతో కాస్త కుదురుకున్నట్టే కనిపించాడు. కానీ అంపైర్ తప్పిదంతో తను ఎల్బీగా వెనుదిరగాల్సి వచ్చింది. అయితే విరాట్ మాత్రం ఈ అవుట్‌పై డీఆర్ఎస్‌కు వెళ్లకపోవడం ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే రీప్లేలో బంతి ప్యాడ్‌కన్నా ముందే స్పష్టంగా బ్యాట్‌ను తాకుతున్నట్టు తేలింది. విరాట్ నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న గిల్ అభిప్రాయాన్ని తీసుకుని పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. రీప్లేలో దీన్ని తిలకించిన కెప్టెన్ రోహిత్ కూడా 'అరె.. అతడికేమైంది' అన్నట్టుగా పక్కనున్న వారితో అసంతృప్తి వ్యక్తం చేశాడు.

5 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున వేగంగా 400 వికెట్లు పూర్తి చేసిన ఐదో బౌలర్‌గా బుమ్రా. ఓవరాల్‌గా టీమిండియా తరఫున పదో స్థానంలో ఉండగా కుంబ్లే (953) టాప్‌లో ఉన్నాడు.

షకీబ్ నోట్లో హెల్మెట్ స్ట్రాప్



షకీబ్ అల్ హసన్.. బ్యాటింగ్ సమయంలో తన హెల్మెట్ స్ట్రాప్‌ను నోట్లో పెట్టుకోవడం కాస్త వింతగా కనిపించింది. అయితే దీని వెనుక కారణాన్ని మాజీ కీపర్ దినేశ్ కార్తీక్ వెల్లడించాడు. బంతిని ఎదుర్కొనేటప్పుడు అతడి తల లెగ్ సైడ్‌కు వాలిపోకుండా.. నిటారుగా ఉంచేందుకే అలా చేస్తాడని తెలిపాడు. ఓసారి తమీమ్ ఇక్బాల్ ఈ విషయాన్ని డీకేకు చెప్పాడట. అలాగే స్పిన్నర్లను ఎదుర్కొనేటప్పుడు తల వాలిపోకుండా మెడ చుట్టూ క్లాత్‌ను చుట్టుకోవాలని తమ కోచ్ సూచించినట్టు ఓపెనర్ షాద్‌మన్ ఇస్లాం కూడా గతంలో చెప్పాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షాద్‌మన్ (బి) నహీద్ 56; రోహిత్ (సి) షంటో (బి) హసన్ 6; గిల్ (సి) లిట్టన్ (బి) హసన్ 0; విరాట్ (సి) లిట్టన్ (బి) హసన్ 6; పంత్ (సి) లిట్టన్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జకీర్ (బి) మెహిదీ హసన్ 16; జడేజా (సి) లిట్టన్ దాస్ (బి) టస్కిన్ 86; అశ్విన్ (సి) షంటో (బి) టస్కిన్ 113; ఆకాశ్‌దీప్ (సి) షంటో (బి) టస్కిన్ 17; బుమ్రా (సి) జకీర్ హసన్ (బి) హసన్ 7; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 30; మొత్తం: 91.2 ఓవర్లలో 376 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-14, 2-28, 3-34, 4-96, 5-144, 6-144, 7-343, 8-367, 9-374, 10-376. **బౌలింగ్:** టస్కిన్ 21-4-55-3; హసన్ మహమూద్ 22.2-4-83-5; నహీద్ 18-2-82-1; మెహిదీ హసన్ 21-2-77-1; షకీబ్ 8-0-50-0; మోమినుల్ హక్ 1-0-4-0.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: షాద్‌మన్ (బి) బుమ్రా 2; జకీర్ హసన్ (బి) ఆకాశ్ దీప్ 3; షంటో (సి) విరాట్ (బి) సిరాజ్ 20; మోమినుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) బుమ్రా 8; షకీబ్ (సి) పంత్ (బి) జడేజా 32; లిట్టన్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 22; మెహిదీ హసన్ (నాటౌట్) 27; హసన్ (సి) విరాట్ (బి) బుమ్రా 9; టస్కిన్ (బి) బుమ్రా 11; నహీద్ రాణా (బి) సిరాజ్ 11; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 47.1 ఓవర్లలో 149 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-2, 2-22, 3-22, 4-36, 5-40, 6-91, 7-92, 8-112, 9-130, 10-149. **బౌలింగ్:** బుమ్రా 11-1-50-4; సిరాజ్ 10.1-1-30-2; ఆకాశ్‌దీప్ 5-0-19-2; అశ్విన్ 13-4-29-0; జడేజా 8-2-19-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) లిట్టన్ (బి) నహీద్ 10; రోహిత్ (సి) జకీర్ (బి) టస్కిన్ 5; గిల్ (బ్యాటింగ్) 33; విరాట్ (ఎల్బీ) మెహిదీ హసన్ 17; పంత్ (బ్యాటింగ్) 12; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 23 ఓవర్లలో 81/3. వికెట్ల పతనం:** 1-15, 2-28, 3-67. **బౌలింగ్:** టస్కిన్ 3-0-17-1; హసన్ 5-1-12-0; నహీద్ 3-0-12-1; షకీబ్ 6-0-20-0; మెహిదీ హసన్ 6-0-16-1.



'సాయ్' కేంద్రంలో క్రీడామంత్రి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలి శాట్ క్రీడా సముదాయంలోని 'సాయ్' శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కొద్దిసేపు పీవీ సింధుతో బ్యాడ్మింటన్ ఆడిన మాండవ్య ఆ తర్వాత పారాలింపిక్స్‌లో పతకం నెగ్గిన అథ్లెట్ జి.దీప్తిని సన్మానించారు. అనంతరం గోపీచంద్ అకాడమీకి వెళ్లిన మాండవ్య షట్లర్లు కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టితో ముచ్చటించారు. ఈ సందర్భంగా స్టార్ షట్లర్లందరూ సంతకాలు చేసిన టీషర్ట్‌ను మంత్రికి వారు బహూకరించారు.

శ్రీలంక 237/4

గాలె: కరుణరత్నే (83), చాందిమల్ (61) రాణించడంతో న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆఖరికి శ్రీలంక 237/4 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 255/4తో శుక్రవారం తొలిఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 340 రన్స్‌కు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 305 రన్స్ చేసింది.

చెస్ ఒలింపియాడ్ ట్రోఫీ మాయం

చెన్నై: అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ఆఫీసులో ఉంచిన చెస్ ఒలింపియాడ్ గ్రప్రిన్‌దాష్విలి ట్రోఫీ మాయమైంది. దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఐసీఎఫ్ అధికారులు వెల్లడించారు. తాజా ఎడిషన్‌కు ఆతిథ్యమిస్తున్న బుడాపెస్ట్ (హంగేరీ)కు ఈ ట్రోఫీని తీసుకురావాల్సిందిగా అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) కోరడంతో.. ట్రోఫీ చోరీకి గురైందన్న విషయం వెలుగులోకొచ్చింది. వివరాల్లోకెళితే.. గత ఎడిషన్ ఒలింపియాడ్ రెండేళ్లక్రితం చెన్నైలో జరిగింది. అందులో ఉజ్బెకిస్థాన్ విజేతగా నిలవగా, భారత పురుషుల జట్టు కాంస్యం గెలిచింది. అయితే.. ఒలింపియాడ్ టోర్నీలో ఓపెన్, మహిళల విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసిన జట్టుకు గ్రప్రిన్‌దాష్విలి ట్రోఫీని అందజేస్తారు. గత ఎడిషన్‌లో భారత జట్టు ఈ ట్రోఫీని గెలుచుకుంది. కాగా, రోలింగ్ ట్రోఫీని జట్టుకు ఇచ్చి.. అసలైన ట్రోఫీని నిర్వాహకుల దగ్గరే ఉంచుకుంటారు. ఆ అసలైన ట్రోఫీనే ఇప్పుడు చోరీకి గురైంది.

ఈశ్వరన్ శతకం

- ఇండియా 'బి' 210/6
- ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (116) టోర్నీలో రెండో శతకంతో చెలరేగడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'బి' రెండోరోజు ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 210 పరుగులు చేసింది. 100/5తో కష్టాల్లో పడగా.. సుందర్ (39 బ్యాటింగ్) జతగా ఆరో వికెట్‌కు ఈశ్వరన్ 105 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 306/5 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'డి' 349 రన్స్‌కు ఆలౌటైంది. కిందటి రోజు 89 పరుగులతో ఆడుతున్న సంజూ శాంసన్ సెంచరీ (106) పూర్తిచేశాడు. నవ్‌దీప్ సైనీ (5/74) ఐదు వికెట్లు పడగొట్టాడు.

ఇండియా 'సి' 216/7

అభిషేక్ పోరెల్ (82) సత్తా చాటడంతో ఇండియా 'ఎ'తో మరో మ్యాచ్‌లో ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట చివరకు 216/7 స్కోరు చేసింది. 41/4తో ఇబ్బందుల్లో పడిన వేళ బాబా ఇంద్రజీత్ (34 రిటైర్డ్ హర్ట్) జతగా ఐదో వికెట్‌కు 51 రన్స్ జత చేసిన పోరెల్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 224/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'ఎ' 73 రన్స్ జోడించి మిగిలిన 3 వికెట్లు కోల్పోయింది. అవేశ్ ఖాన్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరిశాడు.

హెడ్ సూపర్ సెంచరీ

- లబుషేన్ ఆల్‌రౌండ్ షో ● ఇంగ్లండ్‌పై ఆసీస్ గెలుపు

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం అర్ధరాత్రి జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లతో గెలిచింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. బెన్ డకెట్ (95), విల్ జాక్స్ (62) అర్ధ సెంచరీలతో రాణించడంతో 49.4 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (154 నాటౌట్) శతకానికి తోడు లబుషేన్ (77 నాటౌట్) సత్తా చాటడంతో ఆసీస్ 44 ఓవర్లలో 317/3 స్కోరు చేసి గెలిచింది. హెడ్‌కిది కెరీర్‌లో అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు. ఇక మార్కస్ లబుషేన్ ఈ మ్యాచ్‌లో అర్ధసెంచరీకి పైగా రన్స్ చేయడంతో పాటు 3 వికెట్లు పడగొట్టాడు. ఇంకా 4 క్యాచ్‌లు కూడా పట్టాడు. ఓ వన్డే మ్యాచ్‌లో ఇలాంటి ఘనత సాధించిన తొలి ఆటగాడిగా లబుషేన్ రికార్డులకెక్కాడు.

తొమ్మిదో రౌండ్ డ్రా


చెస్ ఒలింపియాడ్‌లో భారత్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్ పురుషుల విభాగంలో రెండో సీడ్ భారత పురుషుల జట్టు ఓటమే లేకుండా దూసుకుపోతోంది. అయితే శుక్రవారంనాటి తొమ్మిదో రౌండ్‌ను విజయంతోకాక డ్రాతో సరిపెట్టుకుంది. 2-2 స్కోరుతో డిఫెండింగ్ చాంపియన్ ఉజ్బెకిస్థాన్ జట్టు మనోళ్లను నిలువరించింది. మరోవైపు భారత మహిళల జట్టు కూడా 2-2తో అమెరికాతో డ్రా చేసుకుంది. గుకేష్-అబ్దుసత్తోరోవ్, ప్రజ్ఞానంద-సిందరోవ్, విదిత్-వఖిదోవ్, అర్జున్-షంసిద్దిన్ వొఖిదోవ్ గేమ్‌లన్నీ ఫలితం తేలకుండా ముగిశాయి. అయితే, తొమ్మిదో రౌండ్ తర్వాతా 17 పాయింట్లతో పురుషుల జట్టు అగ్రస్థానంలోనే నిలిచింది. మహిళల్లో అమెరికాతో పోరులో..తోఖిర్‌జొనోవా చేతిలో వైశాలి ఓడగా, ఇరీనాపై వంతిక అగర్వాల్ గెలిచింది. ఇక, కరీసాతో దివ్య, లీ అలైస్‌తో తానియా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఈ రౌండ్ తర్వాత మహిళల జట్టు 15 పాయింట్లతో కొనసాగుతోంది.

తిరుమల సంప్రోక్షణ

శ్రీవారి ఆలయ శుద్ధికి సీఎం ఆదేశం

మంత్రులు, సీఎస్‌తో అత్యవసర భేటీ



తిరుమల శ్రీవారి లడ్డూలో వాడకూడని పదార్థాలను వినియోగించిన నేపథ్యంలో లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు, నెయ్యి భద్రపరిచిన ప్రదేశాలను సంప్రోక్షణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ ఈవో, అధికారులతో శుక్రవారం రెండుసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు.. గత వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. లడ్డూ తయారీ విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావును సీఎం ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌లతో చర్చలు జరుపుతామని ప్రకటించారు. భక్తుల విశ్వాసాలను, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని హామీ ఇచ్చారు. తిరుమల సంప్రోక్షణకు సంబంధించిన విధివిధానాలు తెలియజేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

బాబుది దుష్ప్రచారం: జగన్

తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో పశువుల కొవ్వు ఉందంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు దుష్ప్రచారం చేశారని.. దీనికి గాను అందరూ ఆయన్ను తిట్టాలని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. దీనిపై విచారణ జరగాలని.. చంద్రబాబుకు అక్షింతలు వేయాలని ప్రధాని మోదీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌లకు లేఖ రాస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ ఎంతో పవిత్రమైనదని, అందులో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని చెప్పి.. కోట్ల మంది వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలతో చంద్రబాబు ఆడుకోవడం ధర్మమేనా అని ప్రశ్నించారు.

లడ్డూపై రచ్చ రచ్చ

జాతీయస్థాయిలోనే తీవ్ర ప్రకంపనలు.. చంద్రబాబుకు స్వయంగా ఫోన్ చేసిన నడ్డా

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

తిరుమల స్వామి లడ్డూ ప్రసాదం కలుషితం అయినట్టు నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై తీవ్రంగానే స్పందించింది. ఏపీ సీఎం చంద్రబాబుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం ఫోన్ చేశారు. "తిరుపతి లడ్డూ కలుషితం కావడం చాలా తీవ్రమైన అంశం. ఈ వార్త అందగానే నేను చంద్రబాబుతో మాట్లాడాను. ఆయన నాకు వివరాలు తెలిపారు. ఆయన వద్ద ఉన్న నివేదికను పంపమని కోరాను. ఆ నివేదికను నేను పరిశీలిస్తాను. రాష్ట్ర నియంత్రణ అధికారులతో కూడా మాట్లాడాను. అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకొంటాం" అని నడ్డా అన్నారు. టీటీడీ ప్రసాదం అంశంపై సీబీఐ విచారణ జరపాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. ఇది హిందూ మతాన్ని అంతం చేసేందుకు జరిగిన కుట్రగా ఆయన అభివర్ణించారు. ఈ అంశంతో పాటు ప్రసాదంలో కలిపిన నెయ్యి కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టారో సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన నిందితులకు మరణ శిక్ష విధించాలని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. అత్యంత తీవ్రమైన ఈ విషయంపై క్షుణ్ణంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అభిప్రాయపడ్డారు కాగా జగన్ అండ్ కంపెనీ చేసిన దారుణాలు అన్నీ ఇన్నీ కావని కర్ణాటక ఎంపీ శోభా కరండ్లజే అన్నారు. తిరుమల కళాశాలలనుంచి శ్రీనివాసుడు, పద్మావతి ఫొటోలు తీసేశారని, హిందువు కాని వారిని బోర్డు కుర్చీలో కూర్చోబెట్టారని, చివరకు జంతువుల కొవ్వును కూడా పవిత్ర ప్రసాదంలో చేర్చారని ఆమె ఆగ్రహించారు. ఇది భక్తుల విశ్వాసం, నమ్మకంపై స్పష్టమైన దాడిగా కనిపిస్తోందని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ముఖ్తార్ అబ్బాస్ నక్వీ డిమాండ్ చేశారు. ఇది విషాదకరమని కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేడా వ్యాఖ్యానించారు కాగా, మత సంప్రదాయాలను ఉల్లంఘించిన పూర్వ టీటీడీ బోర్డుపై చర్య



లకు ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలైంది. దీనిని నేరపూరిత కుట్రగా, అధికార దుర్వినియోగంగా పరిగణించి తక్షణం జోక్యం చేసుకోవాలని సుదర్శన్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన సంపాదకుడు సురేశ్ చవహంకే తరపున సత్యం సింగ్ అనే న్యాయవాది.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. లడ్డూ ప్రసాదాన్ని పవిత్రమైన ఆశీర్వాదంగా భావించే అసంఖ్యాకమైన భక్తుల మనోభావాలను ఇది లోతుగా గాయపరచిందన్నారు. ఈ ప్రసాదానికి ఒక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్నదని చెప్పారు. తమ విశ్వాసానికి అనుగుణంగా ఆచారాలను పాటించే భక్తుల హక్కులను కాలరాశారని విమర్శించారు. లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. జగన్ సర్కార్ లో దేవుడిని కూడా రోడ్డుమీదకు ఈడ్చారన్నారు. దీనిపై అంతర్జాతీయంగా రచ్చ జరుగుతోందని అన్నారు. తిరుపతి లడ్డూ తయారీలో ఎద్దు కొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె ఉపయోగించడం నేరపూరిత చర్య కిందకే వస్తుందని శివసేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి మాటలు రావడం లేదన్నారు.

జాతీయ భద్రతా చట్టం వాడాలి

ప్రసాదంలో కలుషిత నెయ్యి కలిపినందుకు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, టీటీడీ అధికారులు, నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్ పై జాతీయ భద్రతా చట్టం క్రింద చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఉత్తర ప్రదేశ్ డీజీపీ ప్రశాంత్ కుమార్‌లకు లేఖలు రాశారు. ఈ ప్రసాదాన్ని అయోధ్యలో బాల శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగినప్పుడు కూడా పంపి పంచి పెట్టారని గుర్తుచేశారు. హిందూ మనోభావాలపై దాడి చేసినందుకు భారతీయ న్యాయసంహిత లోని 152, 182, 196, 298, 353 సెక్షన్లను ప్రయోగించడంతో పాటు జాతీయ భద్రతా చట్టంను కూడా ప్రయోగించి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తేడా తెలియనంతగా కల్తీ చేశారు!

కల్తీని ఎన్‌డీడీబీ నిర్ధారించింది

ఇక తిరుమలలోనే ల్యాబ్: టీటీడీ ఈవో



శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో పంది, గొడ్డు వంటి జంతువుల కొవ్వు కలిసినట్టు నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్(ఎన్‌డీడీబీ) నివేదికతో పాటు పలు పరీక్షల్లో నిర్ధారణ అయిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత పలువురు నిపుణులతో సమావేశాలు నిర్వహించి ప్రసాదాల నాణ్యతపై చర్చించినట్టు తెలిపారు. నాణ్యమైన నెయ్యి లేకపోవడంతోనే లడ్డూల రుచి తగ్గిందనే విషయం తెలిసిందన్నారు. తిరుమలలో పరీక్షలు చేసే ల్యాబ్ లేకపోవడంతో.. టెండరుదారులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకుని కల్తీ నెయ్యిని పంపుతున్నారని పేర్కొన్నారు. ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు నెయ్యి శాంపిళ్లను పంపగా.. కల్తీ అయినట్టు తేలిందని చెప్పారు. దీంతో తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామన్నారు. "డిసెంబరు నాటికి తిరుమలలోనే అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తాం. దీనిలో రూ.75 లక్షల విలువైన యంత్రాలు అవసరమవుతాయి. వీటిని విరాళంగా ఇచ్చేందుకు ఎన్‌డీడీబీ అంగీకరించింది. నెయ్యి నాణ్యతను పెంచడంలో భాగంగా 'నందిని' నెయ్యిని తిరిగి కొనుగోలు చేస్తున్నాం" అని ఈవో శ్యామలరావు వివరించారు.

జూలై 22నుంచి బ్లాక్ లిస్టులో

ఈ ఏడాది మార్చి 13వ తేదీన నెయ్యి కొనుగోలుకు టెండర్లు పిలిచారు. మే 8వ తేదీన టెండర్లు ఖరారు చేశారు. నెయ్యి కేజీకి రూ.320 ఖరారు చేశారు. అదే నెల 15న ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సరఫరాకు ఆర్డర్ ఇచ్చారు. అప్పటి నుంచి ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తూవచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీ ఈవోగా బాధ్యతలు తీసుకున్న శ్యామలరావుకు పలు సందర్భాల్లో భక్తులు లడ్డూ, అన్నప్రసాదాల మీద అసంతృప్తిని తెలిపారు. దీంతో పదార్థాల నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ సమయంలో ఏఆర్ డైరీ ఫుడ్స్ నుంచి వచ్చిన 4ట్యాంకర్లలోని నెయ్యిపై అనుమానం వ్యక్తమైంది. జూలై 6న రెండు ట్యాంకర్లు, 12న మరో రెండు ట్యాంకర్లలోని శాంపిల్స్‌ను ఎన్‌ఏబీఎల్ గుర్తింపు ఉన్న ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉన్న ల్యాబ్ ఇది. జూలై 16న నెయ్యిలో కల్తీ జరిగినట్టు ల్యాబ్ రిపోర్టులువచ్చాయి. దీంతో టీటీడీ ఆ వెంటనే ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని వాడకుండా వెనక్కి పంపింది. జూలై 22వ తేదీన ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది.

ప్రస్తుతం నాణ్యమైన నెయ్యితోనే...

ప్రస్తుతం వైష్ణవి డైరీ, పరాగ్ మిల్క్ ఫుడ్స్, కృపారామ్ డైరీ, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ అనే సంస్థలు టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. మరోవైపు నాణ్యత కలిగిన నందిని నెయ్యిని తిరిగి కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. 2024-25 ఏడాదికి గాను 350 మెట్రిక్ టన్నుల నెయ్యిని సరఫరా చేసేందుకు ఆగస్టు నెలాఖరులో టెండరు ఖరారు చేసింది. కేజీ రూ.478 చొప్పున కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత నెల రోజులుగా అత్యంత నాణ్యమైన నెయ్యితోనే లడ్డూలు తయారు చేస్తుండంతో భక్తుల నుంచి ఫిర్యాదులు తగ్గాయి.

కోట్లాది మంది భక్తులను బాధిస్తోంది: రాహుల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అయినట్లు వస్తున్నట్లు వార్తలు కలవరపెడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా బాలాజీకి ఉన్న కోట్లాది మంది భక్తులను ఈ ఘటన బాధిస్తోందని, దీనిని క్షుణ్నంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని న్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మతపరమైన ప్రదేశాల పవిత్రతను అధికారులు కాపాడాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు.

బాధ్యులు విచారణను ఎదుర్కోక తప్పదు

» కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆగ్రహం

తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం అత్యంత దారుణమని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఒక జాతీయ మీడియా చానల్‌తో మాట్లాడిన ఆయన.. లడ్డూ కల్తీ ఘటనపై దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. బాధ్యులు చట్ట పరిధిలో విచారణ ఎదుర్కోక తప్పదని తెలిపారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని గత వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని, ఆ పార్టీకి ఈ ఘటనపై మాట్లాడాటానికి ఎలాంటి హక్కు లేదని తెలిపారు.

లడ్డూ కల్తీపై విచారణ జరిపించండి: సంజయ్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. శ్రీవారి ప్రసాదం కల్తీతోపాటు తిరుమలలో అవినీతి, అన్యమత ప్రచారంపై విచారణ జరిపి.. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్యమతస్తులకు టీటీడీ పగ్గాలు అప్పగించడం, ఉద్యోగాల్లో అవకాశం కల్పించడంవల్లే ఇలాంటి కుట్రలకు ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపిస్తే నిజాలు నిగ్గు తేలే అవకాశముందని సంజయ్ అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపినట్లు నిర్ధారణ కావడం దురదృష్టకరమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు.

జగన్ పనైపోయింది.. వైసీపీ పైకి లేవదు

తిరుమలలో అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలి: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో రాజకీయంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ పైకి లేవదు. ఐదేళ్ల అధికారంతోనే జగన్ పని అయిపోయింది. ఇక అధికారంలోకి వచ్చే అవకాశమేలేదు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీ కోసం వాడే నెయ్యిలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పీసీసీ తరఫున కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసినట్లు తెలిపారు. ఇదే అంశంపై శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

లడ్డూ ప్రసాదం కల్తీపై లోతుగా విచారణ చేయాలి

» కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎస్ రంగరాజన్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీపై లోతుగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ డిమాండ్ చేశారు. కోట్ల మంది భక్తులు పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మోదీ, అమిత్‌షాలకు నిజంగా దేవుడిపైన భక్తి ఉంటే లడ్డూ కల్తీ వ్యవహారంపై వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు డిమాండ్ చేశారు. మూడు నెలల్లో విచారణను ముగించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. తిరుమల లడ్డూలో నకిలీ నెయ్యి వినియోగం పరమ దుర్మార్గమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు బక్కని నర్సింహులు చెప్పారు.

నేడు, రేపు వర్షాలు

» 23న అల్పపీడనం ఏర్పడే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని, దాని ప్రభావంతో వాయవ్య పరిసర మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం మరో ఆవర్తనం పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ రెండు రోజుల పాటు రాష్ట్రానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, నారాయణపేట్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ, ములుగు, ఖమ్మం జిల్లాల్లో ఒకటి రెండుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

డిగ్రీ కోర్సుల మార్పునకు అభ్యర్థులకు చాన్స్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సులను అభ్యర్థులు మార్చుకొనేందుకు అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ అధికారులు శుక్రవారం షెడ్యూల్‌ను ప్రకటించారు. దోస్త్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో డిగ్రీ సీట్లను భర్తీ చేశారు. అయితే సీట్లను పొంది ఆయా కాలేజీల్లో చేరిన విద్యార్థులు అదే కాలేజీల్లో కోర్సులను మార్చుకోవడానికి వీలు కల్పించారు. ఈనెల 21 నుంచి 23 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకుంటే 24న కొత్త కోర్సుల కేటాయింపు జాబితాను ప్రకటించనున్నారు.

సీ-టెట్ పరీక్ష తేదీ మార్పు

కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీ-టెట్) తేదీ మారింది. దేశవ్యాప్తంగా ఈ పరీక్షను డిసెంబరు 1న నిర్వహించాలని ఇంతకుముందు సీబీఎస్ఈ నిర్ణయించింది. అయితే తాజాగా ఈ పరీక్షను డిసెంబరు 15న నిర్వహించాలని నిర్ణయించారు. పరిపాలన సంబంధమైన కారణాలతో ఈ పరీక్ష తేదీని మార్చినట్టు ప్రకటన వెలువడింది. అయితే దరఖాస్తు సమర్పించే షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు.

అమృత్ టెండర్లలో అవినీతిని తేల్చండి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ టెండర్లలో తెలంగాణ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ఆ చీకటి కాంట్రాక్టులను రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ కట్టర్, టోచన్ సాహూలకు లేఖ రాశారు. కేంద్రం అమృత్ పథకం కింద రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో రూ.1,500 కోట్ల టెండర్లు సీఎం బావమరిది కంపెనీకి అర్హత లేకున్నా కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. పేదల భూములు చెరపట్టడమే లక్ష్యంగా.. ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అంటూ సీఎం భూదందాకు దిగుతున్నారని.. అది ఫోర్త్ సిటీ కాదని.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని మండిపడ్డారు.

సెలెక్ట్ మొబైల్స్‌లో ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు

» అందుబాటులో అద్భుత ఆఫర్లు: సీఎండీ వై.గురు



ఐఫోన్ 16 సిరీస్ ఫోన్‌ను లాంచ్ చేస్తున్న సీఎండీ వై.గురు

హైదరాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెలక్ట్ మొబైల్స్ స్టోర్లలో ఐఫోన్ 16సిరీస్ ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు శుక్రవారం ఈ ఫోన్లను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాంచింగ్ ఆఫర్ కింద ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లు కొన్న వారికి రూ.5,000 వరకు క్యాష్ బ్యాక్, రూ.6,000 వరకు అప్‌గ్రేడ్ బోనస్ పొందవచ్చని తెలిపారు. ఐఫోన్ 16, 16ప్లస్, 16ప్రో, 16ప్రో మ్యాక్స్ వేరియంట్లు సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు అతి తక్కువ ఈఎంఐ(24నెలలు)తో ఐఫోన్లను కొనుగోలు చేసే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. పాత ఐఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేసుకొని ఐఫోన్ 16 సిరీస్ ఫోన్ కొనుగోలు చేసే వారికి అద్భుతమైన ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నట్లు వివరించారు.

ఆదుకున్న ఎల్లంపల్లి

» కాళేశ్వరం బ్యారేజీలు పనిచేయకున్నా..నేరుగా ఎత్తిపోతలు

» ఎగువన మల్లన్నసాగర్ దాకా జలకళ



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

పెద్దపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఈ ఖరీఫ్‌లో నీటిని ఎత్తిపోయకున్నా.. వాటిపై ఆధారపడిన ప్రాజెక్టులు మాత్రం జలకళను సంతరించుకున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లన్నీ ఎత్తేసి, నీటిని వదిలేసినా.. వాటికి అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు నిండుగా ఉన్నాయి. కాళేశ్వరం బ్యారేజీలు మరమ్మతులకు గురై, మూలనపడ్డా.. వాటి పైన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఈసారి రైతులను ఆదుకుంది. శ్రీరామసాగర్, కడెం నుంచి వచ్చిన వరదను మిడ్‌మానేరుకు.. అక్కడి నుంచి లోయర్‌మానేరు, మల్లన్నసాగర్ దాకా తరలించడంలో ఎల్లంపల్లి ప్రధాన పాత్ర పోషించింది. దీంతో ఆయా జలాశయాల కింద పొలాలు కళకళలాడుతున్నాయి. ఈయేడు వర్షాకాలం నాటికి అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీలోకి వెళ్లాయి. సీజన్ ప్రారంభంలో వర్షాలు పడకపోవడంతో సాగు, తాగునీటి కోసం అందరూ ఆందోళన చెందారు. కృష్ణా బేసిన్‌కు పెద్ద ఎత్తున వరదలు వచ్చినప్పటికీ గోదావరి బేసిన్‌లో అంతంత మాత్రంగానే వర్షాలు పడ్డాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల మధ్య పడిన వర్షాల వల్ల ఎల్లంపల్లికి వరద వచ్చింది. దీనికి కడెం ప్రాజెక్టు ప్రవాహం తోడయింది. ఎల్లంపల్లి సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, 16 టీఎంసీలకు చేరుకోగానే ఆగస్టు 3 నుంచి సెప్టెంబరు 7 వరకు అధికారులు నీటిని ఎత్తిపోశారు. 36 రోజుల్లో 23.75 టీఎంసీలను పంపించారు. ఎత్తిపోతలు ప్రారంభమయ్యే నాటికి మిడ్ మానేరులో 5.6 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలను ఆపకుండా వచ్చిన వరదను వచ్చినట్లే మిడ్ మానేరుకు ఎత్తిపోశారు.

కాళేశ్వరం రిపేర్లతో ఆందోళన..

మిడ్‌మానేరు నుంచి అనంతసాగర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వరకు నీటిని తరలించారు. ఎస్సారెస్పీ నిండటంతో అక్కడి నుంచి వరదకాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించారు. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ నీటితో మిడ్‌మానేరు, ఎల్ఎండీలు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. దీంతో వానాకాలంతోపాటు యాసంగి సాగుకు కూడా ఢోకా లేకుండాపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోగా, అన్నారం బ్యారేజీలో బుంగలు పడిన విషయం తెలిసిందే. సుందిళ్ల బ్యారేజీలోనూ సీపేజీ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌డీఎస్ఏ అధికారుల సూచనల మేరకు వర్షాకాలంలో ఈ బ్యారేజీల గేట్లన్నీ ఎత్తి ఉంచాలన్న అధికార సూచనలతో రైతులు ఆందోళన చెందారు. అయితే, ఆలస్యంగానైనా కురిసిన వర్షాలతో ఎల్లంపల్లి నిండటం, అక్కడి నుంచి ఇతర రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోయడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం సంతృప్తికర స్థాయిలో ఎల్లంపల్లిలో 20.175 టీఎంసీలు, మిడ్ మానేరులో 24.78, ఎల్ఎండీలో 23.21, ఎస్సారెస్పీలో 80 టీఎంసీల నీళ్లున్నాయి.

కాళేశ్వరం కొట్టుకుపోతే 21 టీఎంసీల నీరెలా వచ్చింది?

» సముద్రంలా మల్లన్నసాగర్

» ఇప్పటికైనా కాంగ్రెసోళ్లు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి: హరీశ్



తొగుట/దుబ్బాక, సెప్టెంబరు 20: 'కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోయిందని గోబెల్స్ ప్రచారం చేశారు. అలా అయితే.. మల్లన్నసాగర్‌లో ఈ రోజు 21 టీఎంసీల నీరు ఎక్కడి నుంచి వచ్చింది? కాళేశ్వరం పేర లక్ష కోట్లు వృథా అయ్యాయన్న కాంగ్రెస్ నేతల మాటలు అబద్ధమని సముద్రాన్ని తలపిస్తున్న మల్లన్నసాగర్ చాటుతోంది' అని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ శివారులో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామారెడ్డి, యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఎల్లంపల్లి, లక్ష్మీ బ్యారేజీ, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ వరకు గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు మల్లన్నసాగర్‌లో పసుపు కుంకుమ వేసి, కొబ్బరికాయలు కొట్టాలని, అప్పుడే వాళ్ల పాపాలు తొలగిపోతాయన్నారు. కేసీఆర్ కల ఫలించిందని, కాలువలు 90% పూర్తయ్యాయని, మిగతా 10% కాల్వలను కాంగ్రెస్ నేతలు పూర్తిచేసి పొలాలకు నీరందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటు సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకురాలు కత్తికార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్‌మండపంలో హరీశ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు 'మాఇంటి మహాలక్ష్మి' పేరిట కార్తీక ఫౌండేషన్ అందించనున్న న్యూట్రిషన్ కిట్లను ప్రారంభించారు.

హరీశ్ గోబ్యాక్.. తుక్కాపూర్ గ్రామస్థుల నిరసన

మల్లన్నసాగర్ రిజర్వాయర్ సందర్శనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం వస్తున్నట్లు సమాచారం అందుకున్న తొగుట మండలం తుక్కాపూర్ గ్రామస్థులు శుక్రవారం ఉదయాన్నే కట్టపైకి చేరుకుని అక్కడ బైఠాయించారు. హరీశ్‌రావు గోబ్యాక్ అంటూ ప్లకార్డులు, బ్యానర్‌లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సుమారు 3 గంటల పాటు గ్రామస్థులు నిరసనలు తెలపడంతో వారికి కాంగ్రెస్ నేతలు సంఘీభావం ప్రకటించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ గ్రామాన్ని నట్టేట ముంచిన హరీశ్‌రావు రిజర్వాయర్ నిర్మాణం సందర్శనకు ఎలా వస్తారని ప్రశ్నించారు. హరీశ్ పర్యటనను అడ్డుకుంటామని వారు తేల్చిచెప్పడంతో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి నేతృత్వంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ ప్రశ్నించగా.. చేశారని ఒకసారి, చేయలేదని మరోసారి ఆమె జవాబు చెప్పారు. దాంతో కమిషన్ 'అఫిడవిట్‌ను చూపిస్తూ... "మీరు దాఖలు చేసిన అఫిడవిట్ ఇది. ఇందులో పేర్కొన్న అంశాలకు కట్టుబడి ఉన్నారా?" అని నిలదీసింది. దీనికి ఆమె నుంచి ఏ సమాధానమూ రాకపోవడంతో.. 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) సీఈగా మీ బాధ్యతలేంటి?' అని కమిషన్ మరో ప్రశ్న వేసింది. దానికీ ఆమె నీళ్లనమిలారు. ఆ తర్వాత.. ఐఎస్‌కోడ్ (భారతీయ ప్రమాణాల సంస్థ కోడ్) ఏం చెబుతోంది? అది అమలు జరిగిందా? అని ప్రశ్నించగా.. వాటికి కూడా జవాబు చెప్పలేదు. దాంతో కమిషన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. 'కమిషన్ ప్రశ్నలకు జవాబు చెప్పే పద్ధతి ఇదేనా? అఫిడవిట్‌లోని అంశాలకు కట్టుబడి ఉండకపోతే ఎలా? పొంతనలేని జవాబులు చెబుతారా' అని మండిపడింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు వరదలు ఎప్పుడొచ్చాయి అనే ప్రశ్నకు 'తెలియదు' అని.. 2020లో త్రీడీ మోడల్ స్టడీస్ బ్యారేజీలపై జరిగాయా అనే ప్రశ్నకు 'అవును' అని జవాబిచ్చారామె. 'తెలంగాణ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్ (టీఎస్ఈఆర్ఎల్) 023లో మోడల్ స్టడీస్ చేసి, నివేదిక ఇచ్చిన విషయం మీకు తెలుసా' అనే ప్రశ్నకు ఆమె... 'నాకు తెలియదు' అని జవాబు చెప్పడంతో కమిషన్ కంగుతింది. విచారణ జరిగినంత సేపు ఇలా ఆమె 'తెలియదు... గుర్తులేదు... మరిచిపోయా' తరహాలో జవాబులు చెప్పడం గమనార్హం.

ఐఎస్ కోడ్ ప్రకారం మీ బాధ్యతలేంటీ...?

'ఐఎస్ కోడ్ ప్రకారం ఎస్‌డీఎస్‌వో బాధ్యతలేంటీ..? ఐఎస్ కోడ్ 7349:2012కు అధికారులు కట్టుబడి ఉండాలా? వద్దా?' అని ఎస్‌డీఎస్‌వో చీఫ్ ఇంజనీర్ ప్రమీలను కమిషన్ ప్రశ్నించింది. అయితే.. ఆ బాధ్యత ప్రాజెక్టు అథారిటీదేనని ప్రమీల గుర్తుచేశారు. డ్యామ్ సేఫ్టీ చట్టం అమల్లోకి వచ్చాకా... అందులోని క్లాజ్-46 ప్రకారం, వాటి కాళేశ్వరం బ్యారేజీల రక్షణకు తీసుకున్న చర్యలేంటని కమిషన్ ప్రశ్నించగా... 'బ్యారేజీల రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డ్యామ్ ఓనర్(సంబంధిత చీఫ్ ఇంజనీర్)దే'నన్నారు. 'గేట్ల మ్యానువల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ప్రొటోకాల్స్‌ను బ్యారేజీల వద్ద అమలు చేశారా?' అని కమిషన్ ప్రశ్నించగా.. జవాబు చెప్పడానికి ఆమె తడబడ్డారు. దీంతో కమిషన్..'పేర్లు చెప్పొద్దు. మీ ఇబ్బందులు మాకు తెలుసు. ఒక ఇంజనీర్‌గా బదులివ్వండి' అని పేర్కొంది. దాంతో.. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలను తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాల్సి ఉండగా.. అవి ఇవ్వలేదని ప్రమీల తెలిపారు. ఆ తర్వాత ఇదే విభాగానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) విజయలక్ష్మిని కూడా కమిషన్ ప్రశ్నించింది. 'బ్యారేజీలను డ్యామ్‌లుగా పరిగణనలోకి తీసుకుంటూ నోటిఫికేషన్ ఇచ్చారా? బ్యారేజీల విషయంలో మీ విధులు, బాధ్యతలేంటి?' అని ప్రశ్నించగా... 'వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీలు ఎలా ఉన్నాయనే దాన్ని పరిశీలించి, నివేదికలు ఇవ్వాల్సి ఉండగా.. ఆ నివేదికలు ఇవ్వలేదు' అని బదులిచ్చారు. నివేదికలు ఇవ్వనందువల్లే వాటిని పరిశీలించలేకపోయామన్నారు. 2023 అక్టోబరులో బ్యారేజీ కుంగిన తర్వాత ఏం చర్యలు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించగా.. ఏబీ పాండ్యా నేతృత్వంలోని డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ బ్యారేజీని పరిశీలించిందని, కుంగుబాటుకు కారణాలపై స్వతంత్ర కమిటీ వేయాలని ఏబీ పాండ్యా నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు.

ఆ ఒక్కటే కారణం కాదు..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు మాత్రమే కారణం కాదని.. బ్యారేజీల అప్ స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లో రక్షణ చర్యలు తీసుకోకపోవడమూ ఓ కారణమని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఈఈ రఘునాథశర్మ కమిషన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'బ్యారేజీల వైఫల్యానికి బాధ్యులెవరు? ప్రభుత్వమా? ప్రభుత్వాన్ని నడిపించిన అధినేతా?' అని కమిషన్ ప్రశ్నించగా.. 3డీ మోడల్ అధ్యయనాలు జరగకపోవడం, ఓఅండ్ ఎం నిబంధనలు పాటించకపోవడం కారణమని బదులిచ్చారు.

బ్యారేజీల నిర్మాణం జరగడానికి ముందు నమూనా అధ్యయనాలు పూర్తిస్థాయిలో జరగక ముందే నిర్మాణం ప్రారంభమైందని టీఎస్ఈఆర్ఎల్‌కు చెందిన రీసెర్చ్ ఇంజనీర్లు కమిషన్‌కు తెలిపారు. నీటిని నిల్వ చేయడమే మేడిగడ్డ కుంగుబాటుతో బాటు అన్నారం, సుందిళ్లలో సీపేజీలకు కారణమన్నారు. వరదలప్పుడు గేట్లు ఎత్తకపోవడం వల్ల బ్యారేజీపై నీటి ఒత్తిడి పెరిగి.. ఆ ఒత్తిడి ఇసుక పునాదుల నుంచి జారిపోవడానికి కారణమైందని వివరించారు. కాగా.. నీటిపారుదల శాఖలోని నాణ్యత నియంత్రణ విభాగానికి చెందిన 8 మంది ఇంజనీర్లను కమిషన్ శనివారం ప్రశ్నించనుంది.

త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

» బలహీన వర్గాల కోసం తపించిన వ్యక్తి: సీఎం రేవంత్

» 27న అధికారికంగా బాపూజీ జయంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు నిరంతరం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారన్నారు. కాగా, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఈ నెల 27న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

సీఎంఆర్‌ఎఫ్‌కు భాష్యం విరాళం 1.25 కోట్లు

» జీఆర్‌టీ జువెలర్స్ 25 లక్షలు.. శ్రీ ఇందు గ్రూప్ 10లక్షలు

గుంటూరు(విద్య)/హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ రూ.1.25 కోట్ల విరాళం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కలిసి చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు ముందుకురావడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. భాష్యం విద్యాసంస్థల తెలంగాణ సీఈవో చైతన్య, జెట్టి కుసుమ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇటు సీఎంఆర్‌ఎఫ్‌కు జీఆర్‌టీ జువెలర్స్ తరఫున జితేందర్ రూ.25లక్షలు అందజేశారు. శ్రీ ఇందు గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ వెంకటరావు రూ.10 లక్షలను సీఎం రేవంత్‌కు అందించారు. కాగా సెప్టెంబరు నెలలో ఒక రోజు మూలవేతనాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కి అందించడానికి తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ సమ్మతి తెలిపిన నేపథ్యంలో ఆ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ రొనాల్డ్‌రాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేరెళ్ల బాధితులకు సీఎం భరోసా

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని అడిగినందుకు 2017 జూలైలో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఇందుకు కారణమైన అప్పటి ఎస్పీ, ఎస్సై రవీందర్‌తోపాటు తమను హింసించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితులు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం నేరెళ్ల బాధితులు సీఎంను కలిశారు. బాధితుల గోడు విన్న సీఎం న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై సీఎం రేవంత్ రెడ్డికి గల్ఫ్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె విరమించిన ఆరోగ్య మిత్రలు

» వేతనాల పెంపునకు సర్కారు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు శుక్రవారం సమ్మె విరమించారు. 2 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, ఆరోగ్యమిత్రల రాష్ట్ర కమిటీ నేతలతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా క్యాడర్ మార్పును అంగీకరిస్తూ వేతనాన్ని రూ.15,600 నుంచి 19500కు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో ఆరోగ్యమిత్రలు సమ్మె విరమిస్తున్నట్లుగా ప్రకటించారు.

సెమీ కండక్టర్ల రంగంలో ఉపాధి అవకాశాలు

» నైపుణ్యతతో అందిపుచ్చుకోవాలి: శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ల రంగం భారీగా విస్తరించనున్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు సాధించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధంగా ఉండాలన్నారు. హైటెక్ సిటీలోని సెమీ కండక్టర్ల సంస్థ వాలుకా విస్తరణ యూనిట్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. సంస్థ పదేళ్లుగా సెమీ కండక్టర్ రంగంలో సాధించిన విజయాలను మంత్రి ప్రశంసించారు. ప్రస్తుతం 50మంది సిబ్బంది ఉన్న వాలుకా వచ్చే ఏడాది కాలంలో 300 మందిని, రెండేళ్లలో మొత్తం 500 మందిని నియమించుకుంటుందన్నారు. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జీ వంటి అధునాతన పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి తమ నూతన విస్తరణ దోహదపడుతుందని వాలుకా అధినేత సునీల్ కుమార్ జాస్తి తెలిపారు.

16 మార్కెట్ కమిటీలకు నూతన పాలక వర్గాలు

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 16 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను సర్కారు నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 64 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలక వర్గాల్ని నియమించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన మార్కెట్ కమిటీలకు కూడా త్వరలోనే కొత్త పాలకవర్గాలను నియమిస్తామని పేర్కొన్నారు.

మహిళలు ప్రశ్నించడం నేర్చుకోవాలి: సీతక్క

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు సమస్యల్ని మౌనంగా భరించకూడదని, వాటిని ఎదుర్కొని ప్రశ్నించడం నేర్చుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. పని ప్రాంతాల్లో మహిళలకు భద్రత ఉండాలని, అక్కడ లేకపోతే ఇంకా ఎక్కడా రక్షణ ఉండదని ఆమె అన్నారు. పని ప్రాంతాల్లో మహిళల మీద వేధింపులు సహించేది లేదన్నారు. శుక్రవారం టెక్ మహీంద్ర క్యాంపస్‌లో సీఐఐ, ఇండియన్ విమెన్ నెట్‌వర్క్ 10వ వార్షిక లీడర్‌షిప్ సదస్సుకు సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఏవైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావా లని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, అవరమైతే.. చట్టాలు రూపొందిస్తామన్నారు. మహిళలు సమాజ సృష్టికర్తలని, అయినా చిన్నచూపుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు కూడా ఆత్మన్యూనత నుంచి బయటపడాలని, పురుషులే గొప్ప అనే భావన పోగొట్టుకోవాలన్నారు. తాను ఎవరి మీదా ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకొని పని చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఇపుడు మంత్రిగా సేవలందిస్తున్నానని తెలిపారు. తనకు కేటాయించిన శాఖలతో రెండు కోట్ల మందికి సేవ చేసే అవకాశం లభించిందని, ఆ బాధ్యతను పట్టుదలతో నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు.

ఊపందుకోనున్న ఆర్‌ఆర్‌ఆర్ పనులు

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. రహదారి మార్గాన్ని (అలైన్‌మెంట్) ఖరారు చేసేందుకు గాను సర్కారు ఐఏఎస్ అధికారులతో కూడిన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా మరో 12 మంది అధికారులతో కమిటీని నియమించింది. దక్షిణ భాగం రహదారి అలైన్‌మెంట్‌తో పాటు ఔటర్ రింగు రోడ్డు నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన రేడియల్ రోడ్ల అలైన్‌మెంట్లను తయారు చేసే బాధ్యతలను కూడా ఈ కమిటీకి అప్పగించింది. ఈ విషయాన్ని మంత్రి పొంగులేటి శుక్రవారం మంత్రివర్గ సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఈ మేరకు "రింగు'కు కమిటీ.. ఇరువైపులా ఐటీ" శీర్షికన శుక్రవారం కథనాన్ని ప్రచురించింది. అలైన్‌మెంట్‌తో పాటు రోడ్డుకు ఇరువైపులా ఐటీ, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, తద్వారా కలిగే ప్రయోజనాలపైనా కమిటీ లోతుగా అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.

హైడ్రాకు హై పవర్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు యూనివర్సిటీ పేరును సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీగా మార్చాలని నిర్ణయించారు. కోఠిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. వీటితోపాటు రాష్ట్రంలో కొత్తగా అనుమతి పొందిన 8 మెడికల్ కాలేజీలకు 3వేల పైచిలుకు బోధన, బోధనేతర పోస్టులను మంజూరు చేయాలని, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.4,637 కోట్లకు పెంచాలని, సన్న వడ్లకు రూ.500 బోనస్‌ను ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఇవ్వాలని, తెల్ల రేషన్‌కార్డులను అక్టోబరు నుంచి జారీ చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాకు వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్. చిత్రంలో భట్టి, తుమ్మల

అన్ని శాఖల అధికారాలు హైడ్రాకు..!

మంత్రులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైడ్రాను మరింత బలోపేతం చేయాలని క్యాబినెట్ తీర్మానించింది. వాల్టా చట్టం అధికారాలను అప్పగించడంతోపాటు హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, మెట్రో వాటర్ బోర్డుకు ఇప్పుడున్న అధికారాలను హైడ్రా కమిషనర్‌కూ అప్పగించాలని నిర్ణయించారు. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపల ఉన్న కోర్ ఏరియాలోని ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను పరిరక్షించే బాధ్యత ఇకమీదట హైడ్రాపై ఉంటుంది. అంటే.. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, వివిధ శాఖలకు ఉండే అధికారాలన్నీ హైడ్రాకు ఉంటాయి. ఓఆర్‌ఆర్ లోపలి కోర్ అర్బన్ రీజియన్‌లో జీహెచ్‌ఎంసీతోపాటు స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ హైడ్రా కమిషనర్‌కు అధికారాలు కల్పించేలా చట్ట సవరణ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. కోర్ అర్బన్ సిటీలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా సీసీ కెమెరాలతో నిఘా పెట్టి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఇక హైడ్రాకు 169 మంది అధికారులు, 946 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వివిధ శాఖల నుంచి డిప్యుటేషన్‌పై పంపాలని తీర్మానించారు. దీంతోపాటు శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకానికి అంచనా వ్యయాన్ని రూ.4,637 కోట్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సవరణ అంచనాలకు ఆమోదం తెలిపింది. టన్నెల్ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టు 826 అడుగుల డెడ్ స్టోరేజీ నుంచి ప్రతి రోజూ 4వేల క్యూసెక్కులు, సంవత్సరానికి 30 టీఎంసీల నీరు ఎస్‌ఎల్‌బీసీకి వస్తుంది. ఇక డిండి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను త్వరితగతిన పొందాలని, ఈ పనుల కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని నిర్ణయించారు.

మంత్రివర్గం తీసుకున్న ఇతర నిర్ణయాలు..

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టనున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌లో ఈసారి తరగతులను తెలుగు యూనివర్సిటీలోని తాత్కాలిక భవనంలో ప్రారంభించాలని నిర్ణయం. ఒక్కో విద్యార్థికి ప్రతి నెలా రూ.2,500 చొప్పున స్కాలర్‌షిప్ మంజూరు.

రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో 12 మందితో అధికారుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం. ఈ కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్యకార్యదర్శి ఉంటారు. పురపాలక, రెవెన్యూ శాఖల కార్యదర్శులతోపాటు ట్రిపుల్ ఆర్ పరిధిలోకి వచ్చే ఐదారు జిల్లాల కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ శాఖ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, జియలాజికల్ విభాగం అధికారులు కమిటీలో ఉంటారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న పోలీసు ఆరోగ్య భద్రత స్కీమ్‌ను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్)కు కూడా వర్తింపజేయాలని నిర్ణయం.

తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మనోహరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుకు రెవెన్యూ శాఖ నుంచి 72 ఎకరాల భూమిని బదిలీ చేయాలని నిర్ణయం.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 58 ఎకరాల భూమిని రెవెన్యూశాఖ నుంచి బదిలీ చేయాలని నిర్ణయం.

ములుగు జిల్లా ఏటూరు నాగారంలో ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్‌కు 34మంది సిబ్బంది.

రాష్ట్రంలో కొత్తగా అనుమతి పొందిన 8 మెడికల్ కాలేజీలకు 3వేల పైచిలుకు బోధన, బోధనేతర పోస్టుల మంజూరు. భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్.

కోస్గి ఇంజనీరింగ్ కాలేజీకి, హకీంపేటలోని జూనియర్ కాలేజీకి అవసరమైన పోస్టుల మంజూరు.

ఈ ఖరీఫ్ సీజన్ నుంచే సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్. ఇందుకోసం రూ.2,500 కోట్ల కేటాయింపు. ఈ ఖరీఫ్‌లో 1.43 కోట్ల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని, ఇందులో 80 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్నాలుంటాయని అంచనా.

అక్టోబరు నుంచి తెల్ల రేషన్ కార్డులను జారీ చేసి, దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయం. జనవరి నుంచి అన్ని రేషన్ కార్డులకూ సన్నబియ్యం.

'నియోజకవర్గాల్లో పనులకు బిల్లులు వెంటనే ఇవ్వండి'

నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం పట్ల పలువురు మంత్రులు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. సీఎం, మంత్రులు కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా చిన్న చిన్న పనులకూ బిల్లుల కోసం తాము జోక్యం చేసుకోవాల్సి వస్తోందని కొందరు మంత్రులు సీఎం రేవంత్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో త్వరితగతిన బిల్లుల క్లియరెన్స్‌కు చర్యలు తీసుకుంటానని సీఎం వారికి చెప్పినట్లు సమాచాం. కాగా, అక్టోబరు మొదటి వారంలో మరోమారు మంత్రివర్గం సమావేశమయ్యే అవకాశం ఉంది. ఆ సమావేశంలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపైనే చర్చించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

'కాళేశ్వరానికి' లక్ష కోట్లు పెట్టి లక్ష ఎకరాలకూ నీరివ్వలేదు


గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా.. లక్ష ఎకరాలకు కూడా నీరివ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తమ ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీకి సవరించిన అంచనాల ప్రకారం... రూ.4,637 కోట్లను కేటాయించి, 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించబోతోందని చెప్పారు. కాళేశ్వరం లిఫ్టులకు చేసే వ్యయం మాదిరిగా.. ఎస్‌ఎల్‌బీసీకి పదే పదే ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, పూర్తి గ్రావిటీతో నీటిని అందించవచ్చని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎస్‌ఎల్‌బీసీపై అప్పటి సీఎం కేసీఆర్ చాలా వ్యంగ్యంగా మాట్లాడారని అన్నారు. కానీ, తాము 24 నెలల్లోనే దీనిని పూర్తిచేయబోతున్నామని చెప్పారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ కింద నీరివ్వడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.6 వేల కోట్లు వ్యయం చేస్తే.. అందులో రూ.4 వేల కోట్లు స్కామ్ జరిగిందని ఆరోపించారు. ఫ్లోరైడ్‌ను మాయం చేశానని కేసీఆర్ చెప్పుకొన్నారే తప్ప.. ఇప్పుడు ఇంకా పెరిగిందని తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే.. భూగర్భ జలాలు పెరిగి, ఫ్లోరైడ్ దూరమవుతుందన్నారు.

హైడ్రాకు బదలాయించే అధికారాలివే

జీహెచ్‌ఎంసీ చట్టం 1955 ద్వారా ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులు ఇవ్వడం, అక్రమ కట్టడాలను కూల్చివేయడం, అనుమతి లేని ప్రకటనలకు జరిమానాలు విధించడంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ కలిగి ఉన్న అధికారాలు.. ఈ అంశాల మీదనే తెలంగాణ పురపాలక చట్టం 2019 ప్రకారం ఆయా కార్పొరేషన్, మునిసిపాలిటీల కమిషనర్లకు ఉన్న అధికారాలను హైడ్రాకు బదలాయించారు. ఈ చట్టం ద్వారా హైడ్రా కమిషనర్‌కు సెక్షన్ 72 ప్రకారం మున్సిపాలిటీల మీద సూపర్ వైజ్ చేసేందుకు అధికారిని నియమించే అధికారం

* సెక్షన్ 99 ప్రకారం హైడ్రా కమిషనర్, లేదా హైడ్రా ప్రతినిధికి సమాచారం తెలుసుకునే అధికారం, ప్రాంగణంలోకి ప్రవేశించే అధికారం
* సెక్షన్ 178(1), (2) ప్రకారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాలు, సెక్షన్ 186 ప్రకారం జలవనరుల సంరక్షణ, గ్రీనరీ స్థలాలు, వారసత్వ కట్టడాల సంరక్షణ అధికారాలు బదలాయించారు.
* హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు చట్టం 1989లోని సెక్షన్ 81 ప్రకారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువుల సంరక్షణ అధికారాలు, తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చెరువుల సంరక్షణ కమిటీ ఏర్పాటుపై విశేష అధికారాలను కల్పించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ సంరక్షణకు హైడ్రా కమిషనర్ చైర్మన్‌గా, కమిషన్ హెచ్‌ఎండీఏ కోచైర్మన్‌గా జీవోఎమ్మెస్ 129 జారీ చేశారు.
* హెచ్‌ఎండీఏ చట్టం 2008లోని 8, 23ఏ సెక్షన్ల కింద హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఉన్న అధికారాలు
* తెలంగాణ భూ ఆదాయ చట్టంలోని 1317 ఎఫ్ ప్రకారం ఆక్రమణల తొలగింపు, ఆస్తుల సంరక్షణకు సంబంధించి కలెక్టర్, ఆర్డీవోలకు ఉన్న అధికారాలు
* తెలంగాణ జలవనరుల శాఖ చట్టం 1357ఎఫ్ ప్రకారం కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారికి ఉన్న అధికారాలు
* జీవోఎంఎస్ 67 ద్వారా 2002లో పట్టణాభివృద్ధి సంస్థలకు, ఎగ్జిక్యూటివ్ అధికారికి కల్పించిన అధికారాలు కల్పించారు.
* తెలంగాణ భూ ఆక్రమణ చట్టం 1905లో సెక్షన్లు 3, 6, 7, 7ఏ కింద జిల్లా కలెక్టర్, తహసీల్దారు, నాయబ్ తహసీల్దారుకు ఉన్న అధికారాలను ఇచ్చారు.
* వాల్టా చట్టం 2002, జీవో 168 ద్వారా తెలంగాణ బిల్డింగ్ నిబంధనలు, తెలంగాణ ఫైర్ సర్వీస్ చట్టం 1999లో ఉన్న అధికారాలు అప్పగించారు.

నవ 'నగ'రం



(మొదటిపేజీ తరువాయి)

జోన్లు ఉంటాయి. ఒక్కో జోన్ 3-4 వేల ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. విద్యా సంస్థలు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు, ఏకో టూరిజంతో పాటు అన్ని వసతులు నవ నగరంలో ఏర్పాటు కానున్నాయి. ఫార్మా కంపెనీల ఏర్పాటుపై స్థానికుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో ఫార్మా ఉత్పత్తుల తయారీ కాకుండా కేవలం ఫార్మా పరిశోధన కంపెనీలకే ఇక్కడ చోటిస్తున్నారు. ముచ్చెర్ల ఫార్మా సిటీలో అవకాశం కోసం ఇప్పటికే 300 కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలో పరిశోధనలు చేసే కంపెనీలకు ఇక్కడ చోటిస్తారు. మిగతా కంపెనీలకు రాష్ట్ర వ్యాప్తంగా పది చోట్ల ఏర్పాటు చేసే ఫార్మా విలేజ్ క్లస్టర్లలో అవకాశం ఇస్తారు. ఫ్యూచర్ సిటీలో మొత్తం రెండు లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తారు. ఇటీవలే 150 ఎకరాల్లో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విద్యా జోన్‌లో ఉంటుంది. ఫార్మా, క్రీడా యూనివర్సిటీలు ఇందులోనే ఉంటాయి. ఎలక్ట్రానిక్ జోన్‌లో ఎలక్ట్రానిక్ కంపెనీలు వస్తాయి. తైవాన్ కేంద్రంగా ఉన్న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఫాక్స్‌కాన్‌కు కూడా ఇందులోనే చోటిస్తారు. గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫాక్స్‌కాన్ చైర్మన్ ఢిల్లీలో భేటీ సందర్భంగా ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని సీఎం కోరారు. ఎలక్ట్రానిక్ సిటీలో భాగంగానే జపాన్ కంపెనీలకు ప్రత్యేకంగా ఓ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ-జపాన్ మధ్య పారిశ్రామిక బంధం గత కొన్నేళ్లలో బలోపేతం అయింది. ఇప్పటికే అనేక జపాన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయి.

పచ్చదనంతో పర్యాటకం

పర్యావరణానికీ పెద్దపీట వేయాలన్న లక్ష్యంగా ప్రత్యేకంగా ఏకో టూరిజం జోన్ ఏర్పాటు కానుంది. పచ్చదనంతో కూడిన రిసార్టులు ఏర్పాటుకు అనుమతిస్తారు. కందుకూరు వైపు ఇప్పటికే పచ్చదనం ఉండటంతో దీనిని కొనసాగిస్తూ ఏకో టూరిజం జోన్ ఏర్పాటు చేస్తారు. జూపార్క్ కూడా ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది. అదీ ఈ జోన్‌లోనే వస్తుంది. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు నివాస స్థలాలు ఇచ్చేందుకు 600 ఎకరాలు కేటాయించారు. ఇవీ పర్యాటక జోన్‌లోనే ఉంటాయి. ఆసుపత్రులు, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు విశాలమైన రహదారులు, విమానాశ్రయం నుంచి మెట్రో అనుసంధానం.. అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నారు.

భూములిచ్చిన వాళ్లకు ఉపాధి

నాలుగు జోన్లలో కలిపి రెండు లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో లాగా కాకుండా ఇక్కడి పరిశ్రమల్లో అన్ని స్థాయిల్లో స్థానిక యువతకే ఉపాధి అవకాశాలు లభించేలా జాగ్రత్త పడనున్నారు. తక్కువ విద్యార్హతలు ఉన్నా నైపుణ్య శిక్షణ అందించి అక్కడే అవకాశం కల్పిస్తారు. ముచ్చర్ల బేగరికంచెతో పాటు పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ భారీగా పుంజుకుంటుందని, తమ స్థిరాస్తుల విలువ గణనీయంగా పెరుగుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెట్రో డీపీఆర్‌కు కసరత్తు!

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ మెట్రోకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్(హెచ్‌ఏఎంఎల్) అధికారులను ఇటీవల సీఎం రేవంత్ ఆదేశించారు. రెండో దశ మెట్రో డీపీఆర్‌ను ఇప్పటికే పూర్తి చేసిన అధికారులు శంషాబాద్ నుంచి ముచ్చర్లలోని ఫ్యూచర్‌సిటీ వరకు నిర్మించనున్న 32 కిలోమీటర్ల డీపీఆర్‌ను కూడా తయారు చేసేందుకు ముందుకుసాగుతున్నారు. వచ్చే వారంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. రెండో దశ డీపీఆర్‌ను తయారుచేసిన సిస్ట్రా కన్సల్టెన్సీతోనే ఈ మార్గాన్ని అధ్యయనం చేయనున్నట్లు సమాచారం. రెండో దశలో ప్రతిపాదించిన మైలార్‌దేవ్‌పల్లి-ఆరాంఘర్- న్యూహైకోర్టు (రాజేంద్రనగర్) పనులను శంషాబాద్ వరకు నేరుగా పొడిగించాలని, తర్వాత అక్కడి నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు కూడా మెట్రోను తీసుకెళ్లే విధంగా డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఆ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ మార్గానికి సుమారు రూ.8 వేల కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

రేస్ క్లబ్, గోల్ఫ్‌కోర్సు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఫ్యూచర్ సిటీలో ఉపాధికి తోడు విలాసాలకూ పెద్ద పీట వేయనున్నారు. మలకపేటలో 150 ఎకరాల్లో ఉన్న హైదరాబాద్ రేస్ క్లబ్‌ను ఇక్కడికి తరలిస్తున్నారు. ఇక్కడ కూడా 150 ఎకరాలను కేటాయిస్తున్నారు. ప్రపంచ స్థాయి గోల్ఫ్ క్లబ్ నిర్మించేందుకు 250 ఎకరాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మహా సంపన్నుల కోసం బిలియనీర్స్ క్లబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇక్కడ పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉండడంతో ఇందులో పని చేసే ఉన్నతశ్రేణి ఉద్యోగులు, వ్యాపారవేత్తల అభిరుచులకు అనుగుణంగా ఈ క్లబ్‌ను తీర్చిదిద్దుతారు. బీసీసీఐ కూడా ఇక్కడ అతి పెద్ద స్టేడియాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు సీఎం రేవంత్ ఇటీవల వెల్లడించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ హౌసింగ్ సొసైటీకి చెందిన వారు కూడా ఇక్కడ భారీగా భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వేయి ఎకరాలకు పైగా తమకు మార్కెట్ ధరకు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీ మెట్రోరైల్ నిర్మాణంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వ్యయం తగ్గించుకునేందుకు గ్రీన్ ఫీల్డ్ రహదారికి ఆనుకునే పిల్లర్లు లేకుండా మెట్రోలైన్ నిర్మించాలని భావిస్తోంది. 10 లైన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారిలో ఆరు లైన్లు ప్రధాన రహదారిగా ఉంటాయి. వాటి కింద సర్వీసు రోడ్డులో రెండు వైపులా రెండేసి వరుసల రోడ్డు నిర్మాణం చేపడతారు. కాగా, ఫ్యూచర్ సిటీకి కృష్ణా నది నుంచి నీటిని తరలించనున్నారు. ఇక్కడ వేల ఎకరాల్లోని పార్కులు, రోడ్లకు ఇరువైపులా ఉండే గ్రీనరీ కోసం మూసీ నీటిని శుద్ధి చేసి వినియోగించాలని నిర్ణయించారు. మూసీ నీటిని తరలించేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పక్క నుంచే పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు.

ఓఆర్‌ఆర్-ఆర్‌ఆర్‌ఆర్ మహా రహదారి

ఫ్యూచర్ సిటీ మెట్రో లైన్ నిర్మాణంతో పాటు 320 అడుగుల వెడల్పు గల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. రావిర్యాలలోని ఔటర్ రింగు రోడ్డు (13నంబరు ఎగ్జిట్)ను ఫ్యూచర్ సిటీ మీదుగా ఆమన్‌గల్‌లోని రీజినల్ రింగురోడ్డుకు అనుసంధానం చేస్తూ ఈ మహా రహదారి ఉంటుంది. హైదరాబాద్ చుట్టూ ఓఆర్‌ఆర్-ఆర్‌ఆర్‌ఆర్ అనుసంధానం చేస్తూ మొత్తం 216.9 కిలో మీటర్ల పొడవున 9 గ్రీన్ ఫీల్డ్ రహదారులు నిర్మిస్తున్నారు. ఇందులో ఫ్యూచర్ సిటీ రహదారి అన్నింటికన్నా పెద్దది. 41.5 కిలోమీటర్ల పొడవుతో నిర్మించే ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తారు. రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం కంటే ఇదే ముందు పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరిస్తారు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయిస్తారు. అందుకే అవసరమైన భూమి కంటే అదనంగా సేకరిస్తున్నారు. 9 రోడ్ల నిర్మాణానికి 931 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుంది. 30 శాతం రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం వినియోగిస్తారు. మిగతా 70 శాతంలో భూ యజమానులకు 42 శాతం, హెచ్‌ఎండీఏకు 28 శాతం కేటాయిస్తారు.

ప్రాజెక్టులపై పదేళ్లుగా బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం

» ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టే నిదర్శనం: భట్టి


» మంత్రులతో కలిసి ప్రాజెక్ట్ సందర్శన

» 2027లోగా ఎస్‌ఎల్‌బీసీ పూర్తి: ఉత్తమ్

నల్లగొండ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగ మార్గం, మూసీ కాల్వల వంటి ప్రాజెక్టులపై పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. నల్లగొండ-నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దు మన్నెవారిపల్లి సమీపంలో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ అవుట్‌లెట్‌ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌తో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడే ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులు, కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో కనీసం కిలోమీటర్ సొరంగం పనులు కూడా సాగలేదని ఆరోపించారు. సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రాజెక్టు వ్యయం మూడురెట్లు పెరిగిందన్నారు. ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, మూసీ కాల్వలతో పాటు నిర్మాణంలో ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలు నిర్ణీత గడువులో పూర్తయ్యేందుకు నిధులిస్తామని వెల్లడించారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని సెప్టెంబరు 2027 నాటికి పూర్తి చేస్తామని ఉత్తమ్ ప్రకటించారు. అంచనా వ్యయం పెంపును క్యాబినెట్‌లో ఆమోదిస్తామన్నారు. డిండి ఎత్తిపోతలకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే పనులను తక్షణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ఎత్తిపోతలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శ్రద్ధతో పనిచేస్తున్నాం: కోమటిరెడ్డి

పాపాత్ముడి పాలనలో నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోలేదని, అందుకే ఓటమిపాలై ఇంట్లో కూర్చున్నారని, తమ ప్రభుత్వం వచ్చాక ఎస్‌ఎల్‌బీసీ మొదలు అన్ని ప్రాజెక్టులపై శ్రద్ధపెట్టి పనిచేస్తున్నామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎస్‌ఎల్‌బీసీని పూర్తి చేయడంతో పాటు, బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల, ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ సీసీలైనింగ్‌కు నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.



ఎస్‌ఎల్‌బీసీ సొరంగాన్ని పరిశీలిస్తున్న మంత్రుల బృందం

అంచనా వ్యయం రూ.4637 కోట్లకు పెంపు

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను సొరంగం ద్వారా తరలించడానికి ఉద్దేశించిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ అంచనా వ్యయం రూ.3150 కోట్ల నుంచి రూ.4637 కోట్లకు పెరిగింది. దీనికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శుక్రవారం భట్టి, ఉత్తమ్, వెంకటరెడ్డి ప్రాజెక్టును పరిశీలించగా.. సాయంత్రం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోద ముద్ర పడింది.

ట్రస్మా అధ్యక్షుడిగా నర్సిరెడ్డి



బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) నూతన అధ్యక్షుడిగా ఎస్.నర్సిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి 25 జిల్లాల ట్రస్మా ప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్, కోశాధికారిగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాపిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు నర్సిరెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలలను చిన్న పరిశ్రమలుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్లను యథాస్థానానికి పంపండి: ట్రెసా

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను తిరిగి పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరింది. ఈ మేరకు శుక్రవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది తహసీల్దార్లు, డిప్యూటీ హసీల్దార్లతో కలిసి ట్రెసా ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రికార్డ్ అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ వరకు అన్ని క్యాడర్లలో బదిలీలు చేపడతామని మంత్రి హామీనిచ్చినట్లు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి కన్నుమూత



జయప్రకాష్ (ఫైల్)

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 20: తెలుగుదేశం పార్టీ తొలితరం శాసనసభ్యునిగా 1983-85 మధ్య విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. కొన్నిరోజులుగా ఆయన హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన చికిత్స పొందుతున్నారు. కాగా, జయప్రకాష్ మృతదేహం శుక్రవారం రాత్రి విజయవాడ చేరుకుంది. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు శ్రీతిరుమలేష్ తెలిపారు.

'పాలమూరు - రంగారెడ్డి' కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి 2019 మార్చి 5న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ సంజయ్ కుమార్‌ల ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషన్‌పై విచారణను మరోసారి నిర్వహిస్తామని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను నవంబరు 25కు వాయిదా వేసింది.

తాగి, తాగించి.. వృద్ధురాలిపై అత్యాచారం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20: తప్ప తాగారు.. తాగిన సమయంలో తమకు కావాల్సిన వంటకాలు వండిపెట్టే వృద్ధురాలి(65)తోనూ మద్యం తాగించారు. అంతటితో ఆగకుండా ఒకరి తర్వాత మరొకరు ఆ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని బండమాదారం గ్రామంలో ఈ ఘోరం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బండమాదారానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించేటప్పుడు స్థానికంగా ఒంటరిగా నివసించే ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి వంట చేయించుకుని తింటారు. గురువారం సాయంత్రం కూడా అలానే వచ్చిన ఆ ముగ్గురు.. మద్యం తాగుతూ ఆమెతోనూ తాగించారు. అనంతరం ఆమెపై అత్యాచారం జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, నిందితుల్లో ఇద్దరు పోలీసుల అదుపులో ఉండగా మరొకరు పరారీలో ఉన్నట్టు సమాచారం.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబరు 3వ తేదీ వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. మధ్యాహ్నం చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే విషయాలను వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఒక ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందన్నారు. 2019, డిసెంబరు 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్‌హిట్ సినిమాకు పనిచేశారని తెలిపారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబైకి వెళ్లారన్నారు. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియపెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 సంవత్సరాలని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానం టూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోవడంతో.. అలుసుగా తీసుకుని షూటింగ్ స్పాట్‌లో, వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని, ఒప్పుకోకుంటే దాడి చేసేవాడని పేర్కొన్నారు. చెప్పినట్లు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ పలు సందర్భాల్లో ఆమెపై ఒత్తిడి తెచ్చేవాడని వెల్లడించారు. అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, అక్కడ బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్ సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ఓటుకు నోటు కేసు బదిలీకి

సుప్రీం తిరస్కృతి!

ఊహాజనిత అంశాలతో పిటిషన్ వేశారని వ్యాఖ్య.. ప్రాసిక్యూషన్ మీద అభ్యంతరం తెలపని పిటిషనర్లు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహమ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, మేనకా గురుస్వామి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్ రావు హాజరయ్యారు. తొలుత ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. ఓటుకు నోటు కేసును విచారిస్తున్న ఏసీబీ రాష్ట్ర హోంశాఖ పరిధిలో ఉన్నదని, ప్రస్తుతం హోంశాఖ మంత్రిగా కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. ఏసీబీ, ప్రాసిక్యూషన్, అలాగే అధికారులు ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏసీబీ ఎవరిని విచారించాలి? ఎవరిని విచారించవద్దు? అనేది హోం మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. స్వతంత్ర వ్యవస్థ నుంచి ప్రాసిక్యూషన్‌కు స్పష్టమైన ఆదేశాలు ఉండాలని కోరారు. అందుకే.. సుప్రీం విశ్రాంత న్యాయమూర్తికి ప్రాసిక్యూషన్ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

అన్ని శాఖలు సీఎం పరిధిలోనే

పిటిషనర్ల తరఫున వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. మీరు చెప్పినట్లు కేసు విచారణను మరోచోటుకు మార్చినప్పటికీ అధికారులు హోం మంత్రికి చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా? అని ప్రశ్నించింది. హోంశాఖ ఆయన పరిధిలో లేకపోయినా ఒక ముఖ్యమంత్రిగా అన్ని శాఖలు ఆయన పర్యవేక్షణలో పని చేయాల్సిందే కదా? అని ధర్మాసనం పేర్కొంది. అందుకే ప్రాసిక్యూషన్ అనేది స్వతంత్రంగా జరగాలని తాము కోరుతున్నామని ఆర్యమ సుందరం తెలిపారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కొనసాగినప్పుడే దర్యాప్తు నిజాయితీగా జరుగుతుందన్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు, అధికారులను విచారించాల్సి ఉన్నదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సుందరం వాదనలకు ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇప్పటికే చాలామంది విచారణ పూర్తయిందని తెలిపారు. రాజకీయ కోణంలోనే పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారన్నారు. గతంలో ఈ కేసును విచారిస్తున్న దర్యాప్తు అధికారిని కొనసాగించడం మీకు సమ్మతమేనా? అని పిటిషన్ల తరఫు న్యాయవాదులను ధర్మాసనం ప్రశ్నించింది. వారి నుంచి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అలాంటప్పుడు గతంలో ఇదే ప్రాసిక్యూషన్‌పై అనుమానం ఎందుకు వ్యక్తం చేశారని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి నమ్మకం వ్యక్తం చేసినందుకు ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

రేవంత్‌కు రిపోర్టు చేయాల్సిన అవసరం లేదు

కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎం రేవంత్ రెడ్డికి నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రత్యేక ప్రాసిక్యూషన్‌కు పూర్తి స్థాయిలో సహకరించాలని చెప్పింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆర్యమ సుందరం ప్రస్తావించగా, రేవంత్‌రెడ్డి స్థానంలో మరొకరిని నియమించారని రోహత్గీ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగ బద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు మరోసారి హితవు పలికింది. "ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు సరి కాదు. క్షమాపణలను స్వీకరిస్తున్నప్పటికీ కోర్టు ఆదేశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని మరోసారి సూచిస్తున్నాం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఉపాధ్యాయుల సర్దుబాటు!

- విద్యార్థి, టీచర్ నిష్పత్తిపై సర్కారు దృష్టి
- కలెక్టర్లకు అధికారాలు.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉన్నారు. జాతీయ స్థాయితో పోలిస్తే రాష్ట్రంలో ఈ నిష్పత్తి మెరుగ్గానే ఉంది. అయితే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉంది. దీన్ని సరిదిద్దాలని సర్కారు నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను సర్దుబాటు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ సర్దుబాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి అధికారాలను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. విద్యార్థుల సంఖ్యను అనుసరించి ఆయా పాఠశాలల్లో ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేయాలనే విషయమై గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. సాధారణంగా ప్రాథమిక పాఠశాలల్లో 1-10 మంది విద్యార్థులుంటే ఒక టీచర్; 11-60 మంది ఉంటే ఇద్దరు; 90 మంది ఉంటే ముగ్గురు; 120 మంది ఉంటే నలుగురు; 150 మంది ఉంటే ఐదుగురు; 200 మంది విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అయితే విద్యార్థుల సంఖ్యతో పాటు సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉండాలి. ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు మూడు పాఠశాలలను ఒకే పాఠశాలగా పరిగణించి, అక్కడ పనిచేస్తున్న టీచర్లు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేస్తారు. వీలైనంత వరకు దగ్గరలోని స్కూళ్లకే ఈ సర్దుబాటు చేస్తారు. అలా సాధ్యం కాకపోతే అదే మండల పరిధిలోని ఇతర పాఠశాలలకు పంపిస్తారు. ఈ నెల 28లోపు ఈ సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు.

ఉగ్రవాదం, మావోయిజాన్ని తుడిచిపెట్టేశాం

- మిగిలినట్లు గుర్తిస్తే కూకటివేళ్లతో పెకిలించండి
- యువ ఐపీఎస్‌లతో కేంద్రమంత్రి నిత్యానందరాయ్

హైదరాబాద్, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదం, మావోయిజం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ అన్నారు. ఎక్కడైనా ఇవి మిగిలిపోయినట్లు గుర్తిస్తే కూకటివేళ్లతో సహా పెకిలించాలని యువ ఐపీఎస్‌లకు ఆయన పిలుపునిచ్చారు. నేరాల కట్టడిలో భాగంగా నిందితుల కంటే రెండడుగులు ముందుగానే ఆలోచించి అడ్డుకోవాలన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శుక్రవారం నిర్వహించిన దీక్షాంత్ పరేడ్‌లో 76వ ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్)బ్యాచ్‌కు చెందిన 188 మంది ప్రొబేషనరీ ఐపీఎస్‌లు, భూటాన్, మాల్దీవులు సహా స్నేహపూర్వక దేశాలకు చెందిన 19 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి నిత్యానందరాయ్.. ప్రొబేషనరీ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశసేవే లక్ష్యంగా వృత్తి జీవితంలో కొనసాగాలన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సైద్ధాంతిక, ప్రాక్టికల్ శిక్షణతోపాటు నూతన నేర చట్టాలు, సైబర్ నేరాల నియంత్రణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిలోనూ శిక్షణ అందించినట్లు చెప్పారు. కాగా బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనర్‌గా నిలిచిన విశ్వజీత్ శౌర్యన్‌కు ఐపీఎస్ అసోసియేషన్ గౌరవ ఖడ్గాన్ని కేంద్ర మంత్రి బహూకరించారు. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ ట్రోఫీ ఫర్ పోలీస్ సైన్స్ పతకాన్ని అచ్యుత్ అశోక్‌కు, మణిపూర్ కప్ ఆఫ్ లా పతకాన్ని సోనాలి మిశ్రా, టాప్‌కప్ ఆఫ్ ఎక్యుటేషన్ పతకాన్ని ఆయుష్ యాదవ్, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విదేశీ అధికారుల్లో రాయల్ భూటాన్ పోలీస్‌కు చెందిన లెఫ్టినెంట్ కింగ్సా షైరీ, రాయల్ భూటాన్ పోలీస్‌కు చెందిన లెఫ్టినెంట్ ఫుంషో వేలకు పతకాలు అందజేశారు.

ధ్యానం జీవితానికి దిశను చూపుతుంది

- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ

నందిగామ, సెప్టెంబరు 20: ధ్యానం జీవితానికి దిశను చూపుతుందని, మనసుకు స్థిరత్వాన్ని ఇస్తూ జీవితంలో ఎదిగేలా చేస్తుందని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన రైజింగ్ విత్ కైండ్‌నెస్ అంతర్జాతీయ యూత్ సెమినార్‌ను ఆయన రాంచంద్రమిషన్ అధ్యక్షుడు గురూజీ కమలేష్ పటేల్, ఆయా శాఖల ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ముందు మనసును నిర్మలంగా ఉంచుకోవాలన్నారు. నిబద్ధత, అంకితభావంతో ముందుకెళ్తే విజయం సాధిస్తారన్నారు. అనంతరం కేంద్రమంత్రి మన్సుఖ్.. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు.

చెవి ఎముక స్థానంలో టెఫ్లాన్ పిస్టన్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 20: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి అనుబంధ మెడికల్ కళాశాల వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. కొండపాక మండలం వెలికట్ట గ్రామానికి కోల్‌కతా నుంచి మహమ్మద్ అంజద్ వలస వచ్చాడు. వినికిడి సమస్యతో బాధపడుతున్న అంజద్.. ఈ నెల 16న సిద్దిపేటలోని జీజీహెచ్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. పరీక్షించిన వైద్యులు కర్ణభేరి వద్ద ఉండే మూడు ఎముకల్లో ఓ ఎముక గట్టిపడటంతో సమస్య ఏర్పడిందని గుర్తించారు. ఈఎన్‌టీ వైద్యుడు, ప్రొఫెసర్ నాగరాజు ఆధ్వర్యంలోని వైద్య బృందం శుక్రవారం ఎండోస్కోపి సెపిడెక్టమీ పతద్ధతిలో ఆపరేషన్ లేకుండా చెవి నుంచి గట్టిపడిన ఎముకను తీసేశారు. ఆ స్థానంలో టెఫ్లాన్ పిస్టన్‌ను అమర్చారు. ఈ మేరకు వైద్యకాలేజీ డైరెక్టర్ విమలాథామస్, సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

నా ఆరోపణలు అవాస్తవం

- ఏపీ ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీలోని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించారని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరఫు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ఈ వ్యవహారంపై ఈనెల 25న తగిన ఉత్తర్వులు ఇస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

సింగరేణి కార్మికులకు దసరా బొనాంజా

లాభాల్లో 33% బోనస్ ప్రకటించిన ప్రభుత్వం

సగటున ఒక్కొక్కరికి రూ.1.90 లక్షల లబ్ధి

హైదరాబాద్, గోదావరిఖని, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సంస్థ లాభాల్లో 33 శాతం బోనస్ కింద ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,412 కోట్లను లాభంగా యాజమాన్యం ప్రకటించింది. ఇందులోంచి రూ.796 కోట్లు కార్మికులకు పంపిణీ చేయనున్నారు. సగటున ఒక్కొక్కరికి రూ.1.90 లక్షలు దక్కనున్నాయి. దసరాలోపే ఈ మొత్తం కార్మికులకు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో 25 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకూ రూ.5వేల చొప్పున బోనస్ ఇవ్వనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ అనంతరం మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి లాభాల వాటాను ప్రకటించారు. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు అగ్రభాగాన నిలిచారని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంలో వారి పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనంతరం సింగరేణి లాభాలు, సంస్థ విస్తరణ, బోనస్‌కు సంబంధించిన వివరాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విలేకరులకు వివరించారు. 2023-24లో 70 మిలియన్ల బొగ్గు ఉత్పత్తితో సింగరేణి రూ.4,701 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని.. సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా మిగిలిన రూ.2,412 కోట్లలో మూడో వంతు (రూ.796 కోట్ల)ను కార్మికులకు బోనస్‌గా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. సంస్థలో 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారని చెప్పారు.

విస్తరణకు ప్రాధాన్యం

సింగరేణి లాభాలను భవిష్యత్ అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని భట్టి చెప్పారు. అదనంగా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపనతో పాటు రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్‌లోని థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో మరో కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్‌కో-సింగరేణి సంయుక్త భాగస్వామ్యంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్ 2,400 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం గురుకుల పాఠశాలలు, సమీకృత పాఠశాలలు, ఏరియా ఆస్పత్రుల ఆధునికీకరణతో పాటు హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని భట్టి వెల్లడించారు.

నిరుటి కంటే 1 శాతం ఎక్కువ..

సింగరేణి కార్మికులకు 2022-23లో లాభాల బోనస్ కింద 32 శాతం (రూ.711 కోట్లు) ఇవ్వగా ఈసారి ఒక శాతం పెంచారు. నిరుడు ఒక్కో కార్మికుడికి బోనస్‌గా రూ.1.70 లక్షలు అందగా, ఇప్పుడు రూ.20 వేలు అదనంగా దక్కనున్నాయి. సంస్థలోని 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ప్రకటన మరో బోనస్.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్యశక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూమండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం

సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) వాతావరణం: ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుబాషలో ఆట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్పియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలిపొరను వాతావరణం అంటారు.

● భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సీజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలక పాత్ర ఉంది.

● వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

● వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.

● వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.

● గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

● ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)

● **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ

● **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.



వాతావరణం లక్షణాలు

● దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒక చోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.

● ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.

● భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.

● వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.

● **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.

● **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) జీవ అనుఘటకాలు: వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) నిర్జీవ అనుఘటకాలు: ఇవి మూడు రకాలు

1) శీతోష్ణస్థితిపరమైనవి: కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) భౌతికపరమైనవి: గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) రసాయనికపరమైనవి: సేంద్రీయపరమైన కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్, నిరింద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ



వి. వెంకట్‌రెడ్డి

సీనియర్ ఫ్యాకల్టీ

వాతావరణ సంఘటనం

వాతావరణం ఘన, ద్రవ, వాయు పదార్థాలతో ఏర్పడి ఉంటుంది. అవి-

1. ఘన పదార్థాలు: భూ ఉపరితలం నుంచి వాతావరణంలోకి చేరే దుమ్ము, ధూళి రేణువులు, కాలుష్య కణాలే వాతావరణంలోని ఘన పదార్థాలు. ఇవి పరిమితికి మించి చేరితే వాతావరణ పారదర్శకత దెబ్బతిని ఎదురుగా ఉన్న వస్తువులు మన కంటికి కనిపించకపోవడం, వాతావరణం కాలుష్యానికి లోనవుతుంది.

2. ద్రవ పదార్థాలు: వాతావరణంలోకి చేరి నీటి ఆవిరిని ద్రవ పదార్థంగా పేర్కొనవచ్చు.

3. వాయు పదార్థాలు: క్లోరిన్ తప్ప మిగిలిన అన్ని వాయు పదార్థాలు భూ వాతావరణంలో ఉన్నాయి.

వాతావరణంలోని వివిధ వాయువులు

(1) నైట్రోజన్- 78.09% (2) ఆక్సిజన్- 20.94%

(3) ఆర్గాన్- 0.93%

(4) కార్బన్ డై ఆక్సైడ్- 0.03%

(5) మీథేన్, ఇతర వాయువులు- 0.01%

నైట్రోజన్(78.09%): వాతావరణంలో అధిక శాతంలో ఉన్న వాయువు ఇది.

● ఇది వృక్ష ప్రపంచానికి ముఖ్యంగా లెగ్యుమినేసి మొక్కలకు వరప్రసాదం. దీని ద్వారానే వృక్షాలు నత్రజని తయారుచేసుకుని వాటి పెరుగుదలలో వినియోగించుకుంటాయి.

ఆక్సిజన్(20.94%): - ఆక్సిజన్‌ను ప్రాణ వాయువు అని అంటారు. కారణం జీవుల శ్వాస క్రియలో కీలకపాత్ర పోషిస్తుంది.

● వాతావరణంలోని ఆక్సిజన్ దహన ప్రక్రియను స్థిరీకరించే ముఖ్యమైన వాయువు.

● సూర్యుని నుంచి భూమి వైపు ప్రసరించే ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాలను హరింపచేస్తుంది.

● ఓజోన్ వాయువు ఏర్పడ్డంలో కీలకపాత్ర పోషిస్తుంది.

ఆర్గాన్(0.93%): దీనిని ఎలక్ట్రిక్ బల్బుల్లో ఉపయోగిస్తారు.

● వాతావరణంలోని అధిక శాతంలో ఉన్న జడ వాయువు ఇది

కార్బన్ డై ఆక్సైడ్(0.03%): ఇది మొక్కల కిరణజన్య సంయోగక్రియలో ప్రధానపాత్ర వహిస్తూ ఆహారోత్పాదనను చేపట్టడంలో ముఖ్యపాత్ర వహించే వాయువు.

● గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన ప్రధాన వాయువు. దీనినే ప్రయోగశాలల్లో బొగ్గు పులుసు వాయువు అని కూడా పిలుస్తారు.

● వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ నీటి ఆవిరి 90 కి.మీ. ఎత్తు వరకు మాత్రమే ఉంటుంది. ఆక్సిజన్ 120 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది.

అడ్మిషన్స్

ఎన్ఐఐలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23

అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్: అక్టోబరు 7

ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: అక్టోబరు 27

ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల: నవంబరు 10

ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు: నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు

ప్రోగ్రామ్ ప్రారంభం: 2025 జనవరి 1 నుంచి

వెబ్‌సైట్: www.nii.res.in



వోక్సెన్ యూనివర్సిటీకి మూడో స్థానం

ఎంబీఏ కోర్సుల నిర్వహణలో వోక్సెన్ యూనివర్సిటీకి **ఇండియాలో** మూడో ర్యాంకు లభించింది. ప్రముఖ బిజినెస్ స్కూళ్ల ఐఐఎం బెంగళూరు, ఇండియన్ బిజినెస్ స్కూల్(ఐబీఎస్) సరసన వోక్సెన్ వర్సిటీ నిలిచింది. అదేవిధంగా బ్లూంబర్గ్ బెస్ట్ స్కూల్ బీ-స్కూల్ ర్యాంకింగ్స్-2024 జాబితాలో ఏసియా పసిఫిక్ రీజియన్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. కాగా, 2025 విద్యా సంవత్సరానికి గాను వివిధ ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వర్సిటీ తెలిపింది. ఎంబీఏలో జనరల్, బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. పూర్తి సమాచారం https://woxsen.edu.in/ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

జాబ్ కార్నర్

ఈఎస్ఐసీ హైదరాబాద్‌లో స్పెషలిస్ట్ ఖాళీలు

సనత్‌నగర్(హైదరాబాద్)లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. సూపర్ స్పెషలిస్ట్(ఎంట్రీ లెవల్): **2 పోస్టులు**
2. స్పెషలిస్ట్(సీనియర్ స్కేల్): **2 పోస్టులు**

విభాగాలు: ఆప్తాల్మాలజీ, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ, నియోనాటాలజీ

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: స్పెషలిస్ట్ పోస్టులకు 69 ఏళ్లు, సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు 74 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు స్పెషలిస్ట్ పోస్టులకు రూ.1,63,116; సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు రూ.2,00,000.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/మహిళ/ఎక్స్ సర్వీస్‌మన్/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 25

వేదిక: అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ హాస్పిటల్, సనత్‌నగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://www.esic.gov.in/

సెయిల్‌లో మెడికల్ ఆఫీసర్లు

రూర్కెలా(ఒడిశా)లోని ప్రభుత్వరంగ సంస్థ- స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 11**

1. సూపర్ స్పెషలిస్ట్(బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ): **1 పోస్టు**
2. స్పెషలిస్ట్(డెర్మటాలజీ): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 69 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు రూ.2,50,000; స్పెషలిస్ట్ పోస్టులకు రూ.1,60,000; జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.90,000. **ఇంటర్వ్యూ తేదీ:** సెప్టెంబరు 24

వేదిక: కాన్ఫరెన్స్ హాల్, ఇస్పత్ జనరల్ హాస్పిటల్(ఐజీహెచ్), సెక్టార్-19, రూర్కెలా.

వెబ్‌సైట్: https://www.sail.co.in/

SCHOLARSHIP ALERT



Description: A CSR initiative by DXC Technology that aims to support the educational/sports expenses of students who belong to marginalized groups.

DXC Progressing Minds Scholarship

Eligibility: Women and transgender students pursuing graduation any year in STEM-related fields are eligible.

● Female athletes aged between 13 to 25 years and who have represented the state/country at the state/ national/ international level in the last 2/3 years can also apply.

● For students pursuing graduation, they must have obtained a minimum of 60% marks in their previous class/semester.

● Applicants annual family income must be less than or equal to 4,00,000 (5,00,000 for sportspersons).

Prizes & Rewards: For Graduation in STEM - 50,000

For Sportspersons: 1,25,000

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/DXCS4

Free Coaching for DNT Students under SEED Scheme

Description: An initiative by the Ministry of Social Justice and Empowerment, Government of India, to provide high-quality coaching to students belonging to De-notified Tribes (DNT), Nomadic Tribes (NT), and Semi-Nomadic Tribes (SNT).

Eligibility: Open for students belonging to De-notified, Nomadic, and Semi-Nomadic Tribes. Must be willing to pursue coaching for competitive examinations after Class 12th, such as JEE, NEET, CLAT, NDA, Non-Commissioned Military Ranks, CA-CPT, Banking, Insurance, PSU, SSC, RRB, State & Central Police, etc. Annual family income must be 2,50,000 or less. Must be either in Class 12th or have passed Class 12th. Class 12th passed students must have secured minimum qualifying marks required for competitive exams in Class 12 (depending on the competitive exam for which the candidate wishes to appear) whereas the current Class 12th students must have secured at least 50% in Class 10. Must not be availing of similar benefits (waiver for coaching classes) from any other Central Government or State Government Scheme.

Prizes & Rewards: Coaching fees of up to 1,20,000 and additional benefits

Last Date to Apply: 13-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/FCDNT1

buddy4study.com

లిటిల్స్

కప్ప-ముత్యం

అనగనగా ఒకఅడవిలో కొలనులో ఉండే కప్పకు అదే చోట ఉండే హంసతో మంచి స్నేహం కుదిరింది. కొన్ని రోజుల్లోనే అవి రెండూ ప్రాణ స్నేహితులయ్యాయి. ఒకసారి కప్ప కొలనులోని తామరాకు మీద తేలుతూ, హంస ఒడ్డున నిలబడికబుర్లు చెప్పుకుంటున్నాయి.

ఈలోగా ఎక్కడినుండి చూసాడో ఒక వేటగాడు చెట్టు చాటునుండి వచ్చి హంస మీదకు వల విసిరాడు. ఆ వలనుండి తప్పించుకోలేక పాపం హంస విలవిల్లాడింది, కప్ప ఆ వేటగాడిని చూసి, దయచేసి నా నేస్తాన్ని వదిలిపెట్టు అని ప్రాధేయపడింది. దానికి వేటగాడు

నేను పతలను దీన్ని సంతలో అమ్మితే చాలా డబ్బు వస్తుంది' అన్నాడు అది విన్న కప్ప నీకు డబ్బే కదా కావలసింది?' అంటూ నీటిలో మునిగి ఒక ముత్యంతో తిరిగి వచ్చి వేటగాడితో ఇలా అన్నది. 'ఈ ముత్యం తీసుకో. దీన్ని అమ్ముకున్నానీకు చాలా సొమ్ము వస్తుందిఇది తీసుకుని నా స్నేహితురాలిని విడిచిపెట్టు' ఆ ముత్యం తీసుకుని, వేటగాడు హంసను వదిలేసి

వెళ్లిపోయాడు. అతను ఇంటికి వెళ్లి జరిగినదంతా తన భార్యతో చెప్పాడు ఆమె అంతా విని,

'ఆ కప్ప దగ్గర ఇంకా చాలాల ముత్యాలు ఉండి ఉంటాయి. ఇవాళే వెళ్లి, అవన్నీ తీసుకురా అన్నది. ఆ మర్నాడు వేటగాడు కొలను దగ్గరకు వెళ్లి, కప్పతో 'ఏయ్ నీ దగ్గర ఉన్న ముత్యాలన్నీ నాకు ఇచ్చెయ్ లేదంటే హంసను తీసుకెళ్లిపోతాను అని బెదిరించాడు. దానికి కప్ప

ఏదీ నీ దగ్గరున్న ముత్యం ఓసారిలా ఇవ్వు, దాన్ని చూసి, అచ్చం అలాంటి ముత్యాలే వెతికి తీసుకొస్తాను'అని ముత్యం తీసుకుని చటుక్కున నీళ్లలో దూకింది పోతూపోతూ, నా నేస్తం ఎపుడో దాక్కుంది. మేము నీకు దొరకము. అత్యాశతో నీ వద్ద ఉన్న ఒక్క ముత్యం కూడా పోగొట్టుకున్నావు' అన్నది. అనవసరంగా మంచి ముత్యాన్ని వదులుకున్నాను కదా అని వేటగాడు బాధ పడ్డాడు. అంత ఉపాయంతో తన ప్రాణాలు కాపాడిన కప్పకు కృతజ్ఞతలు చెప్పింది హంస. అప్పటినుండి ఆ రెంటి స్నేహం మరింత బలపడింది.

10 తేడాలను కనిపెట్టండి






సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 415

						7		
6	9	3			7			4
	8		6		3			
		8		4		2	1	
			3		1			
	4	5		2		6		
			4		6		2	
4			1			3	7	5
		9						

సుడోకు - 414 సమాధానం

2	7	9	3	4	1	8	6	5
6	3	5	2	8	7	4	9	1
1	8	4	6	5	9	3	7	2
7	9	2	8	1	6	5	3	4
4	5	3	7	9	2	1	8	6
8	6	1	4	3	5	9	2	7
3	2	8	1	7	4	6	5	9
5	4	6	9	2	8	7	1	3
9	1	7	5	6	3	2	4	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.